www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


ఆదివారం | 23-2-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 309 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: దశమి మ. 1.56 తదుపరి ఏకాదశి, నక్షత్రం: మూల రా. 6.49 తదుపరి పూర్వాషాఢ వర్జ్యం: సా. 5.02-6.43, తె. 4.25-6.02, దుర్ముహూర్తం: సా. 4.43-5.29, అమృతఘడియలు: మ. 12.02-1.42, రాహుకాలం: సా. 4.30-6.00, సూర్యోదయం: 6.40, సూర్యాస్తమయం: 6.16 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టన్నెల్‌లో ప్రాణాలు!



కూలిన ఎస్‌ఎల్‌బీసీ సొరంగం

చిక్కుకుపోయిన 8 మంది కార్మికులు, ఉద్యోగులు



ప్రమాదం జరిగిన నాగర్‌కర్నూలు జిల్లాలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్

- టీబీఎం తవ్వకం జరుపుతుండగా కూలిన పైకప్పు
- ప్రాణాలతో బయటపడ్డ 46 మంది సిబ్బంది
- సొరంగంలోకి 8 మీటర్ల మేర చేరిన నీళ్లు, రాళ్లు
- 124 మీటర్ల దూరం వరకు ఊడి పడిన పెచ్చులు
- నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో
- టన్నెల్ ఇన్‌లెట్ వైపు 14వ కిలోమీటర్ వద్ద ఘటన
- సహాయక చర్యలు ప్రారంభం.. టన్నెల్‌లోకి ఆక్సిజన్
- చిక్కుకున్న వారిని కాపాడాలని సీఎం రేవంత్ ఆదేశం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- సంఘటనా స్థలానికి మంత్రులు ఉత్తమ్, జూపల్లి
- రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- సీఎం రేవంత్‌కు ప్రధాని నరేంద్రమోదీ ఫోన్
- అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసా
- ఆ 8 మందిని కాపాడుతాం: మంత్రి ఉత్తమ్
- ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి
- ఎన్డీఆర్ఎఫ్ బలగాలను పంపాలని షాకు విజ్ఞప్తి


ప్రమాదంలో ధ్వంసమైన యంత్ర సామగ్రి; నీటి లీకేజీ

నాగర్‌కర్నూల్/అచ్చంపేట/దోమలపెంట/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్‌లో భారీ ప్రమాదం సంభవించింది. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)తో సొరంగం తవ్వుతుండగా.. పైకప్పు కూలింది. శ్రీశైలం నుంచి మన్నెవారిపల్లి వైపు నీటిని తరలించే ఇన్‌లెట్ భాగం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. టన్నెల్‌లో రాళ్లు, మట్టి పడటంతోపాటు పెచ్చులు ఊడిపడ్డాయి. దీంతో టన్నెల్‌లో పనిచేసేందుకు వెళ్లిన కార్మికులు, ఉద్యోగుల్లో 8 మంది అందులో చిక్కుకుపోయారు. 46 మంది ప్రాణాలతో బయటపడ్డారు. టన్నెల్‌లో 8 మీటర్ల మేర నీరు చేరడం, 124 మీటర్ల దూరం వరకు పెచ్చులూడి పడటంతో తక్షణ సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో అత్యవసరంగా మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆరా తీసి.. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రమాదంలో

మిగతా 13వ పేజీలో...

నిర్లక్ష్యమే కారణమా?

- గతంలోనూ ఊట నీరుతో పనులకు బ్రేక్
- 10 రోజుల క్రితమే పరిశీలించిన జీఎస్ఐ
- ఓకే అన్నాకే 4 రోజుల క్రితం ప్రారంభం
- పది మీటర్లైనా తవ్వకముందే ప్రమాదం
- శ్రీశైలం ఎఫ్ఆర్ఎల్ కంటే దిగువకు టన్నెల్.. తరచూ ఊట నీరు వచ్చే చాన్స్
- జీఎస్ఐ అనుమతి ఎలా ఇచ్చింది?

ఎస్ఎల్‌బీసీకి ఆది నుంచీ ఆటంకాలే! 13



ఆక్సిజన్ సిలిండర్లతో వెళ్తున్న సహాయక సిబ్బంది



సీఎంకు జ్యోతిబాపూలే చిత్రపటాన్ని అందిస్తున్న కాంగ్రెస్ బీసీ నేతలు. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

కులగణన.. తప్పెట్లా?

ఏ ఇంట్లో తప్పు రాసుకొచ్చామో చూపండి

- కేసీఆర్, కిషన్‌రెడ్డిలకు సీఎం సవాల్.. కులగణన వద్దంటూ నాపై ఎన్నో ఒత్తిళ్లు
- పారదర్శకంగా కులగణన.. మనం తేల్చిన లెక్క నూటికి నూరు శాతం పక్కా
- సర్వేలో పాల్గొనకుండా ఫాంహౌస్‌లో ఉన్నోడు మంచోడైండు..
- నన్ను విలన్‌ను చేశారు.. చిన్న చిన్న తప్పులంటూ పార్టీ నేతలు మాట్లాడొద్దు
- కులగణన డాక్యుమెంట్‌కు బీసీ నేతలు ఓనర్‌షిప్ తీసుకోవాలి
- మార్చి 10 లోగా కులాల వారీగా భేటీల్లో లెక్క పక్కా అని తీర్మానం చేయాలి
- బీసీలకు ఇదే బైబిల్, భగవద్గీత, ఖురాన్.. కాంగ్రెస్ బీసీ నేతలతో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన కులగణన ఎట్లా తప్పో చెప్పాలంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేయడం కాదని, రాష్ట్రంలోని ఏ బ్లాక్‌లోని ఏ ఇంట్లో లెక్క తప్పు జరిగిందో చూపాలన్నారు. కులగణన లెక్కలను అసెంబ్లీలో పెట్టి, వాటికి చట్టబద్ధత కల్పిస్తే.. ముఖ్యమంత్రిగా తన బాధ్యత అయిపోయినట్లేనని, అక్కడి నుంచి ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత

మిగతా 2వ పేజీలో...

స్వర్ణ విమాన గోపురం నేడు ప్రారంభం

యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ 2

14,236 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ!

- ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం
- కోడ్ ముగియగానే నోటిఫికేషన్లు

యాదాద్రి జిల్లాలో బర్డ్‌ఫ్లూ

- రాష్ట్రంలో తొలి బర్డ్‌ఫ్లూ కేసు
- స్వాములవారి లింగోటంలో ఐదు వేల కోళ్ల మృత్యువాత
- మరో 9 వేల కోళ్ల పూడ్చివేత
- చౌటుప్పల్‌లో 2వేల నాటుకోళ్ల మృతి.. బర్డ్‌ఫ్లూ కాదన్న వైద్యులు

14



నేలపట్లలో మృతిచెందిన కోళ్లు



పాల పొడి డబ్బాను చూపుతున్న చిన్నారుల తల్లి

నాలుగు నెలల కవలల మృతి

- నిద్రపుచ్చాక ముక్కులోంచి పాలు.. పరిస్థితి విషమం
- ఆస్పత్రికెళ్లేలోపే మృతి.. భూపాలపల్లిలో విషాదం
- పాల పొడరే కారణమన్న కుటుంబ సభ్యులు

14

టీచర్ కొట్టాడని.. పాఠశాల భవనంపై నుంచి దూకి..

- 13 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య.. ఉప్పల్‌లో ఘటన
- సీసీ కెమెరాను పట్టుకున్నందుకు పీఈటీ చెంపదెబ్బ
- నాలుగో అంతస్తు నుంచి దూకిన విద్యార్థి

14

నడిరోడ్డుపై కన్నతండ్రిని చంపిన కొడుకు

హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఘటన

రేవంత్.. చర్చకు సిద్ధమా?

- కేంద్రం నిధులు, రాష్ట్ర అభివృద్ధితో పాటు.. 6 గ్యారెంటీలు, అవినీతిపైనా మాట్లాడదాం
- కేసుల్లో అరెస్టు చేయకుండా రాజీకోసం కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు కేసీఆర్ ముడుపులు
- ఐదుగురు మంత్రుల ఆధిపత్యం.. 15% కమీషన్ లేనిదే నిధులివ్వడం లేదు: సంజయ్

3



కొత్త పలుకు

వికటించిన వీధి నాటకం!



జాతీయ స్థాయిలో ఎన్డీయేకు పోటీగా రూపుదిద్దుకున్న ఇండియా కూటమి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇండియా కూటమిలో బలంగా కనిపించిన కేజ్రీవాల్ ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో భారతీయ జనతా పార్టీని ఇప్పుడు ఢీకొనగల నాయకులు జాతీయ స్థాయిలో కొరవడ్డారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తమ రాష్ట్రాలలో బలంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో ప్రభావం చూపగల నాయకులు కాదు. ఈ క్రమంలో ప్రధాని తదుపరి టార్గెట్ మమతా బెనర్జీ కావొచ్చు. గతంలో భారతీయ జనతా పార్టీని మాత్రమే బలోపేతం చేయడానికి ప్రయత్నించిన ప్రధాని మోదీ ఇప్పుడు ఎన్డీయేను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు.

ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబుకు మరింతగా ప్రాధాన్యం ఇస్తున్నారు. కేంద్రంలో తనకు పెరిగిన పరపతితో రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి ఆయన ప్రయత్నాలు మొదలెట్టారు. ఫలితంగా కేంద్రం నుంచి వివిధ పథకాలకు భారీగా ఆర్థిక సహకారం అందుతోంది. ప్రతిపాదిత పథకాలన్నీ కార్యరూపం దాల్చితే ఏపీలో అభివృద్ధి పుంజుకుంటుంది. కేంద్రంలో పెరిగిన చంద్రబాబు ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత జగన్ దాడిని ఉధృతం చేశారు.

కేంద్రం వద్ద తనకు ఉన్న పలుకుబడిని స్వప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల కోసం ఉపయోగించడంలో చంద్రబాబుకు ట్రాక్ రికార్డు ఉంది. 1999-2004 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న వాజపేయి ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి పనికి ఆహారం పథకం కింద భారీగా బియ్యం కేటాయించేలా కృషి చేశారు. ఇప్పుడు కూడా ఆ దిశగానే కృషి చేస్తున్నారు. విశాఖ ఉక్కుకు ప్రైవేటు ముప్పు తప్పించగలిగారు. పోలవరం, రాజధానికి నిధులు సాధించారు.

వంచనతో కూడిన రాజకీయాలు అన్ని వేళలా పనిచేయవు. జగన్ ఎటువంటివారో, ఆయన పాలన ఎలా ఉంటుందో ప్రజలు తెలుసుకున్నారు. ప్రస్తుతానికి చంద్రబాబుకు గ్రహాలు అనుకూలంగా ఉన్నట్టున్నాయి. కేంద్రంలో ఆయనకు పరపతి పెరుగుతోంది.

పరిస్థితులు అనుకూలించే వరకు వేచి ఉండకుండా తొందరపడి ఒక కోయిల ముందే కూసింది అన్నట్టుగా జగన్ వ్యవహరించడం, ఆందోళనలకు పిలుపునివ్వడం ఆయనకు మంచిది కాదని ఎవరు చెప్పాలి?

పట్టభద్రుల హోరాహోరీ

సిటింగ్ స్థానాన్ని దక్కించుకోవాలని సర్వశక్తులు ఒడ్డుతున్న కాంగ్రెస్

- ఎలాగైనా సత్తా చాటాలన్న పట్టుదలతో బీజేపీ
- బీసీ నినాదంతో దూసుకెళ్తున్న బీఎస్పీ అభ్యర్థి
- త్రిముఖ పోరుగా మారడంతో సర్వత్రా ఉత్కంఠ
- మరో రెండు రోజుల్లో ముగియనున్న ప్రచారం



కరీంనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతుండగా... ఉత్తర తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేయనున్న ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా రానున్న కాలం తమదేననే సంకేతాలివ్వాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. గ్రాడ్యుయేట్ ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు ఈ రెండు ప్రధాన పార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండగా.. బీఎస్పీ, ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థులు రంగంలో నిలిచి ప్రధాన పార్టీ అభ్యర్థులకు చెమటలు పట్టిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ప్రచారం ముగియనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌కు మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, బీజేపీకి మద్దతుగా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ ప్రచార బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 15 కొత్త జిల్లాలు... 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉంది. 3,55,159 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈనెల 27న పోలింగ్ జరుగనుండగా 25న సాయంత్రం అభ్యర్థుల ప్రచారం ముగియనుంది. ఈ స్థానం నుంచి 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినా... ఉపసంహరణ అనంతరం 56 మంది బరిలో మిగిలారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికకు దూరంగా ఉండగా, కాంగ్రెస్, బీజేపీ మాత్రం వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తూ ముందుకు సాగుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధిపతి నరేందర్‌రెడ్డి

మిగతా 3వ పేజీలో...

సన్నాసులకు పాలన చేతనైతలేదు



విలేకరుల సమావేశంలో కేటీఆర్

- ఏడాది పాలనలో అన్ని రంగాలకు చావుదెబ్బ
- రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై సీఎం చెప్పేవన్నీ అబద్ధాలే
- రేవంత్ మూతిమీద కొట్టినట్లుగా భట్టి వాస్తవాలు చెప్పారు
- కేసీఆర్‌లా రాష్ట్రాన్ని ఎవరూ అభివృద్ధి చేయలేరు
- తెలంగాణను క్యాన్సర్‌తో పోల్చిన దుర్మార్గుడు రేవంత్
- గ్యారెంటీలు అమలు చేసిన చోటే కాంగ్రెస్ పోటీ చేయాలి
- రేవంత్, బండి సంజయ్.. ఆర్ఎస్ బ్రదర్స్
- రేవంత్ సర్కార్‌ను కాపాడుతున్న బీజేపీ: కేటీఆర్

2

గురుకులాలాలకు కార్పొరేషన్ పెట్టండి

- ప్రభుత్వ స్కూళ్లలో వసతులను మెరుగుపరచండి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విద్యా కమిషన్ సూచనలు
- మొత్తం మూడు అంశాలపై 70 పేజీల ప్రాథమిక నివేదిక
- విద్యా రంగంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తాం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సోషల్ వెల్ఫేర్ గురుకులాలకు ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరింది. విద్యార్థులకు కావాల్సిన ఆహార పదార్థాలు, కాస్మెటిక్ చార్జీలను కార్పొరేషన్ ద్వారా అందించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని, పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలని కోరింది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతంపై కమిషన్ రూపొందించిన ప్రాథమిక నివేదికను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి.. సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, చారగొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి శనివారం ముఖ్యమంత్రికి సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, మధ్యాహ్న భోజనం-గురుకులాలకు ప్రత్యేక కార్పొరేషన్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ.. అనే మూడు అంశాలపై కమిషన్ 70 పేజీల ప్రాథమిక నివేదికను అందించింది. ఈ సందర్భంగా శనివారం తన నివాసంలో కమిషన్ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ బడులు దూరంగా ఉన్న చోట పిల్లలు పాఠశాలలకు దూరమవుతున్నారని, అలాంటి ప్రాంతాల్లో విద్యార్థుల కోసం ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని కమిషన్ కోరింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ సమస్యలను ముఖ్యమంత్రికి వివరించి.. పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై ముసాయిదా బిల్లును సమర్పించింది. అన్ని అంశాలపై కమిషన్ సూచనల అనంతరం సీఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతోపాటు, విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యా రంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

సామాజిక న్యాయానికి నమూనాగా తెలంగాణ

- దేశంలో కాంగ్రెస్‌కు ఊపునివ్వాలి: రాహుల్
- మధు యాష్కీతో కాంగ్రెస్ అగ్రనేత చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు తెలంగాణ ఒక నమూనాగా ఉపయోగపడాలని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ కులగణన జరిపించిన తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే.. ఇందులో వచ్చిన నిర్ధారణల ఆధారంగా సామాజిక న్యాయం జరగాలన్నారు. ఇది దేశంలో కాంగ్రెస్‌కు ఊపునివ్వాలని.. కేంద్రం తెలంగాణ చట్టాన్ని గౌరవించినా, గౌరవించకపోయినా ఈ విషయంలో వెనుకంజ వేయకూడదని పేర్కొన్నారు. శనివారం మాజీ ఎంపీ మధు యాష్కీగౌడ్‌ను ఢిల్లీకి పిలిపించి కులగణన గురించి రాహుల్ చర్చించారు. కులగణన ఆధారంగా సామాజిక న్యాయాన్ని ఆచరణలో పెట్టేందుకు తగిన చర్యలు ఏ విధంగా తీసుకోవాలన్న దానిపై మేధావులు, జర్నలిస్టులు, ఇతర వర్గాలతో చర్చించి ఓ నివేదిక ఇవ్వాల్సిందిగా మధు యాష్కీని కోరారు. కాగా, ఢిల్లీలో పార్టీ నేతలను పక్క దోవ పట్టించేలా, వాస్తవాలను కప్పిపుచ్చి తప్పుడు విషయాలను ప్రచారం చేయడం కూడా అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇటీవల రేవంత్‌కు సూచనలివ్వడంతో పాటు దీపాదాస్ మున్షీ స్థానంలో రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్‌ను నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

పోలీసు క్వార్టర్లపై ప్రతిపాదనలు పంపండి

- పోలీసు శాఖ బడ్జెట్‌పై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

రాంనగర్/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసు క్వార్టర్లను నిర్మించాల్సిన అవసరం ఉందని, ఎక్కడెక్కడ అవసరాలున్నాయో వెంటనే ప్రతిపాదనలు పంపాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పోలీసు శాఖను ఆదేశించారు. పోలీసు శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడూ సురక్షితంగా జీవించాలని, దానికి తగినట్లు పోలీసు శాఖ భద్రత ప్రజలకు కల్పించాలని, ఆ శాఖ అవసరాలను పరిష్కరిస్తామని చెప్పారు. వాతావరణం, ఉపాధి అవకాశాల నేపథ్యంలో హైదరాబాద్‌కు, రాష్ట్రానికి వలసలు పెరుగుతున్నాయని, ఈ దృష్ట్యా పటిష్ఠమైన భద్రత కల్పించడంలో పోలీసు శాఖ సిద్ధం కావాలని సూచించారు. కాగా, కాంగ్రెస్ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని, దేశంలో బీసీ జనాభాను ఇప్పటివరకు శాస్త్రబద్ధంగా తేల్చలేదని, కానీ.. తెలంగాణ ప్రభుత్వం మొదటిసారిగా తేల్చిందని భట్టి అన్నారు. బీసీ కుల గణనను ఏ సర్వేతోనూ పోల్చలేరని, 2011లో జరిగిన జనగణనలో కేవలం ఎస్సీ, ఎస్టీ, ఇతర జనాభా లెక్కలనే వెల్లడించారని చెప్పారు. శనివారం ప్రజాభవన్‌లో జరిగిన బీసీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేపట్టిన బీసీ కుల గణన వివరాలను ఆయా వర్గాల ప్రయోజనం కోసం వినియోగిస్తామని ఆయన చెప్పారు. కాగా, బీసీ కాలేజీ హాస్టళ్ల మెస్, అద్దె, విద్యుత్తుకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని భట్టి విక్రమార్కను ఎంపీ కృష్ణయ్య కోరారు. ఈ మేరకు శనివారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు.

అంజనీకుమార్, అభిలాష రిలీవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఐపీఎస్ అధికారులు-- అంజనీకుమార్, అభిలాష బిష్త్‌లను శనివారం తెలంగాణ నుంచి రిలీవ్ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులను జారీచేశారు. ప్రస్తుతం రాష్ట్ర రహదారి భద్రతా ప్రాధికార సంస్థ చైర్మన్‌గా ఉన్న అంజనీకుమార్(1990 బ్యాచ్), తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న అభిలాష బిష్త్(1994 బ్యాచ్), కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి(2011 బ్యాచ్)లను తెలంగాణ నుంచి రిలీవ్ చేయాలంటూ ఈ నెల 19న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాన్ని ఆదేశించింది. ఈ నెల 27న మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ దృష్ట్యా అభిషేక్ మహంతిని రిలీవ్ చేయలేకపోయింది. ఈమేరకు అనుమతి కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాసింది. మిగతా ఇద్దరు అంజనీకుమార్, అభిలాష బిష్త్‌లను వెంటనే రిలీవ్ చేసింది.

నేడు రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణలో భాగంగా ఆదివారం కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. దాంతో సోమవారం నుంచి కమిషన్ విచారణ పునఃప్రారంభం కానుంది. ప్రస్తుతం విచారణ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఈ దఫా మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలవనుంది. ఇప్పటికే దీని కోసం సమన్లు సిద్ధమైనట్లు సమాచారం.

అధికారికంగా శ్రీపాదరావు జయంతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని మార్చి 2న అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈమేరకు దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం జారీ చేశారు.

8 మంది ఐపీఎస్‌ల బదిలీ

రాష్ట్రంలో ఎనిమిది మంది సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. హైదరాబాద్ అదనపు కమిషనర్(ట్రాఫిక్)గా ఉన్న విశ్వప్రసాద్ అదనపు కమిషనర్(క్రైమ్స్)గా బదిలీ అయ్యారు. డీఐజీ(సమన్వయం) కోఆర్డినేషన్స్ డీఐజీ డాక్టర్ గజరావ్ భూపాల్ సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా, ఆ స్థానంలో ఉన్న జోయల్ డేవిడ్ హైదరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్)గా, గవర్నర్ ఏడీసీగా సిరిశెట్టి సంకేత్ బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న నలుగురు యువ ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ కోవలో డి.రాంరెడ్డి(సీఐడీ ఎస్పీ), శ్రీధర్(ఇంటెలిజెన్స్ ఎస్పీ), చైతన్య కుమార్(హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ డీసీపీ), డి.నవీన్‌కుమార్(సీఐడీ ఎస్పీ) ఉన్నారు.

కులగణన లెక్క తప్పెట్లా?

(మొదటిపేజీ తరువాయి)


బీసీ నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో మహేశ్‌గౌడ్, పొన్నం

బీసీ నేతలదేనన్నారు. ప్రభుత్వం నిర్వహించిన కులగణన లెక్క పక్కా అంటూ కులాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసుకుని, తీర్మానాలను ఆమోదించాలంటూ కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలకు సూచించారు. ఈ ప్రక్రియను మార్చి 10లోపు పూర్తి చేయాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రజాభవన్‌లో పార్టీలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నేతల సమావేశం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కులగణన సర్వే నిర్వహించిన తీరును వివరించారు. "తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తే.. కులగణన చేసే బాధ్యతను తీసుకుంటామంటూ రాష్ట్ర ప్రజలకు రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు. ఆయన మాటను విశ్వసించిన ప్రజలు అధికారం కట్టబెట్టిన తర్వాత.. ఆ మాటను నిలబెట్టడం నా బాధ్యత. ఎదురయ్యే రాజకీయ పరిణామాలకు భయపడి.. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ కులగణన ప్రక్రియ చేపట్టే సాహసం చేయలేదు. మా ప్రభుత్వం.. ప్రజల్ని, ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో భాగస్వాములను చేసి, ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉత్తమ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం చర్చించి.. కోర్టుల్లో ఇబ్బందులు రాకుండా.. ప్రణాళిక శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించి, సర్వేను నిర్వహించాం. ప్రతి 150 ఇళ్లను ఒక క్లస్టర్‌గా తీసుకుని.. సర్వే జరిపాం. మొత్తం 1.03 లక్షల మంది ఉద్యోగులు 50 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి, సమాచారాన్ని సేకరించారు. ఆ సమాచారంపై సర్వేలో పాల్గొన్న ఇంటి యజమాని, ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్ సంతకాలుంటాయి. ఎన్యుమరేటర్ల పర్యవేక్షణలో 36 వేల మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆ సమాచారాన్ని క్రోడీకరించి కంప్యూటరీకరించారు.మాన్యువల్‌గా సేకరించిన 8 పేజీల సమాచారాన్ని.. క్లస్టర్ల వారీగా బండిల్స్ కట్టి భద్రపరిచాం" అని రేవంత్‌రెడ్డి వివరించారు. కులగణన తప్పంటున్న వారు.. ఏ బ్లాక్‌లో ఎక్కడ తప్పు జరిగిందో చెబితే.. ఆ కట్టను తెరిచి, వారికి చూపిస్తామన్నారు. భవిష్యత్తులో ఎవరైనా కోర్టులో కేసు వేసి, ప్రక్రియను నిర్వీర్యం చేసే అవకాశం ఇవ్వకుండా సమాచారాన్ని భద్రపరిచామని చెప్పారు. ఒక వైపు కులగణన ప్రక్రియను కుప్ప కూల్చే కుట్ర జరుగుతుంటే.. చిన్నాచితక తప్పులు జరిగితే సరిదిద్దుకుంటామంటూ పార్టీ నాయకులే మాట్లాడడం సరికాదన్నారు. "మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2011లో కులగణనకు సంబంధించి ఒక ప్రయత్నం జరిగింది. సమాచార సేకరణ జరిగినా.. పార్లమెంటు ముందుకు రాలేదు. బీసీ ప్రధానిని అని చెప్పుకొంటున్న మోదీ.. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన కులగణన నివేదికను బయటపెట్టాలి. బండి సంజయ్ ఆయనతో ఆ నివేదికను బయట పెట్టించాలి. లెక్క తేలితే.. బీసీలు వారి వాటాను అడుగుతారనే బయటపెట్టడం లేదు. మేం చేపట్టిన కులగణ నివేదికను ఒక్కసారి కోర్టు ముందు పెడితే.. ప్రతి రాష్ట్రంలోనూ కులగణనకు డిమాండ్లు వస్తాయి. అప్పుడు కేంద్రంలోని మోదీ సర్కారు కూడా దేశవ్యాప్తంగా కులగణనను అమలు చేయాల్సి ఉంటుంది. అదే జరిగితే.. బీజేపీలో ఆధిపత్యం వహిస్తున్న ఒకట్రెండు సామాజికవర్గాలకు నష్టం జరుగుతుంది. అందుకే.. తెలంగాణ సర్కారు జరిపిన కులగణన ప్రక్రియను తప్పుబట్టి.. ఏ లెక్క లేకుండా చేయాలని బీజేపీ చూస్తోంది" అంటూ రేవంత్ మండిపడ్డారు. కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం బీసీలు 51%, ఓసీలు 21%, ఎస్సీలు 10%, ఎస్టీలు 10% మేరకు ఉన్నారని తెలిపారు. నాలుగు కేటగిరీలుగా జరిగిన ఆ సర్వేలో మైనార్టీల కేటగిరి ఎక్కడుందని నిలదీశారు. తమ ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ముస్లింలలో వెనుకబడిన వర్గాలను కలుపుకోగా.. బీసీలు 56.33% ఉన్నట్లు తేలిందన్నారు. ముస్లింలను తీసుకువచ్చి బీసీల్లో కలపడమేంటంటూ బండి సంజయ్ మాట్లాడుతున్నాడని, గుజరాత్‌కు సీఎంగా ఉన్నప్పుడు ఆ రాష్ట్రంలోని 70 ముస్లిం జాతులను బీసీల్లో చేర్చానంటూ ప్రధాని మోదీ 2022లో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో ప్రకటించారన్నారని గుర్తుచేశారు.

నాపై ఒత్తిళ్లు వచ్చాయ్

తెలంగాణలో కులగణన దేశానికే రోల్ మోడల్‌గా నిలవనుందని రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశంలో ఎవరైనా బీసీ కులాల లెక్క తేల్చాలంటే.. తెలంగాణ రాష్ట్రం, రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడాల్సిందేనన్నారు. "చరిత్రలో నిలిచిపోయే ఒక గొప్ప అవకాశాన్ని జార విడుచుకుంటే అంతకంటే గొప్ప రాజకీయ అజ్ఞానం గానీ, దురద్దేశం కానీ ఇంకోటి ఉండదు. నేను రాజకీయ అజ్ఞానంతో లేను. రాజకీయంగా ఇబ్బందులు వస్తాయనీ, కులగణన వాయిదా వేసుకోవాలనీ నాపై ఎన్నో ఒత్తిళ్లు వచ్చాయి. అయినా.. నాయకుడు రాహుల్‌గాంధీ ఆదేశాలను పాటించడమే నా ధర్మం అనుకున్న. ఏనాడైనా నాయకుని ఆదేశాలు, పార్టీ నిర్ణయాలు నూటికి నూరుపాళ్లు పాటించాను కాబట్టే నాకు అవకాశాలు వచ్చాయి" అని వ్యాఖ్యానించారు.

మౌనంగా ఉంటే నష్టపోతారు

తెలంగాణలో తేలిన బీసీ లెక్క పక్కా అని, ఈ అవకాశాన్ని వెనకబడిన వర్గాల వారు వదులుకుంటే మళ్లీ రాదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "ఈ లెక్కలు తప్పంటూ ఆరోపణలు వస్తున్నాయి. బీసీ నేతలు మౌనంగా ఉంటే.. నష్టపోయేది మనమే. తెలంగాణను ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కులగణనకు రాహుల్‌గాంధీ సన్నద్ధమవుతున్నారు. ప్రజలు దీన్ని విశ్వసిస్తే.. రాహుల్‌గాంధీ 100% ప్రధాని అవుతారు. మోదీ, బండి సంజయ్ ఉద్యోగాలు ఊడుతాయి. తమ ఉద్యోగాలను కాపాడుకునేందుకు వారు కులగణన ప్రక్రియను తప్పుబడుతున్నారు. కొన్ని సంఘాలు, వ్యక్తులతో ఏదేదో మాట్లాడిస్తున్నారు. తమకు సర్వేలో అవకాశం ఇవ్వలేదంటూ ఎవరైనా కోర్టుకు వెళ్తే ప్రమాదముందని, అలాంటి వారు నమోదు చేసుకునేందుకు ఈ నెల 28 వరకు అవకాశం కల్పించాం. ఆ లెక్కలు కూడా వచ్చాక.. సర్వేకు చట్టబద్ధత కల్పిస్తాం" అని రేవంత్ పేర్కొన్నారు.

నన్ను విలన్‌ను చేశారు

సర్వేలో పాల్గొనకుండా.. ఫామ్‌హౌస్‌లో పడుకున్నోడు మంచోడయ్యాడని, ఇంత కష్టపడ్డ తనను కొందరు బీసీ నాయకులు విలన్‌ను చేశారని రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలో పాల్గొనేందుకు రెండోసారి అవకాశమిచ్చినా.. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ వివరాలను అందజేయడంలేదన్నారు. వారి ఇళ్ల ముందుకెళ్లి.. డప్పుకొడుతూ మేల్కొలపాలని బీసీ నేతలకు సూచించారు. బీసీ నేతలు కులాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసుకుని, ఆయా కులాలకు ఆర్థికంగా, సామాజికంగా, ఉపాధిపరంగా ఉన్న డిమాండ్లను గుర్తించి, తీర్మానం చేయాలని పిలుపునిచ్చారు.

వీహెచ్ వర్సెస్ అంజన్

సీఎం ఎదుటే సీనియర్ నేత వి.హనుమంత రావు, అంజన్‌కుమార్ యాదవ్ వాగ్వాదానికి దిగారు. కులానికి ఒకరు చొప్పున మాట్లాడాలంటూ ప్రజాప్రతినిధులకు రేవంత్ సూచించగా.. తొలుత వీహెచ్ మాట్లాడారు. "బీసీల్లో మున్నూరు కాపులు, గౌడ, పద్మశాలి, ముదిరాజ్‌లు ఎక్కువగా ఉన్నారు. వారికి ప్రాధాన్యం ఇవ్వాలి" అని కోరారు. యాదవులను చేర్చక పోవడంపై అంజన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. తమను రాజకీయంగా తొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనిల్‌కుమార్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడాన్ని వీహెచ్ ప్రస్తావించగా.. సికింద్రాబాద్ ఎంపీ సీటును తాము వదులుకోలేదా? అని నిలదీశారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం కల్పించుకుని, వారికి నచ్చజెప్పి.. శాంతింపజేశారు.

14,236 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ!

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైలుపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం సంతకం చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్లను జారీ చేస్తారని మంత్రి సీతక్క తెలిపారు. అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న 6,399 టీచర్, 7,837 హెల్పర్ పోస్టులు కలిపి మొత్తం 14,236 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇంత పెద్ద మొత్తంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులను భర్తీ చేయడం ఇదే తొలిసారి అని ఆమె పేర్కొన్నారు. ఖాళీల భర్తీతో అంగన్‌వాడీలు మరింత పటిష్ఠం అవుతాయని అన్నారు. కాగా, అధికారంలోకి వచ్చాక రిటైర్ అయ్యే అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ మేరకు గత ఏడాది జూలైలోనే సంబంధిత శాఖ చర్యలు చేపట్టింది. ఆ ఫైలును ఆర్థిక శాఖకు పంపగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పదవీ విరమణ చేసిన సిబ్బందికి ఆర్థిక సాయం అందించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి కోరారు.

గుట్ట స్వర్ణ గోపురం ప్రారంభోత్సవం నేడు

హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి

యాదాద్రి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని ప్రధాన ఆలయ స్వర్ణ విమాన గోపుర ప్రారంభోత్సవం ఆదివారం జరగనుంది. దేశంలోనే అత్యంత ఎత్తయిన స్వర్ణ విమాన గోపురంగా రికార్డులకెక్కిన ఈ గోపుర ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 11.54 గంటలకు మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన శ్రీసుదర్శన లక్ష్మీనరసింహ స్వామివారికి గోపురాన్ని అంకితం చేయనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగే మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రితోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మఠాధిపతులు పాల్గొంటారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతులు రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 11 గంటలకు సీఎం హెలికాప్టర్‌లో గుట్టకు రానున్నారు. స్వర్ణ విమానగోపురం ప్రతిష్ఠామహోత్సవం, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొండపై జరిగే సంప్రోక్షణ పూజల్లో సుమారు 25వేల మంది భక్తులు పాల్గొంటారని అంచనా.


ప్రారంభానికి సిద్ధమైన యాదగిరిగుట్ట ప్రధాన ఆలయ స్వర్ణ దివ్య విమాన రాజగోపురం

50.5 అడుగుల ఎత్తు.. 68 కిలోల బంగారం

స్వర్ణ విమాన గోపురం ఎత్తు 50.5 అడుగులు ఉంటుంది. విమానగోపుర వైశాల్యం 10,759 చదరపు అడుగులు. గోపురం మొత్తానికి స్వర్ణతాపడం చేసేందుకు 68 కిలోల బంగారాన్ని వినియోగించారు. చెన్నైకి చెందిన మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ ఈ పనులు నిర్వహించింది. బంగారం తాపడం చేసేందుకు మొత్తం రూ.3.90 కోట్లు ఖర్చు చేశారు. తాపడం అమర్చే పనులకు మొత్తం 68కిలోల బంగారం, గోల్డ్ ప్లేటింగ్ తయారీ, అమరికకు రూ.8కోట్లు వరకు వెచ్చించారు. మార్చి 1 నుంచి జరిగే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందే స్వర్ణతాపడం పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు సకాలంలో పూర్తి చేసి సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.

కేసీఆర్ పిలుపు.. రూ.25 కోట్ల విరాళాలు

మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం దాదాపు రూ.1280కోట్లతో యాదగిరి గుట్ట ఆలయాన్ని పునర్నిర్మించింది. ప్రధాన ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేయిస్తామని 2021 అక్టోబరు 19న కేసీఆర్ ప్రకటించారు. ఇందుకు సుమారు 125కిలోల బంగారం అవసరమని, రూ.65కోట్ల మేర ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగం కావాలని పిలుపునిచ్చిన కేసీఆర్.. తమ కుటుంబం తరపున స్వామివారికి 1కిలో 16తులాల బంగారాన్ని సమర్పించారు. వివిధ వర్గాల నుంచి స్వర్ణతాపడం పనులకు రూ.25 కోట్ల మేర విరాళాలు అందాయి. అలాగే, 10కిలోల 577.390గ్రాముల బంగారాన్ని కూడా భక్తులు అందజేశారు.

పాలన చేతకాని సన్నాసులు

- తెలంగాణను క్యాన్సర్‌తో పోల్చిన దుర్మార్గుడు రేవంత్ రెడ్డి
- రేవంత్‌ను కాపాడుతున్న బీజేపీ: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సన్నాసులకు పాలన చేతకావడం లేదని, సీఎం రేవంత్ రెడ్డి తన చేతగానితనంతో కేవలం ఒక్క ఏడాదిలోనే అన్ని రంగాలను చావుదెబ్బ కొట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఏదో అడ్డి మార్ గుడ్డి దెబ్బ లెక్కలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఆర్థిక ప్రగతిపై సీఎం రేవంత్ మూతి మీద కొట్టేట్లుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వాస్తవాలు చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే అని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్) నివేదికలో ఒప్పుకుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై సమగ్రమైన నివేదికను భట్టి విక్రమార్క విడుదల చేశారని, ఆయనకు ధన్యవాదాలని పేర్కొన్నారు. మోదీ తలకిందులుగా తపస్సు చేసినా, రాహుల్ గాంధీ వంద జోడో యాత్రలు చేసినా కేసీఆర్ లాగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేరన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందని వెబ్‌సైట్ నుంచి ఆ నివేదికను తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేవంత్ రెడ్డి నుంచి మొదలు ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఒక ఎజెండా ప్రకారం గోబెల్స్ వారసుల్లాగా తెలంగాణ ఆర్థిక ప్రగతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోకుండా ఏది పడితే అది మాట్లాడి ముఖ్యమంత్రి తెలంగాణ పరువు తీస్తున్నారని, ఇలాంటి దివాళాకోరు సీఎం దేశంలో ఎవరూ లేరని విమర్శించారు. తెలంగాణను క్యాన్సర్ వ్యాధితో పోల్చిన దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. తలసరి ఆదాయంలో 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో 10వ స్థానంలో ఉంటే.. 2023 నాటికి దేశంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుందని ఆ నివేదికనే చెప్పిందన్నారు. 2014-15లో దేశ తలసరి ఆదాయం సగటు రూ.86,000 ఉంటే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,000 ఉందని పేర్కొన్నారు. ఆ నివేదిక ప్రకారం భారతదేశం మొత్తం సగటు కంటే రెండురెట్లు ఎక్కువగా తెలంగాణ తలసరి ఆదాయం ఉందని వెల్లడించారు. తెలంగాణ జీఎస్‌డీపీని ఐదు లక్షల కోట్లనుంచి 15 లక్షల కోట్లకు కేసీఆర్ పెంచారని, రేవంత్ చెంప మీద చెల్లుమని కొట్టేలా నివేదిక స్పష్టం చేసిందన్నారు. గత 10 నెలల కాలంలో వడ్డీల రూపేణా రూ.22056 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందని పేర్కొన్నారు. ఉన్నదానికంటే ఎక్కువ మిత్తి కడుతున్నామని అబద్ధాలు చెపుతున్న రేవంత్, ఆ పైసలు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా రంకెలు వేయడం మానేసి దమ్ముంటే తన పాలనపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. సరిపడే సమయమిస్తే ఆయన దుమ్ము దులుపుతామన్నారు.

గ్యారెంటీలు అమలు చేసిన చోటే కాంగ్రెస్ పోటీ చేయాలి

కాంగ్రెస్ కూడా పూర్తిగా ఆరు గ్యారెంటీలు అమలు చేసిన దగ్గరే పోటీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బండి సంజయ్ రక్షణ కవచంలో రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, సంజయ్‌లను ప్రజలంతా ఆర్ఎస్ బ్రదర్స్ అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అమృత్ స్కాం నుంచి అనేక స్కామ్‌లపైన కేంద్రానికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతున్నదో చెప్పాలన్నారు. రేవంత్ బీజేపీలో చేరుతానని ఏమైనా లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారా అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటిపై ఈడీ దాడి చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

పహాణీలను స్కాన్ చేసి భద్రపర్చండి

రెవెన్యూ మంత్రి పొంగులేటి సూచనతో కలెక్టర్లకు సర్క్యులర్ పంపిన సీసీఎల్ఏ

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి రికార్డు అయిన పహాణీల విషయంలో భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ జిల్లా కలెక్టర్లకు కీలక సర్క్యులర్ పంపారు. ఈ నెల 18, 19 తేదీల్లో భూ భారతి విధి విధానాలపై నిర్వహించిన వర్క్‌షాప్ అనంతరం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో ఈ సర్క్యులర్ జారీ చేశారు. 2012-13 నుంచి 2014-15 మధ్య కాలానికి సంబంధించిన పహాణీలను స్కాన్ చేసి భద్రపరచాలని ఆదేశించారు. చిరిగిపోయిన రికార్డులను ల్యామినేట్ చేసిన తరువాత స్కాన్ చేసి భద్రపరచాలని, రికార్డులను స్కానింగ్ కోసం విప్పడం, తిరిగి కట్టడం వంటి పనులు రెవెన్యూ అధికారుల బృందం సమక్షంలోనే చేపట్టాలని పేర్కొన్నారు. పత్రాలను మార్చడం, నాశనం చేయడం, ఇతర పత్రాలతో భర్తీ చేయడాన్ని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. స్కానింగ్ కోసం కేటాయించిన ప్రదేశం నుంచి పత్రాలను బయటకు తీసుకెళ్లడం కుదరదని, డిజిటలైజేషన్ సేవలు అందించే వ్యక్తి స్కానింగ్ పత్రాలను టిఫ్ ఫార్మాట్‌లో భద్రపరచాలని ఆదేశించారు. స్కానింగ్ చేసిన రికార్డులు స్పష్టంగా కనిపించేలా ఉండాలన్నారు. నోడల్ అధికారిని, గ్రామాలు, మండలాల్లో సహాయ అధికారులను నియమించి.. ఈ ప్రక్రియను ఈ నెల 28లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

హైదరాబాద్‌లో ష్నైడర్ ప్లాంట్

న్యూఢిల్లీ: భారత్‌లో మరో 3 తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఆటోమేషన్ కంపెనీ ష్నైడర్ ఎలక్ట్రిక్ శనివారం వెల్లడించింది. హైదరాబాద్, కోల్‌కతా, అహ్మద్‌నగర్‌లో ఈ కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఎలెక్రామా 2025 సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ సీఈఓ ఒలివర్ బ్లమ్ వెల్లడించారు. భారత్‌లో కంపెనీ తన పెట్టుబడులను కొనసాగించనుందన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీకి దేశంలో 31 మాన్యుఫాక్చరింగ్ ప్లాంటు ఉన్నాయి. భారత్‌లో ఇండస్ట్రియల్ కార్యకలాపాల విస్తరణకు ష్నైడర్ ఇప్పటికే రూ.3,200 కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. కంపెనీకి భారత్ మూడో అతిపెద్ద మార్కెట్. అలాగే, కంపెనీకి చెందిన నాలుగు గ్లోబల్ హబ్‌లలో ఒకటి.

లోకం తీరు



ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు నేడే!

పరీక్ష నిర్వహణకే ఏపీపీఎస్సీ నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం జరుగనున్నాయి. పరీక్షలపై శనివారం హైడ్రామా నడిచింది. పరీక్షలుంటాయా? లేదా? అని అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు. వాయిదా వేయాలన్న అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో పెట్టుకుని పరీక్షలు రీషెడ్యూలు చేయాలని ప్రభుత్వం శుక్రవారం రాత్రి సర్వీస్ కమిషన్‌కు లేఖ రాసింది. శనివారం ఉదయం ఇది వెలుగులోకి రావడంతో మొదలైన గందరగోళం... చివరికి వాయిదా వేయడం సాధ్యం కాదని సాయంత్రం ఏపీపీఎస్సీ ప్రభుత్వానికి లేఖ రాయడంతో ముగిసింది. దీంతో షెడ్యూలు ప్రకా రం ఆదివారం పరీక్షలు జరగనున్నాయి. 2023లో జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్ రోస్టర్‌లో తప్పులున్నాయని అభ్యర్థులు మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నారు. జీవో 77 ప్రకారం హారిజంటల్ రోస్టర్ అమలు చేయాలని, కానీ పాత రోస్టర్ అమలు చేశారని ఆరోపిస్తున్నారు. ఈ తరుణంలో శుక్రవారం నుంచి ఆందోళనలు పెరిగాయి. అయితే, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేయడం సాధ్యం కాదంటూ ఏపీపీఎస్సీ ప్రభుత్వానికి లేఖ రాసింది.

నేడు 'మార్క్సిస్టు ఆలోచనాపరుల' సదస్సు

పాల్గొంటున్న 15 కమ్యూనిస్టు వామపక్ష సంస్థలు

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు ఉద్యమ శతవార్షికోత్సవం సందర్భంగా 'భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం ఆవశ్యకత, అవకాశాలు - అవరోధాలు' అన్న అంశంపై ఆదివారం విజయవాడలో సదస్సు జరుగుతుందని 'మార్క్సిస్టు ఆలోచనాపరులు' తెలిపారు. ఈ సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు చిగురుపాటి భాస్కరరావు, ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా, అడ్వకేట్ పిచ్చుక శ్రీనివాస్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేస్తూ... 'విజయవాడ బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్‌లో ఈ సదస్సు జరగనుంది. సీపీఐ, సీపీఎం, వివిధ సీపీఐ(ఎంఎల్) పార్టీలు, విప్లవ రచయితల సంఘం ప్రతినిధులు పాల్గొంటున్నారు. మొత్తంగా 15కమ్యూనిస్టు వామపక్ష సంస్థల రాష్ట్ర నాయకులు తమ అభిప్రాయాలను పంచుకుంటారు. ప్రస్తుతమున్న ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, వర్గ, కుల సమాజం స్థానం లో నిజమైన గణతంత్ర, ప్రజాస్వామ్య, లౌకిక, రాజ్యం ఏర్పాటు కావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఆకాంక్ష సఫలమయ్యేందుకు కమ్యూనిస్టు ఉద్యమ పురోగమన అవకాశాలు, అవరోధాలపై వామపక్షాల అభిప్రాయాలను ఒకే వేదికపై నుంచి తెలుసుకుని ప్రజలకు తెలియజేయాలన్నదే సదస్సు ప్రధాన ఉద్దేశం' అని తెలిపారు.

కొండపాకలో ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

- బయాలజీ ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ టీచర్ దేవయ్య

కొండపాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కొండపాక మండలం ఖమ్మంపల్లిలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు దేవయ్యపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఖమ్మంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో దేవయ్య బయాలజీ టీచర్. అతడు ప్రాక్టికల్స్ పేరుతో కొంతమంది విద్యార్థులను సైన్స్ ల్యాబ్‌లోకి తీసుకెళ్లి వారితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దేవయ్య వేధింపులు భరించలేక విద్యార్థినులు ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. ఈ విషయమై కొందరు తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ప్రధానోపాధ్యాయుడు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం ఇచ్చారు. మరోవైపు, శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులను నిలదీశారు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ పాఠశాలకు చేరుకొని ప్రాథమిక విచారణ చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గా.. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి సమాచారాన్ని సేకరించారు. అనంతరం సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దేవయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే, విషయం బయటపడటంతో దేవయ్య మూడు రోజుల నుంచి సెలవులో ఉన్నాడు. కాగా, దేవయ్యను సస్పెండ్ చేసినట్లు డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలో రాహుల్ ట్యాక్స్

- హైదరాబాద్ స్థిరాస్తి వ్యాపారుల్లో భయం
- 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి?: కిషన్‌రెడ్డి



ఖానాపూర్/భైంసా/నిజామాబాద్/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను పదేళ్ల పాటు బీఆర్ఎస్ దోచుకుందని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే.. ఆ పార్టీ రాష్ట్రంలో రాహుల్ గాంధీ ట్యాక్స్‌ను విధిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు భయపడే పరిస్థితి ఉందన్నారు. శనివారం నిర్మల్ జిల్లాలోని భైంసా, ఖానాపూర్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో.. అదేవిధంగా నిజామాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు.

ఎన్నికల వాయిదాకు కాంగ్రెస్ కుట్ర: లక్ష్మణ్

స్థానిక ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక.. ఏదో ఒక వంకతో వాయిదా వేసేందుకు సీఎం రేవంత్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై నమ్మకం ఉంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడారు.

సీఈవోకు బీజేపీ ఫిర్యాదు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ న్యూస్‌టుడే సంస్థ తమపై దుష్ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో)కి బీజేపీ శనివారం ఫిర్యాదు చేసింది.

పట్టభద్రుల హోరాహోరీ

(మొదటి పేజీ తరువాయి)

మొదటి నుంచి ప్రచారంలో దూకుడుగా ముందుకు సాగుతున్నారు. నాలుగు నెలల ముందునుంచే ఆయన తన విద్యాసంస్థల సిబ్బంది సహకారంతో లక్షకుపైగా పట్టభద్రులను ఓటర్లు నమోదు చేయించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కానీ, ఇండిపెండెంట్‌గా గానీ పోటీలో ఉంటానని చెబుతూ.. పట్టభద్రుల మద్దతును కూడ గట్టుకునే ప్రయత్నాలు చేశారు. పార్టీ అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్సీలను కలుపుకొని ప్రచారాన్ని వేగవంతం చేశారు. మరోవైపు.. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నేత చిన్నమైల్ అంజిరెడ్డి పార్టీ అధిష్ఠానం ఆశీస్సుతో అభ్యర్థిత్వం దక్కించుకున్నారు. పట్టణ ప్రాంత ఓటర్లలో సహజంగానే బీజేపీపై సానుకూలత ఉంటుందన్న భావనతో ఆయన ముందుకు సాగుతున్నారు. అంజిరెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కుమార్ విస్తృత స్థాయిలో ప్రచారంలో పాల్గొంటున్నారు. తన సొంత నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని బండి సంజయ్ పట్టుదలతో ఉన్నారు. మరోవైపు.. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. పోటీకి దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయించుకోవడంతో ఆ పార్టీ టికెట్ ఆశించిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. వీరు సైతం అధికార పార్టీలకు దీటుగా నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రసన్న హరికృష్ణకు పలు బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆయనకు మద్దతు ప్రకటించడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులకు ముచ్చెమటలు పడుతున్నాయి. రెడ్డి సామాజిక వర్గానికే కాంగ్రెస్, బీజేపీ పెద్ద పీట వేశాయని, బీసీ బిడ్డగా పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని బీసీ సంఘాలు ప్రచారం చేస్తున్నాయి. దీంతో స్థానికుడైన నరేందర్‌రెడ్డినే గెలిపించాలంటూ రెడ్డి సంఘం రంగంలోకి దిగింది. ఇదంతా త్రిముఖ పోరుగా మారడంతో ఉత్కంఠ నెలకొంది. అదేసమయంలో బీఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు.. ప్రధాన పార్టీల్లో ఎవరి విజయావకాశాలను గండి కొడతారోనన్న చర్చ జోరుగా సాగుతోంది. కాగా, 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రతి ఓటరును కలుసుకునే అవకాశం లేకపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు సోషల్‌మీడియా ద్వారానే ప్రచారం చేస్తున్నారు. ఒకవైపు తమ ఎజెండా, చేయబోయే పనులను వివరిస్తూనే.. మరోవైపు ప్రత్యర్థుల బలహీనతలను ఎండగడుతున్నారు.



రేవంత్.. చర్చకు సిద్ధమా?

- కేంద్రం నిధులు, 6 గ్యారెంటీలు, అవినీతి పైనా మాట్లాడదాం : కేంద్ర మంత్రి సంజయ్



కరీంనగర్/కామారెడ్డి/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులు, రాష్ట్రంలో అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధమని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. సీఎం సవాల్‌ను స్వీకరిస్తున్నామని.. తేదీ, సమయం నిర్ణయించాలని ప్రతి సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు, అవినీతి, అక్రమాలు, 15 శాతం కమీషన్ పైనా చర్చకు సిద్ధమన్నారు. శనివారం కరీంనగర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ ప్రభారీలతో నిర్వహించిన సమావేశంలో సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నది బీఆర్ఎస్ వాళ్లేనని విమర్శించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపిం గ్, కేటీఆర్ బావమరిది ఫాంహౌస్‌లో డ్రగ్స్ కేసు, కార్ రేసు స్కాంలో ఆధారాలున్నా.. కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నిజమైన కేఆర్ బ్రదర్స్ కేటీఆర్, రేవంత్‌రెడ్డిలే అన్నారు. అవినీతి కేసుల్లో అరెస్ట్ కాకుండా కేసీఆర్ ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు డబ్బులిచ్చి వస్తున్నాడని ఆరోపించా రు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఏటీఎంలా మారిందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం దుర్ఘటన బాధితులకు సాయం అందించాలని, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు.

గెలిచాక కాంగ్రెస్‌పై యుద్ధమే..

కాంగ్రెస్‌లో ఐదుగురు మంత్రులదే ఆధిపత్యం నడుస్తోందని.. 15శాతం కమీషన్లు ఇవ్వనిదే నిధులు విడుదల చేయ డంలేదని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే లు సైతం ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. కామారెడ్డి మునిసిపల్ పరిధిలోని లింగాపూర్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సంజయ్ మాట్లాడారు. బీజేపీ ఎమ్మె ల్సీ అభ్యర్థులు కొమురయ్య, అంజిరెడ్డిలను గెలిపిస్తే.. వారంలో కాం గ్రెస్ 6 గ్యారెంటీల అమలుకు యుద్ధం ప్రకటిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

వికటించిన వీధి నాటకం!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై దాడిని ఉధృతం చేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎదురైన అనూహ్య పరాజయం నుంచి కోలుకున్న ఆయన తనదైన శైలిలో ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మాటలు, చేష్టలు అదుపు తప్పుతున్నాయి. రాష్ట్రం విడిపోయిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో తాను అధికారంలోకి వచ్చేసినట్టేనని అతి విశ్వాసంతో ఉండిన ఆయన ఓడిపోయారు. దీంతో జగన్‌రెడ్డి పనైపోయిందని భావించిన చంద్రబాబు నాయుడు ఆయనను పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ప్రశాంత్ కిశోర్ మార్గదర్శకత్వంలో జగన్‌రెడ్డి అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై విష ప్రచారం చేశారు. వంచనతో కూడిన రాజకీయాలతో ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లో పెంచగలిగారు. ఫలితంగా 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో చంద్రబాబు కథ అయిపోయిందని భావించిన జగన్‌రెడ్డి తనదైన శైలిలో కక్ష రాజకీయాలకు

> 2004కు ముందు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక హత్య కేసులో జైల్లో ఉన్న గౌరు వెంకటరెడ్డిని పరామర్శించి రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఆయన చర్యకు మద్దతు లభించింది. తనను నమ్ముకున్న వారి కోసం రాజశేఖరరెడ్డి ఎంత దూరమైనా వెళతారన్న పేరు వచ్చింది. ఇప్పుడు తండ్రి బాటలోనే జగన్ పయనించే ప్రయత్నం చేయాలనుకుంటున్నట్టుగా ఉంది. అయితే పరామర్శకు ఆయన ఎంచుకున్న మనుషుల గతాన్ని ప్రజలు మరిచిపోకపోవడం వల్ల సదరు ప్రయత్నాలు వికటిస్తున్నాయి. ఎంపీగా ఉన్నప్పుడు నందిగం సురేశ్ రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు వ్యతిరేకంగా అరాచకంగా ప్రవర్తించారు. వంశీ విషయం కూడా అందరికీ తెలిసిందే. నోటికి హద్దూ పద్దూ లేకుండా చంద్రబాబు కుటుంబంపై అవాకులు చవాకులు పేలారు. మహిళలను అవమానించారు. తమకు జరిగిన అవమానాలను చంద్రబాబు గానీ, లోకేశ్ గానీ ఎలా మరిచిపోతారు?

తెర లేపారు. తన సన్నిహితులు వారించినా వినకుండా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబును అరెస్టు చేయించి జైల్లో పెట్టారు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీతో సత్సంబంధాలు ఉండటంతో జగన్‌రెడ్డి ఆడింది ఆట పాడింది పాటగా సాగింది. 2024 ఎన్నికల నాటికి పరిస్థితులు మారిపోయాయి. 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీతో కలిసి పోటీ చేసినా, ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య సత్సంబంధాలు ఉండేవి కావు. ఈ క్రమంలో చంద్రబాబు భారతీయ జనతా పార్టీకి దూరమయ్యారు. బీజేపీతో నేరుగా పొత్తు లేకపోయినా ఐదేళ్ల పాటు కేంద్రంలో ప్రభుత్వానికి జగన్‌రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. కేంద్రం కూడా జగన్‌రెడ్డికి అండగా నిలబడింది. 2014 ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కలిసి పోటీ చేసినా, ఆ తర్వాత వాటికి అంత ప్రాధాన్యం ఉండేది కాదు. 2019 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించడంతో ప్రధాని నరేంద్ర మోదీ సర్వం తానై వెలుగొందారు. 2024 నాటికి పరిస్థితులు తలకిందులయ్యాయి. భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించలేదు. 2019 ఎన్నికల్లో తాను ఈసడించుకుని దూరం పెట్టిన తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవాలని ప్రధాని మోదీ స్వయంగా నిర్ణయించుకున్నారు. మూడవసారి తన నేతృత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకమైంది. బిహార్‌లో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీయూ మద్దతు కూడా అవసరం అయినప్పటికీ ఇటీవలికాలంలో నితీశ్ ఆరోగ్యం క్షీణించడంతో కేంద్రంలో, ముఖ్యంగా ఎన్డీయేలో చంద్రబాబుకు ప్రాధాన్యం ఏర్పడింది. చంద్రబాబు కూడా 2019 నాటి అనుభవంతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో సత్సంబంధాలతో ముందుకు వెళుతున్నారు. గతానికి భిన్నంగా ప్రధాని మోదీ కూడా ముఖ్యమైన సందర్భాలలో ఎన్డీయేను ప్రాజెక్ట్ చేయడం మొదలుపెట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ ముఖ్యమంత్రుల ప్రమాణస్వీకారోత్సవాలకు ఎన్డీయే నేతలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. జాతీయ స్థాయిలో ఎన్డీయేకు పోటీగా రూపుదిద్దుకున్న ఇండియా కూటమి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇండియా కూటమిలో బలంగా కనిపించిన కేజ్రీవాల్ ఢిల్లీ ఎన్నికల్లో ఓటమిపాలవడంతో భారతీయ జనతా పార్టీని ఇప్పుడు ఢీకొనగల నాయకులు జాతీయ స్థాయిలో కొరవడ్డారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తమ రాష్ట్రాలలో బలంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో ప్రభావం చూపగల నాయకులు కాదు. ఈ క్రమంలో ప్రధాని తదుపరి టార్గెట్ మమతా బెనర్జీ కావొచ్చు. గతంలో భారతీయ జనతా పార్టీని మాత్రమే బలోపేతం చేయడానికి ప్రయత్నించిన ప్రధాని మోదీ ఇప్పుడు ఎన్డీయేను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో చంద్రబాబుకు మరింతగా ప్రాధాన్యం ఇస్తున్నారు. కేంద్రంలో తనకు పెరిగిన పరపతితో రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలెట్టారు. ఫలితంగా కేంద్రం నుంచి వివిధ పథకాలకు భారీగా ఆర్థిక సహకారం అందుతోంది. ప్రతిపాదిత పథకాలన్నీ కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో అభివృద్ధి పుంజుకుంటుంది. లక్ష కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి వస్తాయి.

మా సీఎం వేరే...!

జాతీయ స్థాయి పరిణామాలను, కేంద్రంలో పెరిగిన చంద్రబాబు ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి దాడిని ఉధృతం చేశారు. ఈ క్రమంలో ఆయన ఎంచుకున్న రెండు కార్యక్రమాలూ బెడిసికొట్టాయి. ఒక కేసులో అరెస్టయిన వల్లభనేని వంశీని జైల్లో పరామర్శించిన జగన్‌రెడ్డి పోలీసులపై విరుచుకుపడ్డారు. వంశీని అరెస్టు చేసి జైల్లో పెట్టిన అధికారులు పదవీ విరమణ చేసినా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దుస్తులు ఊడదీసి నిలబెడతానని హెచ్చరించారు. దీనిపై పోలీసు అధికారుల సంఘం ఘాటుగా స్పందించింది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన నందిగం సురేశ్, వల్లభనేని వంశీ వంటి వారిని పరామర్శించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడమే జగన్‌రెడ్డి చేసిన తప్పు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని దారుణంగా అవమానించిన వల్లభనేని వంశీపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు? అని కూటమి ప్రభుత్వంపై మరోవైపు ఒత్తిడి పెరిగింది. చంద్రబాబు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారంటూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో ఏకంగా పోస్టులే పెట్టారు. అయితే కార్యకర్తల వలె ఆవేశపడకుండా చంద్రబాబు సమయం, సందర్భం కోసం వేచి చూశారు. కిడ్నాప్ కేసులో వంశీ చిక్కుకోగానే అరెస్టు చేయించారు. అధికారంలో ఉన్నప్పుడు గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసీపీ దాడి సందర్భంగా ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ అనే వ్యక్తిని బెదిరించి ఫిర్యాదును ఉపసంహరింపజేయించిన వల్లభనేని వంశీ మొత్తంమీద చంద్రబాబు విసిరిన వలలో చిక్కుకున్నారు. ఈ క్రమంలో జైలులో ఉన్న వంశీని జగన్‌రెడ్డి పరామర్శించారు. వంశీపై తప్పుడు కేసు పెట్టి అన్యాయంగా అరెస్టు చేశారని జగన్‌రెడ్డి విమర్శించిన కొద్ది సేపటికే హైదరాబాద్‌లోని మై హోం బూజా అపార్ట్‌మెంట్‌లోని లిఫ్టులో సత్యవర్ధన్‌ను వెంటబెట్టుకొని వంశీ తీసుకువెళ్లిన వీడియో ఫుటేజ్‌ను మంత్రి కొల్లు రవీంద్ర మీడియాకు విడుదల చేశారు. దీంతో వంశీని అన్యాయంగా అరెస్టు చేశారన్న జగన్ ఆరోపణలకు విలువ లేకుండా పోయింది. 2014–2019 మధ్య కాలంలో జగన్‌రెడ్డి ఇలాంటి విన్యాసాలు చేసినప్పుడు అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు అండ్ కో కౌంటర్ ఎటాక్ చేయలేదు. దీంతో ఇప్పుడు జగన్‌రెడ్డి తనకు మాత్రమే సొంతమైన వంచన రాజకీయాలకు మళ్లీ శ్రీకారం చుట్టారు. అయితే జగన్‌రెడ్డికి గ్రహబలం ఈసారి అనుకూలంగా ఉన్నట్టు లేదు. విజయవాడ నడి వీధుల్లో జగన్‌రెడ్డి రక్తి కట్టించాలనుకున్న సన్నివేశాలు వికటించాయి. ఎన్నికలకు ముందు 'మా ఓటర్లు వేరే ఉన్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు అనేవారు. ఇప్పుడు జగన్‌రెడ్డి మద్దతుదారులు కూడా 'మా ముఖ్యమంత్రి వేరే ఉంటారు' అని భావిస్తున్నట్టుగా ఉన్నారు. సాధారణ ఎన్నికలకు కొంచెం ముందు ప్రతిపక్షంలో ఉన్న నాయకుడిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినాదాలు చేస్తే అర్థం చేసుకోవచ్చు కానీ ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలలకే, అది కూడా 11 సీట్లు మాత్రమే గెలుచుకున్న ఒక వ్యక్తిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినదించడం, అలా నినాదాలు చేసిన, చేయించుకున్న వారి మనోవికారాలకు అద్దంపడుతుంది. ఇలాంటి నినాదాలు జగన్‌రెడ్డికి ఆనందాన్ని ఇస్తూండవచ్చు



> జగన్‌రెడ్డి వద్ద విలపించిన ఆ పాప చదువు నిజంగానే ఆగిపోయే పరిస్థితి ఉంటే ఆ పిల్ల చదువు ఖర్చులకు జగన్‌రెడ్డి ఎందుకు సహాయం చేయలేదు? ఆ మాత్రం స్తోమత జగన్‌రెడ్డికి లేదా? లేక ఆయనలో మానవత్వం అనేది మచ్చుకైనా లేదా? స్ర్కీన్‌ప్లే, డైరెక్షన్‌లో ఎక్కడో లోపం జరిగింది. స్ర్కీన్‌ప్లే పకడ్బందీగా రూపొందించి ఉంటే పక్కన ఉన్న వారి జేబులోంచి డబ్బు తీసి జగన్‌రెడ్డి సదరు పిల్లకు ఇచ్చి ఉండేవారు. చంద్రబాబు మోసం చేశారనే అనుకుందాం. కరుణామయుడు, పేదల పెన్నిధిగా చెప్పుకొనే జగన్‌రెడ్డి ఆ పిల్ల చదువు కోసం 15 వేలు ఇవ్వలేరా? అయినా పుచ్చుకోవడం తప్ప ఇవ్వడం తెలియని జగన్‌కు ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తాయి? 2014–19 మధ్య కాలంలో ప్రదర్శించిన వంచనతో కూడిన వీధి నాటకాలనే మళ్లీ ప్రదర్శించాలని జగన్ అండ్ కో అనుకోవడమే ఇప్పుడు చేస్తున్న తప్పు. నిజానికి జగన్ వెంట ఇప్పుడు కనిపిస్తున్న వారి పట్ల ప్రజలకు సదభిప్రాయం లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు ప్రవర్తించిన తీరును ప్రజలు ఇంకా మరచిపోలేదు. అధికార మదంతో విర్రవీగిన వారిని వెంటబెట్టుకొని తిరగడం వల్ల జగన్‌రెడ్డికి నష్టమే గానీ లాభం ఉండదు.

గానీ, వినేవారికి ఎబ్బెట్టుగా ఉంటాయి. ఇలాంటి లేకి పోకడలు పోయిన వారిని వారించి ఉంటే గత ఎన్నికల్లో జగన్‌రెడ్డికి ఇంతటి పరాభవం జరిగి ఉండేది కాదు. చంద్రబాబు, లోకేశ్ కంటే అందంగా ఉంటారు కనుక కొడాలి నాని, దేవినేని అవినాశ్‌ను కూడా త్వరలో అరెస్టు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రోతగా ఉన్నాయి. నీకంటే చంద్రబాబు అందంగా ఉంటారని అప్పట్లో ఆయనను అరెస్టు చేయించావా? అని ఎవరైనా ప్రశ్నిస్తే జగన్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారు? తాను సెటైర్లు వేశానని జగన్‌రెడ్డి అనుకొని ఉండవచ్చు గానీ ఆయన వ్యాఖ్యలు విన్న వారికి కంపరం కలిగించాయి. ఈ సందర్భంగానే జగన్ అండ్ కో ప్రదర్శించిన మరో సన్నివేశం కూడా వికటించింది. 8వ తరగతి చదువుతున్న ఒక చిన్న పిల్లను తీసుకొచ్చి 'జగన్ మామయ్యా నాకు అమ్మ ఒడి రావడం లేదు' అని విలపింపజేశారు. 2014–19 మధ్య కాలంలో ఇలాంటి నాటకాలకే తెర లేపిన జగన్ అండ్ కో ఇప్పుడు అవే నాటకాలను ప్రదర్శించడం మొదలుపెట్టారు. అప్పట్లో ఇలాంటి నాటకాలను పట్టించుకోని తెలుగుదేశం పార్టీ గానీ, వారి సోషల్ మీడియా గానీ ఇప్పుడు దీటుగా స్పందించి ఆ పాప పూర్వాపరాలను బయటపెట్టింది. జగన్‌రెడ్డిని హత్తుకుని విలపించిన ఆ పాప తండ్రి, మేనమామ కరుడుగట్టిన వైసీపీ అభిమానులు. అమ్మ ఒడి రావడం లేదని ఆ పిల్ల ఏడుస్తూ చెబుతున్నప్పుడు తండ్రి, మేనమామ నవ్వడం కనిపించింది. అమ్మ ఒడి రానందున ఆ పిల్ల చదువు నిజంగా ఆగిపోయే పరిస్థితే ఉంటే వారలా నవ్వుకోరు కదా? నిజానికి జగన్‌రెడ్డి కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఒడి అమలు చేయలేదు. 2020 నుంచే అమలు చేశారు. ఇప్పుడు చంద్రబాబు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని ఈ ఏడాది జూన్ నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. మొత్తంమీద విజయవాడ నడివీధుల్లో జగన్ అండ్ కో ప్రదర్శించిన వీధి నాటకం వికటించింది. జగన్‌రెడ్డి వద్ద విలపించిన ఆ పాప చదువు నిజంగానే ఆగిపోయే పరిస్థితి ఉంటే ఆ పిల్ల చదువు ఖర్చులకు జగన్‌రెడ్డి ఎందుకు సహాయం చేయలేదు? ఆ మాత్రం స్తోమత జగన్‌రెడ్డికి లేదా? లేక ఆయనలో మానవత్వం అనేది మచ్చుకైనా లేదా? స్ర్కీన్‌ప్లే, డైరెక్షన్‌లో ఎక్కడో లోపం జరిగింది. స్ర్కీన్‌ప్లే పకడ్బందీగా రూపొందించి ఉంటే పక్కన ఉన్న వారి జేబులోంచి డబ్బు తీసి జగన్‌రెడ్డి సదరు పిల్లకు ఇచ్చి ఉండేవారు. చంద్రబాబు మోసం చేశారనే అనుకుందాం. కరుణామయుడు, పేదల పెన్నిధిగా చెప్పుకొనే జగన్‌రెడ్డి ఆ పిల్ల చదువు కోసం 15 వేలు ఇవ్వలేరా? అయినా పుచ్చుకోవడం తప్ప ఇవ్వడం తెలియని జగన్‌కు ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తాయి? 2014–19 మధ్య కాలంలో ప్రదర్శించిన వంచనతో కూడిన వీధి నాటకాలనే మళ్లీ ప్రదర్శించాలని జగన్ అండ్ కో అనుకోవడమే ఇప్పుడు చేస్తున్న తప్పు. వల్లభనేని వంశీపై మెజారిటీ ప్రజల్లో సదభిప్రాయం లేదు. అలాంటి వంశీ కోసం జగన్ అండ్ కో వీధి నాటకాలకు తెర తీయడం రెండో పొరపాటు. నిజానికి జగన్ వెంట ఇప్పుడు కనిపిస్తున్న వారి పట్ల ప్రజలకు సదభిప్రాయం లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు ప్రవర్తించిన తీరును ప్రజలు ఇంకా మరచిపోలేదు. అధికార మదంతో విర్రవీగిన వారిని వెంటబెట్టుకొని తిరగడం వల్ల జగన్‌రెడ్డికి నష్టమే గానీ లాభం ఉండదు.

> ఎన్డీయే బలపడటం ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యం. ఈ మార్పును అర్థం చేసుకోకుండా జగన్‌రెడ్డి గతంలో వలె కాలం చెల్లిన ట్రిక్కులు ప్రదర్శిస్తే వాటిని తనకు అనుకూలంగా మలచుకోకుండా చంద్రబాబు ఉంటారా?

'ఘాటు' కౌంటర్!

ఇక గుంటూరు మిర్చియార్డు సందర్శనకు జగన్‌రెడ్డి మందీ మార్బలంతో వెళ్లి హడావిడి చేశారు. తన హయాంలో మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించి ఆనందంగా ఉండేవారని, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో మిర్చి రైతులను పట్టించుకోవడం లేదని జగన్‌రెడ్డి తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఈ విమర్శలు చేసి ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకునే లోగానే జగన్‌రెడ్డి హయాంలో మిర్చి పంటకు క్వింటాల్‌కు 7,000 రూపాయలను మాత్రమే ధరగా నిర్ణయిస్తూ అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీవోను అధికార పక్షం బయటపెట్టింది. దీంతో జగన్ అండ్ కోకు మాట పడిపోయింది. అదే సమయంలో చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి మిర్చి రైతులను ఆదుకోవలసిందిగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కోరారు. చంద్రబాబు నుంచి విజ్ఞప్తి అందిన వెంటనే కేంద్రమంత్రి మరుసటి రోజే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యపై చర్చించారు. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణలో కూడా, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా ఈ ఏడాది మిర్చి పంటకు ధర పడిపోయింది. పత్తి, మిర్చి వంటి పంటలకు కొన్ని సందర్భాలలో అధిక ధర పలకడం, మరికొన్ని సందర్భాలలో ధరలు పడిపోవడం పరిపాటే. ఎన్నికల నియమావళి కారణంగా మిర్చి యార్డు సందర్శనకు అధికారులు అనుమతులు నిరాకరించినా జగన్ అండ్ కో లెక్కలేనితనంతో వ్యవహరించారు. దీంతో ఎన్నికల కమిషన్ అధికారులు జగన్ అండ్ కోపై కేసు పెట్టారు. ఇదే పని జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు చేసి ఉంటే అరెస్టు చేసి ఉండేవారు. లేదా చంద్రబాబు ఇల్లు దాటకుండా గేటుకు తాళం వేయించి ఉండేవారు. ఇప్పుడు చంద్రబాబు తన చేతికి మట్టి అంటకుండా కాగల కార్యం ఎన్నికల కమిషన్ అధికారులతో చేయించారు. అనుభవానికి, అనుభవ లేమికి ఉన్న తేడా ఇది. మొత్తంమీద కూటమి ప్రభుత్వంపై దండయాత్రకు జగన్‌రెడ్డి అండ్ కో చేసిన రెండు కార్యక్రమాలూ వికటించాయి. కేంద్రం వద్ద తనకు ఉన్న పలుకుబడిని స్వప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల కోసం ఉపయోగించడంలో చంద్రబాబుకు ట్రాక్ రికార్డు ఉంది. 1999–2004 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న వాజపేయి ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి పనికి ఆహారం పథకం కింద భారీగా బియ్యం కేటాయించేలా కృషి చేశారు. ఇప్పుడు కూడా ఆ దిశగానే కృషి చేస్తున్నారు. విశాఖ ఉక్కుకు ప్రైవేటు ముప్పు తప్పించగలిగారు. పోలవరం, రాజధానికి నిధులు సాధించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇప్పుడు జగన్‌రెడ్డి అవసరం లేదు. ఎన్డీయే బలపడటం ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యం. ఈ మార్పును అర్థం చేసుకోకుండా జగన్‌రెడ్డి గతంలో వలె కాలం చెల్లిన ట్రిక్కులు ప్రదర్శిస్తే వాటిని తనకు అనుకూలంగా మలచుకోకుండా చంద్రబాబు ఉంటారా? చుట్టూ ఉన్మాద మూకను పోగేసుకొని ప్రభుత్వంపై దండయాత్రకు జగన్‌రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదు. నిజానికి విజయవాడ, గుంటూరులో చేపట్టిన కార్యక్రమాల వల్ల జగన్ అండ్ కో పరోక్షంగా తెలుగుదేశం పార్టీకి మేలే చేశారు. జగన్‌రెడ్డి కార్యక్రమాల ముందు వరకు తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో చంద్రబాబు ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ వచ్చారు. తమ అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేయడం లేదని విమర్శలు మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో బిజీగా ఉండే వారు. ఈ పరిణామం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇబ్బందిగా మారింది. కార్యకర్తలు కోరుకుంటున్నట్టుగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడలేక, అదే సమయంలో అదుపు తప్పుతున్న తెలుగు తమ్ముళ్లను శాంతింపజేయలేక సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో జగన్ అండ్ కో ప్రదర్శించిన వీధి నాటకాలు తెలుగు తమ్ముళ్లను మళ్లీ సంఘటితం చేశాయి. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలకు స్వస్తి చెప్పి జగన్ అండ్ కో ప్రదర్శించిన వీధి నాటకాల్లోని డొల్లతనాన్ని బయట పెట్టారు. దీంతో తెలుగుదేశం పార్టీకి మంచే జరిగింది.

వైఎస్ అలా.. జగన్ ఇలా!

2004కు ముందు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక హత్య కేసులో జైల్లో ఉన్న గౌరు వెంకటరెడ్డిని పరామర్శించి రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఆయన చర్యకు మద్దతు లభించింది. తనను నమ్ముకున్న వారి కోసం రాజశేఖరరెడ్డి ఎంత దూరమైనా వెళతారన్న పేరు వచ్చింది. ఇప్పుడు జగన్‌రెడ్డి తండ్రి బాటలోనే పయనించే ప్రయత్నం చేయాలనుకుంటున్నట్టుగా ఉంది. అయితే పరామర్శకు ఆయన ఎంచుకున్న మనుషుల గతాన్ని ప్రజలు మరిచిపోకపోవడం వల్ల సదరు ప్రయత్నాలు వికటిస్తున్నాయి. ఎంపీగా ఉన్నప్పుడు నందిగం సురేశ్ రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు వ్యతిరేకంగా అరాచకంగా ప్రవర్తించారు. అధికార మదంతో విర్రవీగారు. వల్లభనేని వంశీ విషయం కూడా అందరికీ తెలిసిందే. నోటికి హద్దూ పద్దూ లేకుండా చంద్రబాబు కుటుంబంపై అవాకులు చవాకులు పేలారు. మహిళలను అవమానించారు. తమకు జరిగిన అవమానాలను చంద్రబాబు గానీ, లోకేశ్ గానీ ఎలా మరిచిపోతారు? అందుకే సమయం, సందర్భం కోసం వేచి చూశారు. వంశీ వంటి వారు ఇంకా కొంత మంది ఉన్నారు. వారి వంతు రావడానికి ఇంకొంత సమయం పట్టవచ్చు. ఇప్పుడు జగన్ చుట్టూ కనిపిస్తున్న కొడాలి నాని, పేర్ని నాని, దేవినేని అవినాశ్, అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి వంటి వారు ఈ జాబితాలో ఉంటారని అంటున్నారు. ఇలాంటి వారిని అరెస్టు చేసినప్పుడు వారి పరామర్శకు జగన్‌రెడ్డి పోలోమని వెళ్లినా ప్రయోజనం ఉండక పోవచ్చు. అధికారంలో ఉన్నప్పుడు వివాదరహితులుగా ఉన్న వారిని ప్రభుత్వం వేధిస్తే, వారి కోసం జగన్‌రెడ్డి తపన పడితే అర్థం ఉంటుంది గానీ ప్రజల్లో సదభిప్రాయం లేనివారి కోసం గొంతు చించుకున్నా ప్రయోజనం ఉండదు. కూటమిలో చీలిక ఏర్పడకపోదా?, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య విభేదాలు ఏర్పడి విడిపోకుండా ఉంటారా? అని జగన్ అండ్ కో ఆశగా ఎదురుచూస్తున్నారు గానీ వారి ఆశలు నెరవేరే అవకాశాలు కూడా కనిపించడం లేదు. కేంద్రంలో ఎన్డీయే బలంగా ఉండాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నందున కూటమిలో విభేదాలు ఏర్పడకుండా ఆయన పెద్దన్న పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నారు. కూటమిలో చీలిక కోసం ఆశతో ఎదురుచూసే బదులు తనకు నమ్మిన బంటుగా బతికిన విజయసాయిరెడ్డి వంటి వారు ఇప్పుడు తనను వదిలి ఎందుకు వెళ్లిపోతున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేయడం జగన్‌రెడ్డికి మంచిది. వంచనతో కూడిన రాజకీయాలు అన్ని వేళలా పనిచేయవు. జగన్‌రెడ్డి ఎటువంటివారో, ఆయన పాలన ఎలా ఉంటుందో ప్రజలు తెలుసుకున్నారు. ప్రస్తుతానికి చంద్రబాబుకు గ్రహాలు అనుకూలంగా ఉన్నట్టున్నాయి. అందుకే కేంద్రంలో ఆయనకు పరపతి పెరుగుతోంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ ఆరోగ్యం క్షీణించడం, మహారాష్ట్రలో కూటమిలో విభేదాలు ఏర్పడటంతో ఎన్డీయేలో చంద్రబాబు ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఈ పరిస్థితిని ఆయన రాష్ట్రాభివృద్ధి కోసం ఉపయోగించాలని కోరుకుందాం. పరిస్థితులు అనుకూలించే వరకు వేచి ఉండకుండా తొందరపడి ఒక కోయిల ముందే కూసింది అన్నట్టుగా జగన్‌రెడ్డి వ్యవహరించడం, ఆందోళనలకు పిలుపునివ్వడం ఆయనకు మంచిది కాదని ఎవరు చెప్పాలి?

> సాధారణ ఎన్నికలకు కొంచెం ముందు ప్రతిపక్షంలో ఉన్న నాయకుడిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినాదాలు చేస్తే అర్థం చేసుకోవచ్చు కానీ ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలలకే, అది కూడా 11 సీట్లు మాత్రమే గెలుచుకున్న ఒక వ్యక్తిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినదించడం, అలా నినాదాలు చేసిన, చేయించుకున్న వారి మనోవికారాలకు అద్దంపడుతుంది. ఇలాంటి నినాదాలు జగన్‌రెడ్డికి ఆనందాన్ని ఇస్తూండవచ్చు గానీ, వినేవారికి ఎబ్బెట్టుగా ఉంటాయి. చంద్రబాబు, లోకేశ్ కంటే అందంగా ఉంటారు కనుక కొడాలి నాని, దేవినేని అవినాశ్‌ను కూడా త్వరలో అరెస్టు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రోతగా ఉన్నాయి. నీకంటే చంద్రబాబు అందంగా ఉంటారని అప్పట్లో ఆయనను అరెస్టు చేయించావా? అని ఎవరైనా ప్రశ్నిస్తే జగన్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారు?

ఉక్రెయిన్ భవిష్యత్తు ఏమిటి?

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య మాటలయుద్ధం చూస్తుంటే ఉక్రెయిన్‌ను అమెరికా పూర్తిగా ఒంటరి చేసేలా కనిపిస్తున్నది. యురోపియన్ యూనియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా, ఆ దేశాలు ప్రస్తుతానికి అమెరికాపైనే ఆధారపడి ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు నాలుగుదారుల కూడలిలోకి చేరుకుంది. ఏ యుద్ధం అయినా ఏదో ఒకరోజు ముగియవలసిందే. అయితే, మొదలుపెట్టిన వారికి అనుకూలంగానే యుద్ధం ముగియాలని గ్యారెంటీ ఏమీ లేదు. కానీ కీలకమైన యుద్ధాల ముగింపు ప్రపంచ బలాబలాలలో మార్పులు తెస్తాయి. నూతన కూటములు, నూతన అధికార క్రమాలు మొదలవుతాయి.

2021 ఆగస్టులో అమెరికా తనను నమ్ముకున్న వారిని నట్టేట ముంచి, మంచి మంచి ఆయుధాలను వదిలిపెట్టి, ఆఫ్ఘనిస్తాన్ నుండి పలాయనం చిత్తగించింది. ఈ పరిణామం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ధైర్యాన్నిచ్చింది. రష్యా–ఉక్రెయిన్ మధ్య ఎప్పటినుండో రగులుతున్న ఘర్షణలను సైనికంగా పరిష్కరించాలనుకున్నాడు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోబోతున్నట్లుగా ప్రకటనలు ఇవ్వడం, నాటో కూడా ప్రయత్నాలు మొదలు పెట్టడంతో పుతిన్‌కు ఇది సాకుగా ఉపకరించింది. రష్యా భద్రతకు ప్రమాదం ఏర్పడబోతున్నదనే పేరుతో 2022 ఫిబ్రవరి 14న ఉక్రెయిన్‌పై పుతిన్ యుద్ధం మొదలుపెట్టాడు.

పుతిన్ 2014లో ఉక్రెయిన్ ఆధీనంలో ఉన్న క్రిమియాను తిరిగి రష్యాలో విలీనం చేసినప్పటినుండే, నాటో ఉక్రెయిన్‌ను సైనికంగా బలోపేతం చేస్తూ వస్తున్నది. ప్రపంచాధిపత్య పోరులో భాగంగా రష్యాను కట్టడి చేయడం కొరకు ఉక్రెయిన్ సైనిక శక్తిని పెంచడం అమెరికాకు అవసరం కూడా. ప్రత్యర్థులను తక్కువగా అంచనా వేసి యుద్ధానికి దిగడంతో ప్రారంభంలో రష్యాకు తీవ్ర నష్టాలు ఎదురైనాయి. యుద్ధం ప్రారంభంలో, జెలెన్‌స్కీ దేశం విడిచిపోయేందుకు అమెరికా సహకరిస్తుందని ప్రకటించిన జో బైడెన్, రష్యాకు జరిగిన నష్టాలను చూసిన తర్వాత ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున ఆర్థిక, ఆయుధ సహాయం చేయడం మొదలుపెట్టాడు. రష్యాపైన అంతా పెద్దఎత్తున ఆంక్షలు విధించారు.

> ఉక్రెయిన్ యుద్ధాన్ని రష్యాకు అనుకూలంగా పరిష్కరించి రష్యాను మంచి చేసుకుని చైనాను ఒంటరి చేయాలనేది అమెరికా ఆలోచన కావచ్చు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాలు కొన్ని చైనాకు దగ్గర కావచ్చు, కొన్ని అమెరికా వైపు ఉండవచ్చు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో నూతన కూటములు ఏర్పడే క్రమం కూడా ఉంది. అమెరికా కొత్త కూటమికి అనుకూలంగా ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారమవుతుందనీ అనుకోవచ్చు.




మొదట్లో సమస్య పరిష్కారం కొరకు ఒకటి రెండు సమావేశాలు జరిగినా, యుద్ధక్షేత్రంలో రష్యాకు గట్టిజవాబు చెప్పగలమని నాటో దేశాలు విశ్వసించాయి.

అమెరికా, నాటోదేశాలు ఉక్రెయిన్‌కు అన్ని రకాల ఆయుధసాయం చేశాయి. ఉపగ్రహ సమాచారాన్ని, ఆధునిక డ్రోన్లను ఇచ్చాయి. అయితే పాశ్చాత్య మీడియా ప్రచారం చేసినట్లుగా రష్యా శక్తి అంతరించిపోలేదు. కాకపోతే 2022 ఆగస్టులో నాటో ఆయుధాలతో ఉక్రెయిన్ చేసిన బలమైన ఎదురుదాడితో యుద్ధస్థితిలో ప్రతిష్టంభన ఏర్పడింది. అక్కడి నుండి ఈ యుద్ధం మన పౌరాణిక సినిమాలలో చూపినట్టు–ఒకరు నిప్పుల బాణాలు వేస్తే మరొకరు నీళ్ల బాణాలు వేసినట్లు– సాగింది. ఉక్రెయిన్ సైన్యాలు నాటో అందించిన కొత్త ఆయుధాలను ఉపయోగించినప్పుడల్లా రష్యా కొద్దిగా వెనక్కు తగ్గేది. వాటి గురించి అర్థం కాగానే ఎదురు దెబ్బతీసేది. అమెరికన్ అబ్రాం ట్యాంకులు, జర్మన్ లెపర్డ్ ట్యాంకులకు ఎదురే లేదని నాటో చెప్పుకుంది కానీ, వాటినీ రష్యా ధ్వంసం చేసింది. అన్ని రకాల క్షిపణులను రష్యన్ సైన్యాలు కూల్చివేశాయి. ఆధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను అధిగమించి ఉక్రెయిన్ నగరాలపై రష్యా బాంబులు కురిపిస్తూ పోయింది. ఒక దశలో నాటో సైనిక సలహాదారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఉక్రెయిన్ సైన్యాలు అకస్మాత్తుగా, ప్రధాన యుద్ధ రంగానికి దూరంగా రష్యాకు చెందిన కురుస్క్ ప్రాంతంలో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నాయి. కురుస్క్‌ను రక్షించుకోవడం కొరకు ప్రధాన యుద్ధరంగం నుండి కొంత సైన్యాన్ని రష్యా ఉపసంహరించుకొని అక్కడకు పంపుతుందని నాటో ఆశించింది. కానీ, ఈ పురాతన ఎత్తుగడను సైతం రష్యా సులువుగా తిప్పికొట్టింది. ఉక్రెయిన్ సైన్యాన్ని కురుస్క్ నుండి వెళ్లగొట్టడానికి రష్యన్ సైనికులకు తోడుగా నార్త్ కొరియా సైనికులు కూడా వచ్చారు.

ఇంతలోగా అమెరికా ఎన్నికలు ముంచుకొచ్చి ఉక్రెయిన్ పరిస్థితి మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లు అయింది. ట్రంప్ వస్తే ఉక్రెయిన్‌కు అమెరికా సహాయం ఆగిపోవచ్చునని అందరూ ఊహించినదే. పదవి చేపట్టడంతోనే ఆయన ఈ యుద్ధం ముగింపు కొరకు రష్యాతో చర్చల కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఈయూ, ఉక్రెయిన్‌కు ఈ చర్చలలో స్థానం లేకుండా చేశాడు. ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుంది కాని దాని పాత సరిహద్దులు మారిపోవచ్చు అని ట్రంప్ అంటున్నారు. అంటే రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ తూర్పు ప్రాంతం రష్యాకే పోతుందని అర్థం. అలాగే ఉక్రెయిన్ రక్షణ గ్యారంటీలో అమెరికా సైన్యం ఉండదట. యుద్ధానికి మూలకారణమైన నాటో సభ్యత్వం ఉక్రెయిన్‌కు ఇవ్వడం సాధ్యమయ్యే పని కాదని కూడా ట్రంప్ తెగేసి చెప్పారు. అమెరికా వైఖరితో దిగ్భ్రాంతిచెందిన ఈయూ దేశాలు చర్చల్లో తమనూ, ఉక్రెయిన్‌ను భాగం చేయనందుకు అమెరికాను విమర్శిస్తున్నాయి.

యుద్ధం ముగింపు కొరకు జరుగుతున్న చర్చల క్రమాన్ని, ఈయూ, అమెరికా మధ్య పెరుగుతున్న అపనమ్మకాన్ని, అమెరికా రష్యాల మధ్య చిగురిస్తున్న స్నేహాన్ని చూసినప్పుడు కొత్తకూటముల ఉదయమేదో జరగబోతున్నట్లు కనిపిస్తున్నది. రష్యాకు అమెరికా స్నేహహస్తాన్ని అందిస్తూనే మరోవైపు చైనాతో కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇప్పుడు అమెరికాకు ప్రధాన శత్రువు చైనానే. చైనా నాయకత్వంలోని బ్రిక్స్‌తోనే అమెరికాకు ప్రమాదం. రష్యా చైనాలను ఒకేసారి ఎదుర్కోవడం సాధ్యం కాదని ఉక్రెయిన్ యుద్ధంతో తేలిపోయింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని రష్యాకు అనుకూలంగా పరిష్కరించి రష్యాను మంచి చేసుకుని చైనాను ఒంటరి చేయాలనేది అమెరికా ఆలోచన కావచ్చు. 1970లలో రష్యాను ఒంటరి చేయడానికి కిసింజర్ దౌత్యనీతితో చైనాను అమెరికా దగ్గరికి తీసుకున్నది. అప్పటివరకు తైవాన్ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించిన అమెరికా, చైనాతో దోస్తీ కొరకు తైవాన్‌ను చైనా అంతర్భాగంగా గుర్తించింది. అదే అమెరికా వారం క్రితమే తైవాన్ స్వాతంత్ర్యాన్ని గుర్తించే విధంగా తన వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. రష్యా దోస్తీ కొరకు ఉక్రెయిన్ తూర్పు ప్రాంతాన్ని రష్యాలో భాగమే అని కూడా అమెరికా అనవచ్చు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాలు కొన్ని చైనాకు దగ్గర కావచ్చు, కొన్ని అమెరికా వైపు ఉండవచ్చు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో నూతన కూటములు ఏర్పడే క్రమం కూడా ఉంది. అలాగే, అమెరికా కొత్త కూటమికి అనుకూలంగా ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారమవుతుందనీ అనుకోవచ్చు.

■ లంకా పాపిరెడ్డి



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.7 కనిష్ఠం 20.7

ఎండాకాలం..
షార్ట్ సర్క్యూట్‌లతో జాగ్రత్త
● గృహాలు, కార్యాలయాల్లో ముందస్తు చర్యలు తప్పనిసరి
6





కార్యక్రమంలో పాల్గొన్న అరోమా సింగ్, తదితరులు

రైళ్లలో మానవ అక్రమ రవాణాపై దృష్టి

● ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని రైల్ సంచాలన్ భవన్‌లో జరిగిన మానవ అక్రమ రవాణాపై ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో డివిజనల్ రైల్వే సెక్యూరిటీ కమిషనర్ డెబస్మితి బెనర్జీతో కలిసి బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరోమా సింగ్ మాట్లాడుతూ రైళ్లలో మానవ అక్రమ రవాణాపై ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 2023లో 305 మంది చిన్నారులను ఆర్పీఎఫ్ పోలీసులు రక్షించి, 137 మంది ఏజెంట్లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 2024లో 310 మంది పిల్లల్ని రక్షించి, 174 మంది ఏజెంట్లను అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు వెంకటేశ్వర్లు, న్యాయవాది హర్షితలతో పాటు సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్, వివిధ డివిజన్లకు చెందిన ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కుంభమేళాకు నాలుగు ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) కుంభమేళాకు వెళ్లి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఫిబ్రవరి 24,25 తేదీల్లో విజయవాడ, భువనేశ్వర్, అసన్‌సోల్, పాట్నాల మీదుగా చర్లపల్లి - ధన్‌పురాల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 24న చర్లపల్లి-ధన్‌పురా (07753), ధన్‌పురా-చర్లపల్లి (07754), 25న చర్లపల్లి-ధన్‌పురా (07755), ధన్‌పురా-చర్లపల్లి (07756) ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు వివరించారు.

నీళ్లు లాగేస్తున్నారు

హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లలో నల్లాలకు చైనా మోటర్లు

- అధిక మొత్తంలో నీళ్లు వినియోగం
- సమీప నివాసాలకు లోప్రెషర్ సమస్యలు
- చోద్యం చూస్తున్న వాటర్‌బోర్డు

నల్లాలకు చైనా మోటర్లను బిగించి నీటిని లాగేస్తున్నారు. వాటర్‌బోర్డు నల్లాలకు వాటిని బిగించడం నేరమైనా కొందరు బహిరంగంగానే వినియోగిస్తున్నారు. పలు ప్రైవేటు హాస్టళ్లు, అపార్ట్‌మెంట్ నివాసితులు మోటర్ల ద్వారా అధిక నీటిని లాగేస్తుండడంతో అవి లేనివారు లోప్రెషర్‌తో ఇబ్బందులు పడుతున్నారు.



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రాంతాలకు రోజు విడిచి రోజు గంటన్నర పాటు నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాలకు పుష్కలంగానే నీటి సరఫరా జరుగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో లో ప్రెషర్‌తో వస్తోంది. నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శేరిలింగంపల్లి, మాదాపూర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి బాలాజీనగర్, మెహిదీపట్నం, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో నీళ్లు అరగంట కూడా రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఒకే వీధిలో కొందరు నివాసితులకు పుష్కలంగా నీళ్లు వస్తుండగా, మరికొందరికి రావడం లేదు. ఇటీవల కాలంలో లోప్రెషర్‌తో నీళ్లు సరఫరా అవుతున్నాయని వాటర్‌బోర్డుకు పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. వాటర్‌బోర్డు సరఫరా చేసే నీరు సరిపోకపోవడంతో చాలా వరకు ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు.

మోటర్ల బిగింపే కారణం

కొన్ని అపార్ట్‌మెంట్లవాసులు పెద్దఎత్తున నీటిని తోడేందుకు చైనా మోటర్లను వాడుతున్నారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలకు నీళ్లు సరిగా రావడం లేదు. నగరంలోని వివిధ ఎగువ ప్రాంతాలకు నీళ్లను సరఫరా చేసినప్పుడు ఓ లైన్‌లోనే నీళ్లు వస్తుండగా, పక్క లైన్‌లో నీళ్లు లో ప్రెషర్‌తో వస్తున్నాయి. నీళ్లను విడిచే సందర్భంలో ఒక లైన్‌కు ఒకసారి, వేరేలైన్‌కు

మిగతా 8వ పేజీలో..

ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి మొజాంజాహీ మార్కెట్‌కు వెళ్ళే మార్గంలో ఇరువైపులా ఒకటి, రెండు మాత్రమే గతంలో మోటర్ల షాపులు ఉండేవి. ప్రస్తుతం ఆ మార్గంలో మొత్తం ఈ షాపులే కనిపిస్తున్నాయి. రాణిగంజ్‌తో

చైనా మోటర్ల వినియోగం

పాటు పలుప్రాంతాల్లో పెద్దఎత్తున మోటర్లను విక్రయిస్తున్నారు. ఇందులో దేశీయ, విదేశీ మోటర్లు కూడా ఉన్నాయి. చాలామంది చైనా మోటర్లను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పలు అపార్ట్‌మెంట్లు, ప్రైవేటు హాస్టల్స్, వాణిజ్య సముదాయాలు ఈ చైనా మోటర్లను వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఈ మోటర్లు ధర తక్కువ ఉండడంతో పాటు నీటిని తోడడంలో హార్స్ పవర్‌తో పని చేస్తున్నట్లు సమాచారం.

చట్ట విరుద్ధమైన పార్శిల్ పేరుతో..

1.15 లక్షలు స్వాహా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'అమెరికా నుంచి చట్టవిరుద్ధమైన పార్శిల్ వచ్చింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఉంది. కస్టమర్ క్లియరెన్స్ కింద డబ్బులు చెల్లిస్తే.. పార్శిల్ రిలీజ్ చేస్తాం' అంటూ సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.1.15 లక్షలు కొట్టేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి నుంచి నగరానికి చెందిన వ్యాపారి(24)కి ఫోన్ వచ్చింది. అమెరికా నుంచి పార్శిల్ వచ్చిందని, కొరియర్ చార్జీల కింద రూ. 25 వేలు చెల్లిస్తే అడ్రస్‌కు పార్శిల్ డెలివరీ చేస్తామని బురిడీ కొట్టించాడు. అప్పటికే తనకు అమెరికా నుంచి పార్శిల్ రావాల్సి ఉండటంతో వారు చెప్పింది నిజమేనని నమ్మాడు. ఆ వ్యక్తి చెప్పినట్లుగా రూ.25వేలు వారు చెప్పిన ఖాతాలో జమ చేశాడు. ఆ తర్వాత కొన్ని గంటలకు మరో వ్యక్తి ఫోన్ చేసి.. 'మీ పార్శిల్ అమెరికా నుంచి చట్టవిరుద్ధంగా వచ్చింది. దాంట్లో 50,000 యూఎస్ డాలర్స్ ఉన్నాయి. ఆ పార్శిల్‌ను రిలీజ్ చేయడం చట్ట ప్రకారం నేరం. అందుకు ఇండియన్ కరెన్సీలో ఫీజు చెల్లించి క్లియరెన్స్ సర్టిఫికెట్ పొందాలి. లేదంటే పార్శిల్ సీజ్ చేసి మీపై క్రిమినల్ కేసు నమోదు చేస్తాం' అని బెదిరించారు. దాంతో వారు చెప్పిన ఖాతాలో రూ.90,800 వేశాడు. డబ్బులు చెల్లించిన తర్వాత సదరు వ్యక్తులు స్పందించకపోవడంతో ఇదంతా మోసమని ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

'బండ' బూతుల స్టేషన్

- చీటీల కేసు వివాదంలో సీఐ, డీఐ మధ్య వాగ్వాదం
- స్టేషన్‌లోనే అసభ్య పద జాలంతో పరస్పరం దూషణ
- నువ్వెంత అంటే.. నువ్వెంత అని సవాల్
- మహిళా సిబ్బందిపై నోరుపారేసుకున్న ఇన్‌స్పెక్టర్
- సీపీకి ఫిర్యాదు చేయడానికి సిద్ధమైన మహిళా పోలీసులు
- పశ్చిమ మండలంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో ఘటన



హైదరాబాద్ సిటీ/బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులమనే విచక్షణ మరిచిపోయిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు 'నువ్వెంత అంటే నువ్వెంత.. రా రా చూసుకుందాం' అని బూతులు తిట్టుకున్నారు. స్టేషన్‌లోనే అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. ఈ ఘటన సిటీ కమిషనరేట్ పరిధిలోగల పశ్చిమ మండలంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. కొత్తగా ఏర్పాటైన ఆ పోలీస్ స్టేషన్ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నిత్యం ఏదో ఒక విధంగా వివాదానికి, విమర్శలకు తెరలేపుతున్న సిబ్బంది.. ఉన్నతాధికారులకు తలనొప్పిగా తయారయ్యారు. తాజాగా స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల మధ్య జగడం తీవ్ర చర్చనీయాంశం అయింది. ఆ గొడవ ఇద్దరితో ఆగకుండా మహిళా కానిస్టేబుల్‌పై నోరుపారేసుకునే వరకు వెళ్లింది.

అసలు ఏం జరిగిందంటే..

ఇటీవల స్టేషన్‌కు ఓ చీటీల మోసం కేసు వచ్చింది. కొందరు నిర్వాహకులు చీటీల పేరుతో వసూళ్లకు పాల్పడి డబ్బుతో ఉడాయించారు. దాంతో బాధితులు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. దీనిపై డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) స్పందించి.. సదరు మోసగాడు ఐపీ పెట్టాడని దీంతో తాము ఏమీ చేయలేమంటూ చెప్పారు. ఈ దశలో స్టేషన్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌హెచ్‌వో) కల్పించుకొని బాధితుల తరుపున స్పందిద్దామంటూ ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి మాటా మాటా పెరిగింది. ఇదిలా ఉండగా.. ఆ పంచాయితీకి కారణం నువ్వే అంటూ.. ఓ మహిళా కానిస్టేబుల్‌పై స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అసభ్య పదజాలంతో నోరు పారేసుకున్నట్లు సమాచారం. అందరి ముందు మహిళా కానిస్టేబుల్‌ను దూషించడంతో ఆమె ఇన్‌స్పెక్టర్‌కు ఎదురు తిరిగింది. ఈ నేపథ్యంలో స్టేషన్‌లోని మహిళా సిబ్బంది అంతా ఏకమయ్యారు. సదరు అధికారిపై అంతా కలిసి సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేయడానికి సిద్ధమైనట్లు తెలిసింది.

కర్రతో కొట్టి స్నేహితుడి హత్య
8
ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



18 మంది ఏఈలకు అదనపు బాధ్యతలు

- సమ్మర్ విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో చర్యలు
- జూలై 31 వరకు ఉద్యోగులకు సెలవులు రద్దు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సమ్మర్‌లో పెరిగే విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో 18 మంది ఏఈలకు అదనపు ఆపరేషన్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ దక్షిణ డిస్కం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న 18 మంది అసిస్టెంట్ ఇంజనీర్ల (ఏఈ)కు పలు సెక్షన్లలో అదనపు బాధ్యతలు అప్పగించింది. జూలై 31 వరకు వారు ఆ బాధ్యతల్లో కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే అప్పటి వరకు దక్షిణ డిస్కంలో ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

హెచ్-సిటీ

ప్రాజెక్టులో కీలక అడుగు

కేబీఆర్ పార్కు చుట్టూ స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌లకు టెండర్లు

- నోటిఫికేషన్ జారీచేసిన జీహెచ్‌ఎంసీ
- రూ. 1,090 కోట్లతో రెండు ప్యాకేజీల్లో పనులు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (హెచ్-సిటీ) ప్రాజెక్టులో కీలక అడుగుపడింది. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు బిడ్లు ఆహ్వానిస్తూ శనివారం జీహెచ్‌ఎంసీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు ప్యాకేజీలుగా ఈ పనులు చేపట్టనున్నారు. రూ.580 కోట్లతో ప్యాకేజీ-1లో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్, కేబీఆర్‌పార్కు ఎంట్రన్స్ జంక్షన్, ముగ్ధా జంక్షన్ ప్రాంతాల్లో అండర్ పాసులు, స్టీల్ వంతెనలు నిర్మించనున్నారు. రూ.510 కోట్లతో ప్యాకేజీ-2 లో భాగంగా రోడ్ నంబర్ 45 జంక్షన్, ఫిలింనగర్ జంక్షన్, మహారాజ్ అగ్రసేన్ జంక్షన్, కేన్సర్ ఆస్పత్రి జంక్షన్లలో అండర్‌పాస్‌లు, స్టీల్ వంతెనలు నిర్మించనున్నారు. పలు ప్రాంతాల్లో వంతెనలు, అడర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ పనులకు కొన్ని రోజుల క్రితమే రూ.7,032 కోట్లతో ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీలో ప్రాజెక్టులో వేగం పెంచుతోంది. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించింది. మార్చి 10న ప్రి బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. మార్చి 24మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్ల దాఖలుకు గడువు ఇచ్చారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు టెక్నికల్ బిడ్ ఓపెన్ చేస్తారు. మార్చి 26న ప్రైజ్ బిడ్ ఓపెన్ చేయనున్నారు. తక్కువ కోడ్ చేసిన ఏజెన్సీ వివరాలు కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ), ప్రభుత్వానికి పంపుతారు. సీఓటీ ఆమోదం పొందిన తర్వాత ఎంపికైన ఏజెన్సీతో లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్ఓఏ) జరుగుతుంది. ఇప్పటికే ఆస్తుల సేకరణ మొదలైంది. మిగిలిన జంక్షన్లలో కూడా ప్రాజెక్టులో భాగంగా ఆస్తుల సేకరణ కోసం ఇటీవలే స్టాండింగ్ కమిటీలో ఆమోదం లభించింది. హెచ్‌సిటీలో ఇప్పటికే కూకట్‌పల్లి ఫాక్స్ సాగర్‌పై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 47 కోట్లతో టెండర్ ప్రకటించారు. త్వరలో మియాపూర్‌తో పాటు ఐటీ కారిడార్‌లోని ఇతర ప్రాంతాల్లో టెండర్లు పిలిచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో సర్ఫరాజ్

భూసేకరణ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలి

● హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో నేషనల్ హైవే-44 కింద ప్యారడైజ్ జంక్షన్ నుంచి డైరీఫామ్ రోడ్డు వరకు, రాష్ట్ర రహదారి-01 కింద ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్ల భూసేకరణ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన కారిడార్ల భూసేకరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ భూ సేకరణ పనుల్లో భాగంగా వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నేషనల్ హైవే 44 కింద 405 కుటుంబాల సామాజిక సర్వే చేపట్టి పూర్తి చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఎస్‌డీసీ అపర్ణ, రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రిప్టో మోసాలు..

2 నెలల్లో 32 కేసులు

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే..



● అధిక లాభాల పేరుతో వల వేస్తూ రూ. కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీ మోసాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రజల ప్రధాన అవసరమైన డబ్బు పేరుతో వల వేసి సైబర్ నేరగాళ్లు రకరకాలుగా దోపిడీకి పాల్పడుతున్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు అంటూ ఒక వైపు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌తో భారీ లాభాలంటూ ప్రకటనలు చేస్తూ, నకిలీ యాప్స్‌తో వల వేస్తున్నారు. తాజాగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కేవలం 2 నెలల వ్యవధిలోనే 32 క్రిప్టో కరెన్సీ మోసం కేసులు నమోదయ్యాయంటే వాటి తీవ్రత ఎలా అర్థం చేసుకోవచ్చు.

యాప్‌లు వేదికగా క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్...

డిజిటలైజేషన్‌తో చాలామంది స్మార్ట్‌ఫోన్లనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో టెలిగ్రామ్, వాట్సాప్ వేదికగా క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో నేరగాళ్లు చాలా మందిని ఆకర్షిస్తున్నారు. క్రిప్టో ఇన్వెస్ట్‌మెంట్ స్కీం కింద మోర్గాన్ స్టాన్లీ కంపెనీని అనుకరిస్తూ వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన పత్తి మణికంఠ (22)తో పాటు హరియాణకు చెందిన మరో వ్యక్తి మోసాలకు పాల్పడ్డారు. వీరి వలలో చిక్కి నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డబ్బును పోగొట్టుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు మణికంఠను చేశారు. నిందితుడు కేవలం టెలిగ్రామ్, వాట్సాప్ యాప్‌ల ద్వారా ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. ఈ కేసులో బాధితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఒకేసారి రూ.52 లక్షలు పోగొట్టుకున్నట్లు తెలిపారు.

సైబర్ క్రైం పోలీసుల సూచన

సోషల్ మీడియా వేదికల ద్వారా ఆకర్షించే క్రిప్టో కరెన్సీ జోలికి వెళ్లొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నమ్మదగిన, పేరున్న క్రిప్టో ఎక్స్ఛేంజీలలో మాత్రమే ట్రేడ్ చేయాలన్నారు. ఏదైనా సంస్థ మీ వ్యాలెట్ వివరాలను అడిగితే అది మోసంగా భావించాలని సూచించారు. అసాధారణంగా అధిక లాభాలను ఇస్తామని హామీ ఇస్తే అది మోసమేనని తెలిపారు. సందేహం వస్తే 1930 లేదా సైబర్‌క్రైం.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వెంటనే సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు.

వెటర్నరీ వర్సిటీ వీసీగా

జ్ఞానప్రకాశ్ బాధ్యతల స్వీకరణ

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా డాక్టర్ ఎం.జ్ఞానప్రకాశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను వర్సిటీ నాన్‌టీచింగ్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షర్ఫుద్దీన్‌తో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు వీసీ చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు సుదర్శన్, అంజి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

25వ తేదీ నుంచి 27 వరకు
మద్యం షాపులు మూసివేయాలి: సీపీ

హైదరాబాద్ సిటీ,ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 25తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మెదక్, నిజామాబాద్ ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్నాయి. సైబరాబాద్ పరిధిలోని కొల్లూరు, ఆర్‌సీ.పురం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మద్యం షాపులను మూసివేయాలని కమిషనర్ సూచించారు.

గోల్ఫ్ సంయుక్త విజేతలుగా కళింగ, కాంటినెంటల్ జట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ (హెచ్‌పీజీఎల్)లో కళింగ వారియర్స్, కాంటినెంటల్ వారియర్స్ జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన ఫైనల్లో ఇరు జట్లు 40-40 స్కోర్లతో సమంగా నిలిచాయి. ఆదిత్య జైన్(కళింగ) 10-0తో రామ్ మునునూరి (కాంటినెంటల్)పై, ఆదిత్య బొమ్మరాజు (కళింగ) 10-0తో సురేష్ (కాంటినెంటల్)పై, జగన్‌మోహన్‌రెడ్డి(10-0)తో అఖిల్ (కళింగ)పై, నవీన్ (కాంటినెంటల్) 10-0తో మనికాంత్‌రెడ్డి(కళింగ)పై, శ్రీనాథ్ (కాంటినెంటల్) 10-0తో రణధీర్ (కళింగ)పై, రాఘవేంద్ర (కళింగ) 10-0తో గౌతం (కాంటినెంటల్)పై, ఫహీం (కళింగ) 10-0తో కేవీఎస్ఎన్ రెడ్డి (కాంటినెంటల్)పై గెలిపొందారు.

'అన్నపూర్ణ' కేంద్రాల ఆధునికీకరణకు చర్యలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో పేదల కోసం ఏర్పాటు చేసిన అన్నపూర్ణ భోజన కేంద్రాల ఆధునికీకరణకు జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. ఆయా 'అన్నపూర్ణ' కేంద్రాలలో సదుపాయాలు, భోజనాన్ని పరిశీలించేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి హెడ్‌గా, అడిషనల్ కమిషనర్లు పంకజ (హెల్త్), వేణుగోపాల్‌రెడ్డి (అడ్వర్టైజ్మెంట్)ని సభ్యులుగా నియమించారు. శనివారం ఈ కమిటీ సెక్రటేరియట్ వెనుక మింట్ కాంపౌండ్, లక్డీకపూల్ ప్రాంతాల్లోని అన్నపూర్ణ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న కనీస వసతులు, భోజన పరిమాణం, నాణ్యతలను పరిశీలించారు.

భార్యభర్తల గొడవలో
జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ రిమాండ్

బౌద్ధనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాను బతికుండగానే తన భర్త మరో మహిళను రెండో వివాహం చేసుకుని ఆమెతో కలిసి వేధింపులకు పాల్పడుతున్నాడని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో శనివారం చిలకగూడ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. బౌద్ధనగర్‌కు చెందిన ఎస్‌వీ జానకిరామ్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం అడ్మిన్ విభాగంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో అతడికి వివాహం కాగా భార్యభర్తలు విడిపోయారు. 2018లో అతడు కార్వాన్‌కు చెందిన కళ్యాణిని తిరుపతిలో రెండో పెళ్లి చేసుకున్నాడు. మెదక్‌లో కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో జానకీరామ్ అక్కడ ఓ మహిళ(26)తో పరిచయం పెంచుకుని ఆమెతో సహజీవనం చేసుకున్నాడు. ఈ క్రమంలో బౌద్ధనగర్‌లో అత్తింట్లో ఉంటున్న కళ్యాణికి వేధింపులు అధికమయ్యాయి. అనుమానం వచ్చిన కళ్యాణి.. భర్తపై నిఘా పెట్టింది. మధురానగర్ కాలనీలో ఉంటున్నట్టు తెలియడంతో శుక్రవారం ఉదయం కళ్యాణి తన బంధువులతో కలిసి అక్కడికి వెళ్లింది. తలుపులు తీయకపోవడంతో పగులగొట్టి లోపలికి జానకిరామ్‌పై దాడి చేశారు. అనంతరం భర్త, అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తూ అదనపుకట్నం తీసుకురావాలని, గ్యాస్ లీక్ చేసి చంపటానికి ప్రయత్నించారని కళ్యాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్తతో సహజీవనం చేస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది ఇలా ఉండగా స్నేహితురాలితో ఇంట్లో ఉండగా తన భార్య కళ్యాణి, మరో 29 మంది కుటుంబసభ్యులు, బంధువులు ఇంట్లోకి ప్రవేశించి తన స్నేహితురాలు, తనపై దాడి చేశారని జానకిరామ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసులు నమోదు చేసుకున్న పోలీసులు మొదట జానకిరామ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

● మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు నివాళి



దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, నాయకులు భాస్కర్‌రావు, వెంకట్రామిరెడ్డి, నిరంజన్, యాదగిరి తదితరులు - అఫ్జల్‌గంజ్, (ఆంధ్రజ్యోతి)



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

హిందీనగర్‌లో రోడ్డు పనులు ప్రారంభం

గోషామహల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని అన్ని బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. శనివారం జాంబాగ్ డివిజన్‌లోని హిందీనగర్, టెంట్‌హౌజ్ లేన్ బస్తీలో రూ.35లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.గోపాల్‌జీ, రవీందర్‌సింగ్, శైలేందర్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, ఎం.కృష్ణ, గణేష్‌యాదవ్, ఆనంద్‌జైన్, మయూర్, రాకేశ్, అనిల్, రఘు, రాజ్‌కుమార్, రేణుక, రామకృష్ణ, నందుకుమార్, జగపతి, మహేందర్, శేఖర్, భరత్ పాల్గొన్నారు.

శివ మహా జాగరణ మహోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

గోషామహల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పురానాపూల్ రహీంపురా శంకర్‌జీ హనుమాన్ కల్యాణమండపంలో మహా శివరాత్రి జాగరణ ఘనంగా నిర్వహించనున్నట్లు మహాశివరాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.పూర్ణచందర్‌రావు తెలిపారు. శనివారం గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌తో మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రధానకార్యదర్శి ఎస్.రాజన్‌కుమార్, అదనపు కోశాధికారి సచిన్ రాజ్‌సింగ్, శ్రీనివాస్‌గుప్తా, గోపాల్‌సింగ్, వ్యాఖ్యాత వి.మల్లేషయాదవ్, జంగంపాడు, చుక్క నవీన్, ఎ.శ్రీనివాస్‌గుప్తా, సందీప్‌గుప్తా, రవికుమార్, హరినాథ్, సురేశ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఝాన్సీరెడ్డి



నియామకపత్రం తీసుకుంటున్న దుంబాల ఝాన్సీరెడ్డి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళాకాంగ్రెస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షురాలుగా రాజేంద్రనగర్ బస్తీకి చెందిన దుంబాల ఝాన్సీరెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షురాలుగా అత్తాపూర్‌కు చెందిన రమాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆమెకు రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పామెన జ్యోతి, రాజేంద్రనగర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జుబేర్ రహమాన్ నియామక పత్రాలను అందజేశారు. ఆమెకు పామెన జ్యోతి, జుబేరా రహమాన్‌లు నియామక పత్రాలను అందజేశారు.



అత్తాపూర్ బడామసీదులో సమావేశమైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్‌బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ

రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగకు మసీదుల్లో, ముస్లింలు నివసిస్తున్న ప్రాంతాల్లో కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్‌బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ అన్నారు. శనివారం అత్తాపూర్ బడా మజీదులో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మతపెద్దలతో వారు సమావేశమయ్యారు. రంజాన్ సందర్భంగా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

● పహాడిషరీఫ్: రంజాన్ మాసంలో మసీదులు, ప్రధాన రహదారుల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షైక్ అఫ్జల్ వాలని జల్ పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్రామ్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. జల్‌పల్లి, పహాడిషరీఫ్, వాది ఏ హుదా, వాది ఏ ముస్తఫా, షాహిన్ నగర్ ఎర్రకుంట, కొత్తపేట్ తదితర ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలోని మసీదుల వద్ద చెత్తకుప్పలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు,

నకిలీ వార్తాపత్రికలపై చర్యలు తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో ఓ క్షుద్రపూజలు... అమెరికాలో స్థిరపడనున్న గులాబీ బాస్... అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నిర్వాహకులపై తగినచర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం నాయకులు ఆశిష్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలో సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని బీఆర్ఎస్ నాయకులు కోటి శైలేష్ కురుమ, అనిల్‌కుమార్, ప్రదీప్‌రాజ్ హెచ్చరించారు.



యువకులకు పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆశిశ్‌కుమార్ యాదవ్

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

గోషామహల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ గోషామహల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన యువకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బేగంబజార్ బీఆర్ఎస్ నాయకుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను నూతన యుగ ఆవిష్కర్తలుగా మార్చాలి

సిటీ కాలేజీ సదస్సులో ప్రొఫెసర్ రాజశేఖర్



సభలో మాట్లాడుతున్న బెల్లంకొండ రాజశేఖర్

చార్మినార్ ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణ తదితర అంశాలను పాఠ్యప్రణాళికలలో చేర్చటం ద్వారా విద్యార్థులను నూతన యుగ ఆవిష్కర్తలుగా మార్చవచ్చని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ మేనేజ్మెంట్ విభాగం ఆచార్యులు బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. సిటీకాలేజీ కామర్స్ మేనేజ్మెంట్ విభాగం 'సుస్థిర ఆర్థికాభివృద్ధి-ఆవిష్కరణలు, మౌలికసదుపాయాలు, పారిశ్రామికీకరణ' అనే అంశంపై నిర్వహించిన 2 రోజుల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయని, అలాంటి అంశాలపై అవగాహన కల్పించటం వల్ల విద్యార్థులను స్థిరమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన భవిష్యత్తుకు సన్నద్ధం చేయవచ్చని సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ ప్రాజెక్టులైన మెట్రో రైలు, కాళేశ్వరం వంటి అంశాలపై విద్యార్థుల చేత పరిశోధనాత్మక అధ్యయనం చేయించటం వారిలో కొత్త ఆలోచనలకు తావిస్తుందన్నారు. పర్యావరణ విషయమై ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కార మార్గాల గురించి కూడా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న మహాత్మాగాంధీ వీవీ కామర్స్ డీన్ ఆచార్య ఆకుల రవి మాట్లాడుతూ ప్రతి దేశం పారిశ్రామికీకరణ పేరుతో పురోగమనాన్ని అనుసరిస్తోందన్నారు. అయితే ఈ ప్రక్రియను సమీక్షించి, పర్యావరణానికి అనుకూలమైన, స్థిరమైన ఆవిష్కరణలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. ముగింపు సభకు వైస్‌ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా అధ్యక్షత వహించారు. సదస్సు కన్వీనర్ డా.మల్లికార్జున రావు రెండురోజుల సదస్సు నివేదికను సమర్పించారు. పత్రాలను సమర్పించిన ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. డా.ఝాన్సీ రాణి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో డా.జె.నీరజ, ఇఫత్ ఉన్నీసా, డా.కృష్ణవేణి, డా.రవీంద్రబాబు, లలిత చైతన్య తదితరులు పాల్గొన్నారు.



భర్త ఇంటి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న భార్య, ఆమె కుటుంబ సభ్యులు

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 6 నెలలుగా తన భర్త తనను పట్టించుకోవడం లేదని ఓ ఇల్లాలు శనివారం అతని ఇంటి ముందు తన కుటుంబ సభ్యులతో కలసి బైఠాయించి నిరసన తెలిపారు. నేరెడ్‌మెట్‌కు చెందిన కవితతో పాతబస్తీకి చెందిన శివకుమార్‌కు 2020లో వివాహం జరిగింది. శివకుమార్ తల్లితో పాటు కలిసి లక్ష్మీగూడలో ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. 4 సంవత్సరాలు శివకుమార్, కవిత అన్యోన్యంగా ఉన్నారు. ఆరు నెలలుగా వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆర్నెళ్ల క్రితం భార్య పుట్టింటింటికి వెళ్లిపోయింది. అయితే భర్త ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కవిత లక్ష్మీగూడలో నివాసం ఉంటున్న భర్త ఇంటికి వచ్చింది. మాట్లాడుకుందాం అంటే అతను పట్టించుకోలేదు. దీంతో ఇంటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు శివకుమార్‌పై 498/ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు.

డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న పరమేశ్వర్‌రావు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజన్ కౌన్సిల్(టీసీసీ) అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని యూనెస్కో క్లబ్స్ ఇన్ సౌత్ ఇండియా రీజినల్ కో-ఆర్డినేటర్ రామనాథం పరమేశ్వర్‌రావు పేర్కొన్నారు. సమాజసేవలో ఆయన సేవలు మరువలేనివని, నాలుగు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యానికి, పొగాకు, ధూమపానం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఆయన నిర్వహిస్తున్న కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా ఉంటున్నాయని అన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లో డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఇటీవల యూనివర్సిటీ ఆఫ్ నార్త్ ఎక్‌సెస్ అమెరికా నుంచి అవార్డు పొందారని తెలిపారు.



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారి గుర్మీత్‌సింగ్

విద్యార్థుల ప్రతిభకు సైన్స్ ఫెయిర్‌లు దోహదం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదపడుతాయని సీఆర్‌పీఎఫ్ అధికారి గుర్మీత్‌సింగ్ అన్నారు. ఫలక్‌నుమా నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ఫెరియా అకాడమిక్ ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు, ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, అకాడమిక్ కోఆర్డినేటర్లు డి.సునీత, జ్యోతిరావు, స్వప్న, వందన తదితరులు పాల్గొన్నారు.



ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అడ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా

ఆకట్టుకుంటున్న గృహోపకరణాల ఎగ్జిబిషన్

నార్సింగ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా చేతివృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్‌ను మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్లో ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనరల్‌శారీస్, కాంతావర్క్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెనశారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీటాప్స్, డిజైనర్ బ్లౌస్స్, లక్నో చికెన, బనారస్ శారీస్, ఖాదీమెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌సీట్స్, కొండపల్లి టాయ్స్ తదితర శారీస్‌ను మహిళలకు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాలో పాల్గొని, కొనుగోలు చేసుకోవాలని కోరారు.

కమిషనర్ శరత్‌చంద్ర సమీక్షా సమావేశం

నార్సింగ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ కౌన్సిల్ కార్యాలయంలో కమిషనర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ వివిధ వార్డుల్లో పారిశుధ్యం పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్ లజారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైస్మెంట్ పన్నుల వసూళ్లు, స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో భాగంగా పనులు నిర్వహించాలని ఆయన క్రింది స్థాయి అధికారులను ఆదేశించారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్, ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్స్, అన్‌అసెస్‌స్డ్, అండర్ అస్సెస్డ్, నూతన సంఘాల ఏర్పాటు, ఇందిరా మహిళా శక్తి స్కీమ్ తదితర కార్యక్రమాలపై ఆయన అధికారులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈ.మంజులత, ఆర్‌వో కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటిక ఆవరణలో బోరు వేయిస్తున్న కిరోసిన్ రాజు

శ్మశానవాటికలో సొంత ఖర్చులతో బోరు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు కిరోసిన్ రాజు తన తండ్రి డి.యాదయ్య జ్ఞాపకార్థం రాజేంద్రనగర్ శ్మశానవాటికలో పాడైన బోరు స్థానంలో శుక్రవారం కొత్త బోరు వేయించారు. త్వరలోనే ఆ బోరుకు మోటారు బిగిస్తానని ప్రకటించారు. దీంతో రాజేంద్రనగర్, మాణిక్యమ్మకాలనీ, అంబేద్కర్‌నగర్, హనుమాన్‌నగర్, ఎన్ఐఆర్‌డీపీఆర్ క్యాంపస్, శాంతినగర్ తదితర బస్తీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికలో బోరు పాడై మూడు సంవత్సరాలు అవుతున్నదని, ఈ విషయమై ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు చెప్పుకున్నా, అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని గుర్తుచేశారు. చివరకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు కిరోసిన్ రాజు ముందుకు వచ్చి బోరు వేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాకేశ్, రాజు, వి.నవీన్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీఎన్ఆర్ వెటర్నరీ వర్సిటీలో క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాకారులతో పరిచయం చేసుకుంటున్న డీసీపీ శ్రీనివాస్, వెటర్నరీవర్సిటీ రిజిస్ట్రార్ శరత్ చంద్ర, ఉదయ్‌కుమార్, సతీష్ తదితరులు




వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పోటీతత్వమున్నప్పుడే మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను, ఉత్తమ ఫలితాను అందుకోగలుగుతామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్‌లో పీవీ.నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులకు నాలుగు రోజులపాటు జరుగనున్న అంతర్ కళాశాలల క్రీడలు, సాహితీ, సాంస్కృతిక పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, క్రీడాపోటీలు అంటే వ్యాయామంతో సమానమన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ, క్రీడలతో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందన్నారు. డీన్ ఫ్యాకల్టీస్ డాక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు, సిబ్బందికి చదువుతో పాటు శారీరక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ సతీష్, రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి పాల్గొన్నారు.

దామోదర రాజనర్సింహ ముమ్మాటికీ మాదిగే

మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక



అభివాదం చేస్తున్న పాపయ్యమాదిగ, రాజు మాదిగ తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'మంత్రి దామోదర రాజనర్సింహ ముమ్మాటికీ మాదిగే. మాదిగ కాదు మంత్రి పదవి నుంచి తొలగించాలని మందకృష్ణ మాదిగ మాట్లాడడం అత్యంత దుర్మార్గం' అని మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక నేతలు ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక చైర్మన్ మేడి పాపయ్య మాదిగ, వైస్‌చైర్మన్‌లు ఇటుక రాజు మాదిగ, జన్న కనకరాజు మాదిగ, పి.మేరీమాదిగ, హనుమంతు, జి.యాదయ్య తదితరులు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతను ఆపడానికే మాలలతో కలిసి మందకృష్ణ మాదిగ కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు మంత్రి దామోదర రాజనర్సింహ ఎంతో కృషిచేశారని వారన్నారు. మార్చి 1 నుంచి మాదిగ అమరవీరుల జ్యోతియాత్ర నిర్వహిస్తున్నారు. మందకృష్ణ మాదిగ విమర్శలు మానుకోకపోతే ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈనెల 25న జరగనున్న మాదిగ, మాదిగ ఉపకులాల సమావేశంలో జ్యోతియాత్ర రూట్‌మ్యాప్‌ను రూపొందిస్తామన్నారు. ఐక్యవేదిక సలహాదారులు సంగీతం రాజలింగం, పాలడుగు శ్రీనివాస్‌రావు, జీపీ.నర్సింహ, సీహెచ్.యాదగిరి, కె.శ్రీనివాస్, మేడి రమణ పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న అయ్యప్ప స్వామి విగ్రహం

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లి హరిహరపుత్ర అయ్యప్ప, వీరాంజనేయ భక్త సమాజం, బస్తీప్రజల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజా మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం 4గంటలకు గణపతి పూజలతో పూజాకార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఉదయం 5:04 నిమిషాలకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అయ్యప్పస్వామి దేవాలయంతోపాటు గణపతి, సుబ్రమణ్య స్వామి, శివపంచాయతన, ద్వాదశ జ్యోతిర్లింగ, సంతోషి మాత, ధ్వజస్తంభం ప్రతిష్ఠ పూజలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతీ శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేదిక

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రతీ శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆస్తి పన్ను పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు. శనివారం జరిగిన ఆస్తి పన్ను పరిష్కార వేదికలో ఐదు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో మూడు దరఖాస్తులు తమకు ఆస్తి పన్ను ఎక్కువగా ఉందని, దానిని తగ్గించాలని వచ్చాయని తెలిపారు. మరో రెండు సమస్యలకు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమ్మోహనంగా లక్ష్య కూచిపూడి రంగప్రవేశం



నాట్యం చేస్తున్న నర్తకి లక్ష్య రాచప్రోలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నృత్యాంశాలకు వైవిధ్యభరితంగా యువనర్తకి లక్ష్య రాచప్రోలు నర్తించి ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డా.అలేఖ్య పుంజాల శిష్యురాలు లక్ష్య రాచప్రోలు కూచిపూడిలో రంగప్రవేశం చేసింది. త్రిష్ణ కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నర్తకి లక్ష్య కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, పద్మశ్రీ ప్రతిభ ప్రహ్లాద్, మాజీమంత్రి గీతారెడ్డి, హరిచందన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ఆమెను సత్కరించారు. అభినందించారు.

ఆకట్టుకున్న 'భజన సేయరాదా' సంగీత కచేరి



కచేరీ చేస్తున్న గాయకుడు సత్యశ్రీరామ్

రవీంద్ర భారతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ వేల నను బ్రోవరా.. అంటూ సాగిన సంగీత గీతాలాపన ప్రేక్షకుల్ని ఓలలాడించింది. శనివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో నాదప్రభ సంస్థ ఆధ్వర్యంలో భజన సేయ రాదా శీర్షికన సంగీత కచేరి నిర్వహించారు. ఈ కచేరీలో ప్రముఖ గాయకుడు జొన్నగడ్డ సత్యశ్రీరామ్ గానం చేయగా హార్మోణియంపై సాయి రాఘవచరణ్, తబలపై శ్రీరామ్, వయోలిన్‌పై తాళ్లప్రగడ షణ్ముఖ శ్రీవాత్సవ్, తబలపై కస్తూరి లలిత్‌కుమార్ వాయిద్య సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని కళాకారులను సత్కరించారు.



బహిరంగ ప్రకటన


సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా క్లయింటు మెసర్స్ కమిడి యశోద భర్త కె. నర్సింహా రెడ్డి, వయస్సు 70 సంవత్సరాలు, నివాసం: ప్లాట్ నెం.84, రోడ్ నం.7, ఉమెన్ కో-ఆపరేటివ్ సొసైటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్ వారు తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, వట్టినాగులపల్లి గ్రామం వద్దగల సర్వే నం.35/A/AA లోని ఎ.3-15 గుంటల విస్తీర్ణం మరియు సర్వే నం.36/AA లోని ఎ.3-15 గుంటల విస్తీర్ణం మరియు మొత్తం ఎ.6-30 గుంటల విస్తీర్ణం గల వ్యవసాయ భూమి (సరిహద్దులు: తూర్పు: సర్వే నం.33 & 34, పశ్చిమం: రోడ్డు, ఉత్తరం: సర్వే నం.35 & 36లోని మిగతా భూమి, దక్షిణం: పొరుగువారి భూమి) కొనుగోలు కొరకు 1) గొల్ల శ్రీనివాసులు తండ్రి గొల్ల బుచ్చన్న, వయస్సు సుమారు 56 సంవత్సరాలు, నివాసం: 11-16-16/ఎస్/103, ప్రశాంత్‌నగర్, హైదరాబాద్; 2) M/s. LYNYCS ప్రాపర్టీస్, ప్రాతినిధ్యం వహించు భాగస్వామి శ్రీ. నల్లపరెడ్డి లికిత్ రెడ్డి తండ్రి మురళీనాథ్ రెడ్డి, వయస్సు 31 సంవత్సరాలు, నివాసం: కోరేవాండ్లపల్లి గ్రామం, అల్లసముద్రం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్; 3) ఎం. సురేంద్ర వర్మ తండ్రి ఎం. సత్యనారాయణ రాజు, వయస్సు 45 సంవత్సరాలు, నివాసం: ఇ.నం.1-165, మెయిన్ రోడ్డు, ఉండి మండలం, పాందువా గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా. ఆంధ్రప్రదేశ్ వారితో విలువైన అమ్మకం ప్రతిఫలం మొత్తం కోసం 24.07.2024 తేదీ గల MOU కుదుర్చుకున్నారు మరియు 4) శ్రీమతి ఉమా దూబే భర్త రాజేందర్ ప్రసాద్ దూబే వయస్సు దాదాపు 66 సంవత్సరాలు, వృత్తి: గృహిణి; 5) పవన్ ప్రసాద్ దూబే తండ్రి రాజేంద్రప్రసాద్ దూబే వయస్సు సుమారు 43 సంవత్సరాలు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి; 6) అమిత్ ప్రసాద్ దూబే తండ్రి రాజేంద్రప్రసాద్ దూబే, వయస్సు సుమారు 41 సంవత్సరాలు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, అందరి నివాసం: ఇ.నం.3-23, వట్టినాగులపల్లి గ్రామం, గండిపేట మండలం, రంగారెడ్డి జిల్లా; 7) ఎ.రఘురామ్ తండ్రి ఎ. నారాయణ, వయస్సు సుమారు 42 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇ.నం.8-2-120/1/43, నూర్‌నగర్, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ వారితో కూడా 29.06.2023 తేదీన అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు 8) శ్రీమతి స్వప్న తివారీ భర్త బాలాజీ ప్రసాద్ తివారీ వయస్సు, సుమారు 46 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: ఇ.నం.485, రఘునివాస్, రోడ్ నెం.16, వందనాపురి కాలనీ, బీరంగూడ, అమీన్‌పూర్ మండలం, సంగారెడ్డి జిల్లా. 9) శ్రీమతి పూజా తివారీ భర్త హనుమాన్ ప్రసాద్ తివారీ, వయస్సు 38 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: 19-236-1, రామ్‌ప్రసాద్ లేన్, ఫరీద్‌సాహెబ్ స్ట్రీట్, ఆదోని, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారితో 29.06.2023 తేదీగల అమ్మకం ఒప్పందం కొనసాగింపుగా 19.12.2023 తేదీన కూడా అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు 1 నుండి 3 పార్టీలు నిర్దేశిత కార్యనిర్వర్తన కోసం సదరు 4 నుండి 9 పార్టీలపై ఎల్బీనగర్ వద్ద IV ADJ, రంగారెడ్డి జిల్లా వారి ఫైలుపై OS నెం.765/23 దావా దాఖలు చేశారు మరియు ప్రయోజనం గల పార్టీగా వాదిలో ఒకరిగా పైన పేర్కొన్న దావాలో శ్రీమతి కమిడి యశోద చేర్చబడినది. పెద్దలు మరియు బంధువుల ప్రమేయంతో LAC No.526/2024 (ఎల్బీనగర్ వద్ద IV ADJ, రంగారెడ్డి జిల్లా వారి ఫైలుపై OS నెం.765/23) ప్రకారం లోక్ అదాలత్ సమక్షంలో సదరు విషయం పరిష్కరించబడినది. తదనుగుణంగా, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ, రంగారెడ్డి జిల్లా 20.12.2024 తేదీన తీర్పును జారీచేసింది. తీర్పు ప్రకారం 1 నుండి 9 పార్టీలు పూర్తి అమ్మకం ప్రతిఫలం స్వీకరించారు మరియు 1 నుండి 3 పార్టీలు అమ్మకం నిర్ధారిస్తారు, కమిడి యశోద పేరున 4 నుండి 9 పార్టీల ద్వారా సేల్ డీడ్ వ్రాసుకోబడును.

పైన నిర్దేశించబడిన అమ్మకం లావాదేవికి సంబంధించి ఎవరికైనా, ఏ విధానంలోనైనా ఏమైనా అభ్యంతరములు ఉన్నట్లయితే, వారు వారి వ్రాతపూర్వక అభ్యంతరములను దిగువ తెలిపిన చిరునామాకు ప్రస్తుత ప్రచురణ తేదీ నుండి '7' రోజులలోగా పంపవచ్చును. విఫలమైనచో, '7' రోజులు దాటిన మీదట ఎలాంటి అభ్యంతరములు పరిశీలించబడవు మరియు మా క్లయింట్లు సదరు అమ్మకం లావాదేవిని పూర్తి చేసుకోవడానికి తదుపరిగా ముందుకు కొనసాగుతారు.

సం/- మెసర్స్ ఎస్. బొజ్జయ్య (గణేష్) - అడ్వకేట్
ఇ.నం.3&188/1, ప్లాట్ నం.671 సౌత్, నంది హిల్స్, మీర్‌పేట్, హైదరాబాద్-97
ఫోన్ నం: 9849603355

ఎండకాలం.. షార్ట్ సర్క్యూట్‌లతో జాగ్రత్త

● గృహాలు, కార్యాలయాల్లో ముందస్తు చర్యలు తప్పనిసరి
● విద్యుత్ తీగల సామర్థ్యం, ఎలక్ట్రికల్ పరికరాలు తనిఖీ చేయించుకోవాలి



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎండలు ముదురుతున్నాయి.. ఫిబ్రవరి మూడో వారంలో ఉష్ణోగ్రతలు 36-37 డిగ్రీలకు చేరాయి.. ప్రతి ఇంట్లో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు గంటల కొద్దీ వాడుతున్నారు. వేసవికాలం ఇళ్లు, ఆఫీసుల్లో నాణ్యత లేని విద్యుత్ ఉపకరణాలు వాడితే షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని విద్యుత్ రంగనిపుణులు హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 40-45 డిగ్రీల వరకు చేరే అవకాశాలున్న నేపథ్యంలో గంటల కొద్ది ఏసీలు, కూలర్లు ఆపకుండా వినియోగించడంతో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రిటైర్డ్ విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో షార్ట్ సర్క్యూట్ జరగకుండా తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు మీకోసం..

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- వేసవికాలం ప్రారంభానికి ముందు ఒకసారి గృహాలు, ఆఫీసుల్లో ప్రైవేట్ ఎలక్ట్రిషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి.
- విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రి ఉపయోగించాలి.
- ఏ వస్తువు వాడేందుకు ఎంత విద్యుత్ అవసరముంటుందో తెలుసుకొని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.
- 4 చ.మిల్లీమీటర్ల మందం కలిగిన విద్యుత్ తీగలు ఇళ్లలో వినియోగించుకోవాలి.
- ఉదాహరణకు 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ విద్యుత్ భారంపడే పరికరాలు వినియోగిస్తే తీగలు కాలిపోతాయి.
- నాసిరకం విద్యుత్ పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రమాదాలకు అవకాశముంటుంది. ఇన్సులేషన్ పటిష్ఠంగా ఉండేలా చూసుకోవాలి.
- ప్రతి ఇంటిలో, చిన్న వాణిజ్య భవనాల్లో న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- భూమిలోని తేమ, ఉష్ణోగ్రతపై ఎర్తింగ్ సిస్టమ్ ఆధారపడుతోంది. ఎండకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు నీరు, దొడ్డు ఉప్పు ఉపయోగించాలి.
- గృహాలు, కార్యాలయాల్లో విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి. ఒకే స్విచ్‌బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలకు అవకాశముంటుంది.
- ఇళ్లలో కొత్తగా విద్యుత్ ఉపకరణాలు పెట్టేందుకు అవసరమైన కనెక్టెడ్ లోడ్ ఉందో లేదో ముందే చూసుకోవాలి. అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు తర్వాతే ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలి.
- విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్ వైర్ అతుకులు లేకుండా ఉండేలా చూసుకోవాలి.
- ఎండలో విద్యుత్‌తీగలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండతో తీగలపై ఉన్న రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయి.
- సింగిల్ ఫేజ్ సర్క్యూట్‌లో ఫేజ్, న్యూట్రన్ ఎర్త్, వైర్లు సమాన పరిమాణంలో ఉండేలా చూసుకోవాలి.
- రక్షణ పరికరాలైన ఎంసీబీ(మైక్రో సర్క్యూట్‌బ్రేకర్), ఎంసీసీబీ (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులు బైపాస్ చేయకూడదు.
- లైటింగ్ సర్క్యూట్ కోసం 30 మిల్లీ యాంప్స్ ఈఎల్‌సీబీ/ఆర్‌సీసీబీ పవర్ సర్క్యూట్‌లో 100 మిల్లి యాంప్స్ ఈఎల్‌సీబీ/ఆర్‌సీసీబీ వినియోగించాలి.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్, రాజన్న, శ్రీరంగ్ దావ్లే

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సుల్తాన్‌బజార్‌లో టాటా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, క్లస్టర్ హెడ్ శ్రీరంగ్ దావ్లేతో కలిసి కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నూతన గదులతో పాటు సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, బాల, బాలికలకు డైనింగ్ హాల్స్, కాన్ఫరెన్స్‌హాల్, మౌలిక సదుపాయాలు కల్పించారని వివరించారు. టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న మాట్లాడుతూ పేద పిల్లల విద్యా వికాసంలో టాటా సంస్థ ముందుంటుందన్నారు. అనంతరం టీసీఎస్ ప్రతినిధులు భవన డాక్యుమెంట్స్‌ను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం ఆదిత్యవర్ధన్ రాజు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఏదైనా పని తీరే ప్రామాణికం

● **ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి**



సిబ్బందికి రివార్డులు అందజేస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చేస్తున్న ఉద్యోగం ఏదైనా.. ఉత్తమ పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు అబ్కారీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి, ధూల్‌పేట్, ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) టీమ్‌లకు ఆయన నగదు రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టీఎఫ్ టీమ్‌లు హైదరాబాద్, ఖమ్మం ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయితో పాటు పలు జిల్లాల్లో నాటుసారా తయారీదారులపై కేసులు నమోదు చేసి నిఘా పెడుతున్నాయని తెలిపారు. స్టేట్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నాలుగు టీమ్‌లతో పాటు.. రంగారెడ్డి డివిజన్‌లో 14 మందికి, హైదరాబాద్ డివిజన్ నుంచి ఏడుగురికి, ధూల్‌పేట్ స్పెషల్ టీమ్‌లో 16 మందికి, ఎస్‌టీఎఫ్ ఏ టీమ్‌లో 21 మందికి, బీ టీమ్‌లో 12 మందికి, సీ టీమ్‌లో 14 మందికి, డీ టీమ్‌లో 14 మందికి వి.బి. కమలాసన్‌రెడ్డి నగదు రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రి, జాయింట్ కమిషనర్ ప్రణవి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఏ,బీ టీమ్‌ల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, డీఎస్పీ తిరుపతియాదవ్, ఏఈఎస్ జీవన్‌కిరణ్, సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ కాన్సుల్ జనరల్ పదవీ కాలం ఐదేళ్లు పొడిగింపు



నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ జనరల్‌గా డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ పదవీ కాలాన్ని ఐదేళ్లు పొడిగించింది. దీంతో 2030 జనవరి వరకు ఆయన పదవిలో ఉండనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కజకిస్తాన్ దేశానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తారు. తనపై ఉంచిన నమ్మకానికి కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు, భారత్‌లోని కజకిస్తాన్ రాయబారి నుర్లాన్ జల్గస్బాయేవ్‌కు నాసిర్ అలీ ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

బ్లాక్ ఫిల్మ్‌లు.. మల్టీటోన్ హారన్‌లు పెడితే కఠిన చర్యలు

● **ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్**



మాట్లాడుతున్న సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లు వేసినా, బైక్‌లకు అనధికారిక మల్టీటోన్డ్ హారన్‌లు బిగించినా కార్ డెకార్స్, బైక్ రిపేర్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ హెచ్చరించారు. నగరంలోని కార్‌డెకార్స్, బైక్ మెకానిక్ యాజమాన్యాలతో శనివారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో డీసీపీ రాహుల్ హెగ్డే, అశోక్‌కుమార్‌తో అడిషనల్ సీపీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు నిబంధనలు ఉల్లంఘించి మరమ్మతులు చేయొద్దని కార్ డెకార్స్, మెకానిక్ యాజమాన్యాలకు సూచించారు. డబ్బుకోసం వ్యాపారమే ధ్యేయంగా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ సీపీ హెచ్చరించారు. కార్యక్రమంలో నగర పరిధిలోని ట్రాఫిక్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లకు బిల్డ్‌నౌ డీసీఆర్‌పై శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం లైసెన్స్ కలిగిన ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లకు బిల్డ్‌నౌ డీసీఆర్‌పై హ్యాండ్స్ ఆన్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డ్‌నౌ డీసీఆర్ వ్యవస్థపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వడంతో పాటు భవన అనుమతుల ప్రక్రియలో క్రియేషన్ ఆఫ్ టెంప్లేట్స్, లేయర్లు, వివిధ ఎంటిటీలను రూపొందించడంపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ భవనాల రూపకల్పన, అనుమతుల ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఫాస్ట్ డ్రాయింగ్, స్క్రూటినీ సిస్టం కోసం అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులు వేగవంతంగా పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అడిషనల్ సీసీపీలు, సీపీలు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి కళాశాల ప్రొఫెసర్‌కు జాతీయ అవార్డు



జాతీయ అవార్డును అందుకుంటున్న ప్రొఫెసర్ శ్రీనివాసులు

రామంతాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ జీఎల్ఎన్ శాస్త్రి స్మారక జాతీయ అవార్డును రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గడుగు శ్రీనివాసులు అందుకున్నారు. పుణేలో నిర్వహించిన 27వ జాతీయ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి సదస్సులో డాక్టర్ శ్రీనివాసులుకు ఈ అవార్డును మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ మిలింద్ నీకుంబ్ అందజేశారు. డాక్టర్ శ్రీనివాసులు హోమియో వైద్యానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేసినట్లు సదస్సు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా హోమియో వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ప్రొఫెసర్ శ్రీనివాసులుకు అభినందనలు తెలిపారు.

క్యాన్సర్ చికిత్సను తట్టుకోవడానికి పోషకాహారం అవసరం

'ఆంకో న్యూట్రిషన్ ప్రోగ్రామ్'లో అంకాలజిస్టులు



'ఆంకో న్యూట్రిషన్ ప్రోగ్రామ్'లో అంకాలజిస్టులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కణాలను నాశనం చేయడానికి శక్తివంతమైన మందులు, చికిత్సా విధానాలను తట్టుకోవడానికి శరీరానికి సరైన పోషకాహారం అవసరమని అంకాలజిస్టులు పేర్కొన్నారు. మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో క్యాన్సర్ రోగుల కోసం 'ఆంకో న్యూట్రిషన్ ప్రోగ్రామ్'ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ అమిత్ జోత్వాని మాట్లాడుతూ రోగులు తీసుకుంటున్న చికిత్సా విధానానికి, ఎదుర్కొంటున్న దుష్ప్రభావాలకు, శరీరానికి తగినట్లుగా ప్రత్యేకంగా రూపొందించిన ఆహార ప్రణాళిక ద్వారా కావాల్సిన పోషకాహారం పొందవచ్చునని చెప్పారు. రోగి ప్రస్తుత శారీరక, వైద్య పరిస్థితికి అనుగుణంగా క్యాన్సర్ చికిత్సలను తట్టుకొని, త్వరగా కోలుకోవడానికి శరీరానికి ఉపయోగపడేలా ఆంకో న్యూట్రిషన్ ప్రోగ్రామ్ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకాలజిస్టులు ప్రశాంత్‌రెడ్డి, సరిత శ్రీవాస్తవ ప్రవీణ్, శ్రీరామ్, రఘుకాంత్, శ్రీలత పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం



సదస్సులో పాల్గొన్న హైకోర్టు జడ్జి మాధవీ దేవి, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమైనదని హైకోర్టు జడ్జి మాధవీ దేవి అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి(ఆర్‌బీవీఆర్‌ఆర్) ఉమెన్స్ కాలేజీలు సంయుక్తంగా 'విమెన్ అండ్ క్లైమేట్ యాక్షన్' సదస్సును శనివారం నారాయణగూడలోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు జడ్జి జస్టిస్ టి.మాధవీ దేవి హాజరై మాట్లాడారు. ప్రకృతి పరంగా ఎదురయ్యే విపత్తులను ఎదుర్కొనే సందర్భంలో, ప్రకృతిని రక్షించే బాధ్యతలను తీసుకోవటంలో మహిళలు ముందుంటారన్నారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ ప్రిన్సిపాల్ అచ్యుతాదేవి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లీలా లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడారు. రెడ్డి కాలేజీ విద్యార్థులు కూడా ప్రకృతి రక్షకులుగా ఎల్లప్పుడూ ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, హెచ్‌ఎంవీఎస్ సెక్రటరీ ముత్యం రెడ్డి, సీనియర్ అడ్వకేట్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

2018 పీహెచ్‌డీ బ్యాచ్ గడువు పొడిగించండి

ఓయూ రిజిస్ట్రార్ కార్యాలయంలో విద్యార్థుల బైఠాయింపు



రిజిస్ట్రార్ కార్యాలయంలో బైఠాయించిన పరిశోధక విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ 2018 పీహెచ్‌డీ బ్యాచ్ కాలపరిమితిని ఒక సంవత్సరం పొడిగించాలని పరిశోధక విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 2018 ఆగస్టు నుంచి 2019 వరకు రెండు విడతలుగా అడ్మిషన్ పొందిన తాము కరోనా వల్ల రెండు సంవత్సరాల సమయాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. యూజీసీ నిబంధనల మేరకు గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఓఎస్‌డీ జితేందర్‌నాయక్ పలుమార్లు వీసీతో ఫోన్లో మాట్లాడారు. ఈనెల 28లోపు స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి గడువు పొడిగించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో పరిశోధక విద్యార్థులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు కొమ్ము శేఖర్ మాదిగ, జీడి అనిల్ కుమార్, దర్శన్, నర్సింహ, క్రాంతి నాయక్, అరుణ్, మెడి కార్తీక్, క్రాంతి రాజు, పెద్దమ్మ రమేష్, నాగరాజు పాల్గొన్నారు

బిట్ కాయిన్ ట్రేడింగ్ పేరుతో మోసం

●**చెన్నైలో నిందితుడు బాలకృష్ణారెడ్డి అరెస్ట్**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బిట్ కాయిన్ ట్రేడింగ్ పేరుతో దేశంలో పలువురిని మోసం చేసిన వ్యక్తిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైకి చెందిన బాలకృష్ణారెడ్డి(41), అతడి సోదరుడు కలిసి క్రిప్టో ట్రేడింగ్ పేరుతో 'బిట్ కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను స్థాపించారు. తమ ప్లాట్‌ఫాం ద్వారా క్రిప్టో కరెన్సీ కొనుగోలు, విక్రయాలు చేయవచ్చని ప్రచారం చేసుకున్నారు. వీరి మాటలు నమ్మి జూబ్లీహిల్స్‌కు చెందిన బాధితుడు(35) బిట్ కాయిన్ ఇండియా వాలెట్ అండ్ ఎక్స్ఛేంజ్ ద్వారా రూ.8.49 లక్షలు చెల్లించి క్రిప్టో కరెన్సీ (సిలికాన్ ఎస్‌సీ) కాయిన్లు కొనుగోలు చేశాడు. తర్వాత సంబంధం లేని కారణాలు చూపుతూ బిట్ కాయిన్ ఇండియా వాలెట్ అండ్ ఎక్స్ఛేంజ్ నిర్వాహకులు బాధితుడి విత్‌డ్రా ఆప్షన్‌ను తీసివేశారు. ఖాతాను నిలిపివేశారు. బాధితుడు తన ఖాతాను పరిశీలించగా నెగిటివ్ బ్యాలెన్స్ ఉంది. ఈ విషయమై క్రిప్టో ట్రేడింగ్ నిర్వాహకులను సంప్రదించగా.. 'మెయింటెనెన్స్ ఫీజు కింద మీ పెట్టుబడి మొత్తం జమ అయిందని, ఇంకా మీరే డబ్బులు కట్టాలి'అని దబాయించారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన సైబర్ క్రైం పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. సైబర్ క్రైం డీసీపీ కవిత దారా ఆదేశాల మేరకు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.సతీష్‌రెడ్డి ఎస్సై పృథ్వీరాజ్ బృందం చెన్నైలోని అన్నానగర్‌లో నిందితుడు ఎస్.బాలకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరి మాటలు నమ్మి దేశంలో పలు ప్రాంతాలకు చెందిన వందలాది మంది మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు.

కర్రతో కొట్టి స్నేహితుడి హత్య

చందానగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్నేహితుడే కాలయముడై కర్రతో కొట్టి చంపిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాపిరెడ్డి కాలనీలో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.డీ.నసీర్(41) నెహ్రూనగర్‌లో నివాసం ఉండే ఫక్రుద్దీన్ స్నేహితులు. ఫక్రుద్దీన్ శుక్రవారం రాత్రి 8.00గంటలకు నసీర్ ఇంటికి వచ్చి అయనను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని గోపీచెరువు బేబీ పౌండ్ దగ్గరకు తీసుకెళ్లాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో ఫక్రుద్దీన్ కర్రతో నసీర్ తలపై కొట్టాడు. నసీర్‌కు తీవ్రగాయమై రక్తస్రావమైంది. ఫక్రుద్దీన్ తన స్నేహితుడు కలీద్ సాయంతో నసీర్‌ను కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్ అతడు అప్పటికే మరణించాడని నిర్ధారించారు. దీంతో ఫక్రుద్దీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. నసీర్ తండ్రి రసీద్‌మియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. హత్యకు గల కారణం తెలియాల్సి ఉంది.

నీళ్లు లాగేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

మరోసారి నీళ్లను విడిస్తే లో-ప్రెషర్ సమస్య ఉండదు. కానీ వేర్వేరు లైన్లకు ఒకేసారి నీళ్లను విడుదల చేయడం వల్ల కొందరికి లో-ప్రెషర్‌లో నీటి సరఫరా అవుతోంది.

ప్రైవేటు హాస్టళ్లలో..

గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రైవేటు వసతి గృహాలు వివిధ ప్రాంతాల్లో కోకొల్లలుగా ఉన్నాయి. పీజీ హాస్టల్స్, వర్కింగ్ హాస్టల్స్, కోలివింగ్ అంటూ వివిధ రకాల పేరుతో నిర్వహిస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, ఉప్పల్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, అశోక్‌నగర్, చిక్కడపల్లి, నారాయణగూడ, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, నిజాంపేట, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, అమీర్‌పేట, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. ప్రైవేటు హాస్టల్స్ చాలా వరకు నివాస భవనాల్లో ఉన్నాయి. ఎండలు ముదరడంతో నీటి అవసరాలు పెరిగాయి. వాటర్‌బోర్డు సరఫరా చేసే నీరు సరిపోకపోవడంతో మోటర్లు పెట్టి నీటిని తోడుతున్నారు.

చోద్యం చూస్తున్న 'విజిలెన్స్'

అక్రమ నల్లా కనెక్షన్లను, నల్లాలకు మోటర్లను బిగించి తోడేవారిపై కొరడా ఝుళిపించాల్సిన వాటర్‌బోర్డు విజిలెన్స్ విభాగం చోద్యం చూస్తోంది. విజిలెన్స్ విభాగమంతా ఆఫీసులకే పరిమితమవ్వడంతో వివిధ ప్రాంతాల్లో పెద్దఎత్తున నల్లాలకు మోటర్లను బిగించి నీటిని తోడుతున్నారు. వాటర్‌బోర్డుకు కూతవేటు దూరంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో హాస్టల్స్ నిర్వాహకులు మోటర్లతో నీటిని తోడుతున్నారని, వాటర్‌బోర్డు టోల్ ఫ్రీ నంబర్ 155313కి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు.

యుక్తవయసు పిల్లలకు ఇవి చెప్పండి..!

పిల్లలకు యుక్తవయసులో సొంత ఆలోచనలు, అభిప్రాయాలు ఏర్పడుతూ ఉంటాయి. తల్లిదండ్రులు వాటిని గౌరవిస్తూనే తగిన మార్గనిర్దేశనం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. యుక్తవయసు పిల్లలకు ఏ అంశాలు ఎలా వివరించాలో తెలుసుకుందాం.

- మానసిక ఆరోగ్యం గురించి తల్లిదండ్రులు వివరించి చెప్పాలి. భావోద్వేగాల నియంత్రణతోపాటు ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకునే మార్గాలు తెలియజేయాలి.
- ఆన్‌లైన్ మోసాలను వివరించాలి. సామాజిక మాధ్యమాల్లో జాగరూకతతో వ్యవహరించమని చెప్పాలి.
- సంబంధ బాంధవ్యాలు, గౌరవం, భావ వ్యక్తీకరణ గురించి యుక్తవయసు పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించాలి.
- డ్రగ్స్, మద్యం, సిగరెట్ లాంటి అలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ వాటికి దూరంగా ఉండమని చెప్పాలి. స్నేహితుల నుంచి ఈ అలవాట్లు చేసుకోకుండా అవగాహన కల్పించాలి.
- పిల్లల అభిరుచులను ప్రోత్సహించాలి. తమ శక్తిని తక్కువ అంచనా వేసుకోకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకొమ్మని చెప్పాలి.
- చదువు వల్ల ఒత్తిడికి గురికాకుండా ఇష్టంగా చదువుకునే విధానాలను చర్చించాలి. పరీక్షల విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని హెచ్చరించాలి. ఈర్ష్య, అసూయలకు తావు లేకుండా స్నేహితుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని చెప్పాలి.



- డబ్బు విలువ తెలియజెప్పాలి. ఖర్చు చేసే విధానం, పొదుపు మార్గాలను వివరించాలి.
- ఓటమి ఎదురైనప్పుడు నిరాశ పడకుండా ధైర్యంగా ముందుకు సాగే విధానాన్ని వివరించాలి.
- ప్రేమ పేరుతో జరిగే మోసాలను వివరించి చెప్పాలి.
- వ్యక్తిగత శ్రద్ధతోపాటు తోటివారితో స్నేహంగా మెలగడం, దయతో ప్రవర్తించడం, అవసరమైనవారికి సహాయ సహకారాలు అందించడం లాంటివి ప్రత్యేక గౌరవాన్ని అందిస్తాయని చెప్పాలి.

మిస్ వరల్డ్



ప్రియాంక చోప్రా

రీటా ఫారియా

ఈసారి ప్రపంచ సుందరి పోటీలకు భాగ్యనగరం వేదిక కానుంది. మే 7 నుంచి 31 వరకు జరిగే ఈ అందాల పండుగపై అప్పుడే అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ప్రపంచ సుందరి పోటీలను భారత్‌లో నిర్వహించటం ఇది మూడవసారి. తెలుగు రాష్ట్రాలలో జరగటం ఇదే మొదటిసారి. ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొంటారు. కాగా 1997లో హైదరాబాద్ అమ్మాయి డయానా హెడెన్ ఈ కిరీటాన్ని దక్కించుకుంది.



ఐశ్వర్యా రాయ్

యుక్తా ముఖి

భాగ్యనగరానికి అందాల సోయగాలు!



డయానా హెడెన్

మానుషి చిల్లర్

పోటీల ప్రస్థానం

ప్రపంచ సుందరి పోటీలు మొదటిసారి 1951లో ఇంగ్లండ్‌లో ప్రారంభమయ్యాయి. ఇంగ్లండ్‌కు చెందిన 'ఎరిక్ మోర్లీ' ఈ పోటీల సృష్టికర్త. 2000 సంవత్సరంలో ఎరిక్ మరణించిన తర్వాత ఆయన భార్య జులియా మోరీ ఈ పోటీలకు సారథ్యం వహిస్తున్నారు. స్వీడన్‌కు చెందిన మోడల్... కికి హకాన్సన్ 1951లో తొలి ప్రపంచ సుందరిగా ఎంపిక అయింది. మొదట్లో ఈ పోటీల పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఈ విమర్శలు ఈ అందాల పోటీల ఆదరణను ఏ మాత్రం తగ్గించలేకపోయాయి. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో మన దేశంలో కూడా ఈ పోటీల పట్ల పెరిగింది. 2000 సంవత్సరం తర్వాత ఈ పోటీలను కేవలం శారీరక సౌందర్యానికి మాత్రమే పరిమితం చేయకుండా మహిళలకు సాధికారత కల్పించే ప్రయత్నంగా చూపించటం మొదలుపెట్టారు. ఒక వ్యక్తికి ఉన్న సామాజిక బాధ్యతను గుర్తుచేసే విధంగా... 'బ్యూటీ విత్ పర్పస్' అనే నినాదాన్ని బాగా ప్రచారంలోకి తీసుకువచ్చారు.

ఎలా ఎంపిక చేస్తారు?

ప్రతి ఏటా సుమారు 120 దేశాలలో 'మిస్ వరల్డ్' ప్రాథమిక అందాల పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఫైనల్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. వీరందరూ సుమారు మూడు వారాలు జరిగే వేర్వేరు విభాగాల పోటీలలో పాల్గొనాల్సి ఉంటుంది. బీచ్ ఫ్యాషన్, బ్యూటీ విత్ పర్పస్, మల్టీ మీడియా, స్పోర్ట్స్, టాలెంట్, టాప్ మోడల్, కంటెస్టెంట్స్ ఛాయిస్ లాంటి అనేక విభాగాలు ఉంటాయి. ఈ విభాగాలలో విజేతలుగా నిలిచిన వారిని.. వేర్వేరు ఇంటర్వ్యూలలో గెలిచిన వారిని మిస్ వరల్డ్ ఫైనల్స్ పోటీలకు పంపుతారు. వీరి సంఖ్య ఆ ఏడాది పాల్గొనే వారి సంఖ్య ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ తుది పోటీలలో న్యాయ నిర్ణేతలు తుది విజేతలను ఎంపిక చేస్తారు. తుది విజేతకు మిస్ వరల్డ్ టైటిల్.. సుమారు 10 కోట్ల రూపాయల బహుమతి, వజ్రాల కిరీటంతో పాటు అనేక రకాల బహుమతులు దక్కుతాయి. ఈ బహుమతుల విలువ ప్రతి ఏడాది మారుతూ ఉంటుంది. ప్రపంచ సుందరిగా గెలిచినవారు... ఆ ఏడాది పొడవునా ప్రపంచ సుందరి సంస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ.. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పర్యటిస్తారు. వీరిని అనేక బహుళ జాతి కంపెనీలు.. ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలు తమ బ్రాండ్ అంబాసిడర్‌లుగా నియమించుకుంటాయి. ప్రపంచ సుందరి పోటీలలో గెలిచిన భామకు ఏడాది పాటు మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించే సంస్థ అనేక సౌకర్యాలు కల్పిస్తుంది. వారికి ఉచిత దుస్తులు, విమాన సౌకర్యం, హోటల్స్ సౌకర్యం, ఆభరణాల సౌకర్యం, మేకప్ సౌకర్యం, స్టైలింగ్ సౌకర్యం అందిస్తుంది.

ఆ ఆరుగురు వీరే

మన దేశం నుంచి ఆరుగురు అందగత్తెలు ప్రపంచ సుందరులుగా ఎంపికయ్యారు. వాళ్లెవరంటే...

- రీటా ఫారియా (1966)
- ఐశ్వర్యా రాయ్ (1994)
- డయానా హెడెన్ (1997)
- యుక్తా ముఖి (1999)
- ప్రియాంక చోప్రా (2000)
- మానుషి చిల్లర్ (2017)




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డబ్బా కార్టెల్	హిందీ సిరీస్(తెలుగులో)	ఫిబ్రవరి 28
అమెజాన్ ప్రైమ్		
జిద్దీ గర్ల్స్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 27
హౌస్ ఆఫ్ డేవిడ్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 27
సుషల్	తమిళ సిరీస్	ఫిబ్రవరి 28
సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 28
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
సూట్స్: లాస్ ఏంజెలెస్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 24
బీటిల్‌జ్యూస్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 28
లవ్ అండర్ కన్‌స్ట్రక్షన్	మలయాళ సిరీస్ (తెలుగులో)	ఫిబ్రవరి 28
ది వాస్ప్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 28
ఎంఎక్స్ ప్లేయర్		
ఆశ్రమ్ 3	హిందీ సిరీస్ 2	ఫిబ్రవరి 27

డబ్బాలో డ్రగ్స్



డబ్బా డెలివరీ వ్యాపారం ద్వారా డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించిన ఐదుగురు సాధారణ మహిళల జీవితంలో జరిగిన సంఘటనలు ఇతివృత్తంగా రూపొందిన హిందీ సిరీస్ 'డబ్బా కార్టెల్'. ముంబైలోని కొందరు గృహిణులు ముఠాగా ఏర్పడి డబ్బావాలాల ముసుగులో మత్తు పదార్థాలను సరఫరా చేస్తుంటారు. ఈ విషయం తెలుసుకున్న డ్రగ్స్ మాఫియా ఆ మహిళలను బెదిరించి వారిని డ్రగ్స్ సరఫరాకు ఉపయోగించుకుంటుంది. ఆ క్రమంలో అటు మాఫియా, ఇటు పోలీసులతో ఆ ఐదుగురు మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు, వాటిని ఎలా అధిగమించారు అనే ఇతివృత్తంగా ఈ సిరీస్ సాగుతుంది. ఈ థ్రిల్లర్ సిరీస్‌లో షబానా అజ్మీ, నిమిషా సజయన్, షాలినీ పాండే, అంజలి, జ్యోతిక ప్రధాన పాత్రలు పోషించారు. హితేశ్ భాటియా దర్శకత్వం వహించారు.

'గేమ్ ఛేంజర్' సినిమా విడుదలయిన ఆరు గంటలలోపులోనే ఈ చిత్రం హెచ్‌డీ ప్రింట్‌ను కొందరు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంచారు. ఆ తర్వాత ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, టెలిగ్రామ్, వాట్సప్ లాంటి మాధ్యమాల ద్వారా ఎన్ని లక్షల మంది దీనిని డౌన్‌లోడ్ చేసి ఉంటారో చెప్పటానికి లెక్కలు అందుబాటులో లేవు.. కేవలం 'గేమ్ ఛేంజర్' మాత్రమే కాదు.. ఆ తర్వాత వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం', 'డాకు మహారాజ్', 'తండేల్' లాంటి సినిమాలన్నింటినీ కూడా ఈ పైరసీ భూతం మింగేయటానికి చూసింది. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సినిమాలు తీసే నిర్మాతలు ఆశించేది మొదటి వారం కలెక్షన్లు. వీటిని ఈ పైరసీ భూతం దారుణంగా దెబ్బతీస్తోంది.

పైరసీ భూతముంది జాగ్రత్త!



ఒకప్పుడు ఇంటర్నెట్ అందరికీ అందుబాటులో లేని సమయంలో కొత్త సినిమాలను వీడియో క్యాసెట్ల రూపంలో విడుదల చేసేవారు. వీటికి విపరీతమైన డిమాండ్ ఉండేది. ఆ తర్వాతి కాలంలో సీడీలు వచ్చాయి. వాటికి డిమాండ్ ఉండేది. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత సోషల్ మీడియా ద్వారా పైరసీ సులభమయిపోయింది. ఇంటర్నెట్ ఉంటే చాలు... కొత్త కొత్త సినిమాలను అందించే 'ఐబొమ్మ' లాంటి వెబ్‌సైట్లు ఎన్నో పుట్టుకువచ్చాయి. గతంలో క్యాసెట్లు, సీడీలు ఉన్న సమయంలో... పైరసీ చేయాలంటే వాటిని కాపీలు తీయాల్సి వచ్చేది. దీనికి సమయం పట్టేది. కానీ ఇప్పుడు ఒక్క కాపీని సోషల్ మీడియాలో పెడితే చాలు... నిమిషాల్లో వేల సంఖ్యలో డౌన్‌లోడ్ అయిపోతోంది. ఆ తర్వాత గ్రూపుల ద్వారా లక్షల మందికి చేరిపోతోంది. దీని వల్ల తీవ్రంగా నష్టపోతుంది నిర్మాతలే అనటంలో ఎటువంటి సందేహం లేదు.

చర్యలేవీ?

పైరసీ వల్ల కలిగే సమస్యలను చిత్ర పరిశ్రమ ముందే పసిగట్టింది. అందుకే పైరసీని అరికట్టడానికి... ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ఒక సెల్‌ను ఏర్పాటు చేసింది. థియేటర్లలో విడుదలయ్యే ప్రతి సినిమా నుంచి ఈ సెల్ కొంత ఫీజు వసూలు చేస్తుంది. ఈ ఫీజును ఉపయోగించి సినిమాలు పైరసీ కాకుండా అడ్డుకుంటామనేది సెల్ చెబుతూ ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో పెద్ద పెద్ద చిత్రాలు పైరసీ కావటం వల్ల ఈ సెల్ వల్ల పెద్ద ప్రయోజనం లేదనే విషయం స్పష్టమవుతోంది. "ఈ సెల్ వల్ల ప్రయోజనం ఏమి లేదు. పైరసీని అడ్డుకోవటం అంత సులభం కాదు. ఎందుకంటే ప్రస్తుతం సినిమాలన్నీ డిజిటల్ రూపంలోనే ఉంటున్నాయి. ఫిల్మింగ్, ఎడిటింగ్ నుంచి ఫైనల్ కాపీ వరకు ఎక్కడైనా లీక్ కావచ్చు. అంతేకాదు. ప్రస్తుతం సినిమాలు 'క్యూబ్' లాంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా డిజిటల్ రూపంలో థియేటర్లకు చేరుతున్నాయి. అక్కడ కూడా లీక్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకు నాకు తెలిసి హెచ్‌డీ కాపీ తొలి



రోజున ఎప్పుడూ లీక్ కాలేదు. 'గేమ్ ఛేంజర్' విషయంలోనే ఇది జరిగింది. దీనిపై సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని.. కేసు ఒక కొలిక్కి వచ్చిందని వార్తలు వచ్చాయి. ఒకవేళ ఎవరు దాన్ని లీక్ చేశారో తెలిసినా వారిపై కేసు పెట్టి నేరం నిరూపించటం అంత సులభం కాదు. అందువల్లే పోలీసులు కూడా ఏం చేయలేకపోతున్నారు..." అని పేరు చెప్పటానికి ఇష్టం లేని ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

- పైరసీ కాపీలు ఎక్కువగా వాట్సప్, టెలిగ్రామ్‌ల ద్వారా వ్యాప్తి చెందుతున్నాయి. చట్టరీత్యా పైరసీ సినిమాలను గ్రూపుల్లో పెట్టినా నేరమే! అందువల్ల గ్రూప్ అడ్మిన్‌లు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే చట్టరీత్యా ఇబ్బంది పడే అవకాశముంది.
- సాధారణంగా పైరసీ కాపీలు అందుబాటులో ఉండే సైట్లను విదేశాల నుంచి హోస్ట్ చేస్తున్నారు. అందువల్ల వీటిని తొలగించటం అంత సులభం కాదు.
- కొత్త సినిమాటోగ్రఫీ చట్టం కింద... సినిమాలను అనధికారికంగా రికార్డు చేసినా, అనుమతి లేకుండా బహిరంగంగా ప్రదర్శించినా, ఆన్‌లైన్‌లో, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినా... మూడు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

పరిష్కారం లేదా?

ఒక పెద్ద సినిమా విడుదలయిన వెంటనే దాని కాపీని ఏదో ఒక విధంగా సంపాదించి




ఆన్‌లైన్‌లో పెట్టడానికి అనేక మంది ప్రయత్నిస్తూ ఉంటారు. ఇలా ఒక వెబ్‌సైట్‌లోనో, ట్విట్టర్ అకౌంట్‌లోనో పెట్టిన వెంటనే ఆ అకౌంట్స్‌ను డిలీట్ చేయించటానికి నిర్మాతలు కొన్ని ప్రైవేట్ సంస్థల సహకారం తీసుకుంటున్నారు. ఈ సంస్థలు... ఆ వెబ్‌సైట్ల హోస్ట్‌లతో మాట్లాడి... వాటిని తొలగిస్తున్నాయి. అయితే పోలీసుల పరంగా వెంటనే చర్యలు తీసుకోలేక పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పైరసీ సమస్యను గుర్తించింది. పైరసీని అరికట్టే చర్యల్లో భాగంగా... కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్లను నియమించింది. ముంబయిలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఏదైనా సినిమా పైరసీకి గురయిందని ఫిర్యాదు చేస్తే- 48 గంటల్లో ఆ కంటెంట్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. అయితే దీని వల్ల పెద్ద ప్రయోజనం లేదని, చట్టాల్లో మార్పులు రావాలని అంటున్నారు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్. "పైరసీపై ఫిర్యాదు అందిన తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఫైలింగ్ ప్రాసెస్‌లో వెళితే మూడు నాలుగు రోజులు పడుతుంది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. పైరసీ విషయంలో పౌర సమాజం స్పందించాలి. దానికి అడ్డుకట్టవేయాలి" అంటారాయన. పెద్ద పెద్ద సినిమాలకు భారీగా నష్టం చేకూరుస్తున్న పైరసీని అరికట్టాలంటే... పౌర సమాజంలో కూడా అవగాహన పెరగాలి. దీనికి సినీ పరిశ్రమే కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించుకొని అమలు చేయాలి. అప్పుడే 'పైరసీ' అనే విలన్ ఓడిపోయి కథ సుఖాంతం అవుతుంది. లేకపోతే ఇబ్బందులు తప్పవు.

ద్రాక్షపండ్లను ఇలా తినాలి...

బజారు నుంచి ద్రాక్షపండ్లు తెచ్చాక వాటిని సరైన పద్ధతిలో కడిగిన తరవాతనే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటిపై ఉండే పురుగుమందుల అవశేషాల వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

- ముందుగా ద్రాక్షపండ్లను గుత్తినుంచి వేరు చేయాలి. మెత్తగా ఉండి చెడిపోయినవాటిని, సగానికి కోసుకుపోయినవాటిని ఏరివేయాలి.
- వెడల్పాటి గిన్నెలో సగానికిపైగా గోరువెచ్చని నీళ్లు పోయాలి. ఇందులో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా పసుపు, ఒక చెంచా వంటసోడా వేసి బాగా కలపాలి. తరవాత ద్రాక్షపండ్లు వేసి మెల్లగా రుద్దుతూ కడగాలి. రెండు నిమిషాలు అలాగే ఉంచాలి.



తరవాత ఈ నీళ్లు తీసివేసి మంచినీళ్లు పోసి మరోసారి కడగాలి. పలుచని గుడ్డమీద ద్రాక్షపండ్లు వేసి తడి ఆరనివ్వాలి. తరవాత ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుకోవచ్చు.

- పెద్ద గిన్నెలో సగం వరకు నీళ్లు పోసి మూడు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఇందులో ద్రాక్షపండ్లు వేసి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత వీటిని మంచినీళ్లతో మరోసారి కడిగి ఆరబెట్టాలి.
- ఇలా శుభ్రం చేసిన తరవాతనే ద్రాక్షపండ్లను పిల్లలకు, పెద్దలకు తినిపించాలి.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
హైదరాబాద్ ● ఆదివారం 23 ఫిబ్రవరి 2025









ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో వస్తున్నా



- సందీప్ కిషన్

'నా గత చిత్రాల్లో వరుసగా సీరియస్ పాత్రలు చేశాను. ఈసారి వాటికి భిన్నంగా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఉండాలని 'మజాకా' చిత్రం చేశాను. ఇలాంటి కాన్సెప్ట్‌తో ఇప్పటివరకూ మరో చిత్రం రాలేదు' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. ఆయన హీరోగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన చిత్రమిది. రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో మాట్లాడారు.

- గతంలో 'బీరువా, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' లాంటి కొన్ని హాస్య చిత్రాల్లో నటించాను. కానీ వాటిలో పూర్తి స్థాయి కామెడీ పాత్ర చేయలేదు. 'మజాకా'లో ఆద్యంతం వినోదాన్ని పంచేలా నా పాత్ర ఉంటుంది. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు, ఫన్, ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్నాయి. 'మజాకా' క్లీన్ కామెడీ ఎంటర్‌టైనర్. నా కెరీర్‌లో ఇదే తొలి పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్.
- బంధువులు, స్నేహితులతో సంబంధం లేకుండా బతికే తండ్రీ కొడుకుల జీవితంలో జరిగిన సంఘటనల ఇతివృత్తంగా కథ సాగుతుంది. ఈ సినిమాలో అన్షు గారిని తీసుకోవాలనే ఆలోచన త్రినాథరావు గారిదే. అంత అందగత్తెను రావు రమేశ్ ప్రేమించే క్రమంలో పుట్టే వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఒక సన్నివేశాన్ని ఎలా తీస్తే పండుతుందో త్రినాథరావుకు తెలుసు. అందుకే ఆయన వరుస హిట్లు కొడుతున్నాడు.
- విజయ్‌గారబ్బాయి సంజయ్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. న్యూ ఏజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. సంజయ్ బాగా కష్టపడుతున్నాడు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ కోసం ఒక వెబ్‌సిరీస్ చేస్తున్నాను. త్వరలో 'ఫ్యామిలీ మాన్ 3' రాబోతోంది.

ఆగస్టులో 'మిరాయి'



తేజ సజ్జా హీరోగా కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న చిత్రం 'మిరాయి'. రితిక నాయక్ హీరోయిన్‌గా, మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్నారు. కాగా, ఈ చిత్రాన్ని తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, మరాఠీ భాషల్లో ఈ ఏడాది ఆగస్టు 1న 2డి, 3డి ఫార్మెట్‌లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం



- తమన్నా

'మహా కుంభమేళాలాంటి గొప్ప ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొనే అవకాశం అరుదుగా వస్తుంది. 'ఓదెల 2' లాంటి సినిమా చేయడం కూడా నాకు అరుదైన అవకాశమే. ఈ సినిమా నా సినీ కెరీర్‌లో చాలా ప్రత్యేకం' అన్నారు కథానాయిక తమన్నా. అశోక్‌తేజ్ దర్శకత్వంలో డి. మధు నిర్మించిన చిత్రమిది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ కీలకపాత్రలు పోషించారు. తమన్నా నాగా సాధువు పాత్రలో కనిపించనున్నారు. చిత్రబృందం శనివారం మహా కుంభమేళాలో టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సంపత్ నంది మాట్లాడుతూ 'ఓదెల 2' లాంటి సినిమాలు అరుదుగా వస్తాయి. కథను, కంటెంట్‌నూ నమ్మి చేస్తున్న సినిమా ఇదని తెలిపారు. 'ఓదెల రైల్వే స్టేషన్, ఓదెల 2' చిత్రాల్లో అవకాశం ఇచ్చిన సంపత్‌నందికి రుణపడి ఉంటానని అశోక్‌తేజ్ చెప్పారు. 'సంపత్‌నంది పర్యవేక్షణలో సినిమా అద్భుతంగా తెరకెక్కింది, ప్రేక్షకులు థియేటర్లలో చూసి ఆదరించాలి' అని డి. మధు కోరారు.

రావణుడొచ్చాడు!



రావణుడు వచ్చేశాడు.. శ్రీరామునిపై యుద్ధం ప్రారంభించాడు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' చిత్రంలో కన్నడ హీరో యశ్ రావణుడి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. తన తాజా చిత్రం 'టాక్సిక్' కోసం ప్రస్తుతం ముంబైలోనే ఉన్న యశ్ ఇప్పుడు 'రామాయణ' మీద దృష్టి పెట్టారు. శుక్రవారం ముంబైలోని అక్సా బీచ్‌లో కీలకమైన యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించారు. అందులో యశ్ పాల్గొన్నారు. విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉన్న సన్నివేశాలను చిత్రీకరించినట్లు యూనిట్ సభ్యులు చెప్పారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా 'రామాయణ' చిత్రం తయారవుతోంది. తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి విడుదలవుతుంది.

ప్రతి శనివారం ఇక సినీ వారం



సర్వ కళల సమాహారం సినిమా.. తెరపై తమ పేరు చూసుకోవాలనుకునే కళాకారుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చుకోవాలంటే ఎక్కడో సాయం అందాలి.. సినీ రంగం వైపు అడుగులు వేస్తున్న ఔత్సాహికుల కళాత్మకతను, సృజనాత్మకతను గుర్తించే వారుండాలి. ఈ ప్రయత్నంలో ఉన్న వారికి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మంచి అవకాశం కల్పిస్తోంది. రవీంద్రభారతిలోని థియేటర్‌కు పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ గా నామకరణం చేసి యువతరం తీసిన షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలను ఈ వేదికపై ప్రదర్శింపజేస్తున్నారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు మామిడి హరికృష్ణ నేతృత్వంలో 2016లో సినివారం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'ప్రతి శనివారం సినివారం' పేరిట ప్రారంభమైన ఈ వేదికపై వందలాది లఘు చిత్రాలను ప్రదర్శించారు. తెలుగు సినిమా రంగానికి చెందిన దిగ్గజ దర్శకులను ఆహ్వానించి ఈ వేదికపై చర్చాగోష్టి నిర్వహించారు. ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల, వంశీ పైడిపల్లి, హరీష్ శంకర్, ఎన్.శంకర్, నర్సింగరావు, తరుణ్ భాస్కర్, వేణు ఊడుగుల, ప్రవీణ్ సత్తారు, శ్రీనాథ్, సందీప్ రెడ్డి వంగా, సంకల్ప్ రెడ్డి, వీ.ఎన్.ఆదిత్య, బాహుబలి రచయిత విజయేంద్రప్రసాద్ వంటి ప్రముఖులతో ఔత్సాహిక కళాకారులతో ఇంటరాక్షన్ నిర్వహించారు. ఈ ప్రయాణంలో భాగంగా సినివారం ఇప్పుడు 3వ వెర్షన్‌ను పునః ప్రారంభించింది.

సినివారం టు సినిమా దర్శకులుగా..

సినివారం వేదికగా తమ షార్ట్ ఫిల్మ్‌లను ప్రదర్శించిన వారు పెద్ద సినిమాలతో దర్శకులుగా తెలుగు చిత్రసీమకు పరిచయం అయ్యారు. ఇప్పటివరకూ 15మంది దర్శకులు సినీ ఇండస్ట్రీకి పరిచయం కావడం విశేషం. వీరి ఫోటోలు పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ హాల్‌లో ఏర్పాటు చేశారు. తరుణ్‌భాస్కర్ (పెళ్ళిచూపులు), కేవీఆర్ మహేంద్ర(దొరసాని), సాహిత్ మోత్కూర్ (సవారి), ఉదయ్ గుర్రాల (మెయిల్), బడుగు విజయ్‌కుమార్ (తమసోమ జ్యోతిర్గమయా), వేణు ముల్కల (విశ్వక్), సంపత్ కుమార్ (సూరాపానం), గంగాధర్ అద్వైత (సురభి 70ఎంఎం), సూర్య తేజ(ఫోకస్), ధ్రువ (కిరోసిన్), జాన్ జక్కి (2020గోల్‌మాల్), అక్షరకుమార్ (షరతులు వర్తిస్తాయి), నవీన్ కుమార్ గట్టు (శరపంజరం) వంటి వారు తెలుగు సినిమా రంగానికి దర్శకులుగా పరిచయమయ్యారు.

సినివారం కోసం సంప్రదించండిలా..

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సినివారం పేరిట రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో లఘు చిత్రాలను ప్రదర్శిస్తారు. దీని కోసం రవీంద్రభారతి ప్రాంగణంలోని భాషా సాంస్కృతిక కార్యాలయంలో సంప్రదించవచ్చు. తమ సినిమా వివరాలతో అక్కడ నమోదు చేసుకోవాలి. లఘు చిత్రాల సంఖ్యను బట్టి ప్రతి శనివారం ఒకటి లేదా రెండు సినిమాలు ప్రదర్శిస్తారు. అక్కడికి రెగ్యులర్‌గా వచ్చే ప్రేక్షకులతో పాటు సినిమాకు సంబంధించిన ప్రేక్షకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కార్యాలయంలో నమోదు చేయడం కుదరని వారు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

రవీంద్రభారతి (ఆంధ్రజ్యోతి)

సినిమా కలను సినివారంతో సాకారం చేసుకోండి

సినిమాలు, కళల ద్వారా మన సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించే ప్రతిభావంతుల కోసం సినివారం తలుపులు తెరిచి ఉంటాయి. మీ చలన చిత్రాలకు వేదికనందించి మీ సృజనాత్మకతను ప్రపంచానికి పరిచయం చేస్తాం. ప్రస్తుతం తెలంగాణ నేపథ్యమున్న కథలు, సినిమాలు...కళాకారులు, టెక్నీషియన్‌లు విజయాలు సొంతం చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రతిభ లక్ష్యంగా 2016లో సినివారం ప్రారంభించాం ఈ ఎనిమిదేళ్లలో వందల లఘు చిత్రాలను తెరపై ప్రదర్శించడంతో పాటు సినీ రంగ నిపుణులతో నేరుగా పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాం

మామిడి హరికృష్ణ, సాంస్కృతిక శాఖ సంచాలకుడు

ఇన్ ప్రోగ్రెస్

ప్రతి మహిళా చూడాల్సిన చిత్రం



నటి ఆమని లీడ్ రోల్ పోషించిన చిత్రం 'నారి'. దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. శనివారం నిర్మాత దిల్‌రాజు 'నారి' ట్రైలర్‌ను ఆవిష్కరించి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఆమని మాట్లాడుతూ 'ప్రతి మహిళా చూడాల్సిన చిత్రమిది. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, అన్యాయాలను దర్శకుడు ఆకట్టుకునేలా తెరకెక్కించారు' అని కోరారు.

కామెడీ థ్రిల్లర్



త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా నటించిన కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. మార్చి 7న విడుదలవుతోంది. 'ప్రముఖ హాస్య నటులంతా మా చిత్రంలో ముఖ్య పాత్రలు పోషించారు' అని యూనిట్ తెలిపింది.

రెడ్డి మామా.. బరాబర్ ప్రేమిస్తా



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'బరాబర్ ప్రేమిస్తా' చిత్రంలోని 'రెడ్డి మామా' అంటూ సాగే మాస్ సాంగ్‌ను నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు. సురేశ్ గంగుల రాసిన ఈ పాటను నకాష్ అజీజ్, సాహితి చాగంటి పాడారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్. సంపత్ రుద్ర దర్శకత్వంలో గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మిస్తున్నారు.

అందెల రవమిది అలరిస్తుంది



ఇంద్రాణి దవులూరి ప్రధాన పాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'అందెల రవమిది'. చిత్రబృందం శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్‌శంకర్ 'అందెల రవమిది' టీజర్‌ను విడుదల చేశారు. మన సంప్రదాయ నృత్య కళలను బతికించుకోవాలనీ, వాటి గురించి ప్రపంచానికి చాటి చెప్పాలనేదే తన ప్రయత్నమని ఇంద్రాణి తెలిపారు.

బంగారీ.. బంగారీ



శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మేన్షన్ హౌస్ మల్లేష్'. రాజేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా హీరో అడివి శేష్ 'బంగారీ.. బంగారీ' పాటను విడుదల చేశారు. రామజోగయ్య సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందించారు. హరిణి ఇవటూరి అద్భుతంగా ఆలపించారు.

పాక్ గడ్డపై 'జనగణమన'!

- ఆసీస్-ఇంగ్లండ్ మ్యాచ్‌లో భారత జాతీయ గీతం
- ఐసీసీ వివరణ ఇవ్వాలంటూ పాక్ క్రికెట్ బోర్డు డిమాండ్

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో శనివారం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరిగిన మ్యాచ్‌కు ముందు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు డీజే చేసిన చిన్న పొరపాటు వల్ల ఆస్ట్రేలియా జాతీయ గీతానికి బదులు భారత జాతీయ గీతం వినబడింది. తొలుత ఇంగ్లండ్ జాతీయ గీతాలాపన పూర్తయ్యాక.. ఆసీస్ ఆటగాళ్లు తమ గీతం కోసం సిద్ధమవగా, మైకులో నుంచి భారత జాతీయ గీతం మొదలైంది. దీంతో ఆటగాళ్లతోపాటు స్టేడియంలోని వారంతా విస్తుపోయారు. వెంటనే తేరుకున్న డీజే దానిని ఆపేసి, ఆస్ట్రేలియా జాతీయ గీతాన్ని పెట్టాడు. అయితే ఈ ఘటన ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్రంగా స్పందించింది. ఈ ఉదంతంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. కాగా, ఈ టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్నప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా భారత జట్టు ఆ దేశానికి వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో భారత్ మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.



లెక్క తేల్చాల్సిందే!

సెమీస్‌పై భారత్ గురి
పాక్‌కు చావోరేవో
చాంపియన్స్ ట్రోఫీ

హైఓల్టేజ్ సమరం నేడు



పాక్ కెప్టెన్ రిజ్వాన్

మధ్యాహ్నం 2.30 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

దుబాయ్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో హైఓల్టేజి సమరానికి సర్వం సిద్ధమైంది. అంతర్జాతీయ క్రికెట్‌లో చిరకాల శత్రువులుగా పేరు తెచ్చుకున్న భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం కీలక మ్యాచ్ జరుగనుంది. గ్రూప్ 'ఎ'లో ఇరు జట్లకిది రెండో మ్యాచ్. ఇప్పటికే టిక్కెట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడుపోవడంతో స్టేడియం కిక్కిరిసిపోనుంది. అయితే టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్ ఈ మ్యాచ్ ఆడేందుకు స్వదేశం నుంచి దుబాయ్‌కి రావాల్సి వచ్చింది. భద్రతా కారణాలరీత్యా టీమిండియా తమ పొరుగు దేశంలో పర్యటించేందుకు ఇష్టపడకపోగా, హైబ్రిడ్ పద్ధతిన టోర్నీని నిర్వహిస్తున్నారు. మరోవైపు బంగ్లాపై విజయంతో రోహిత్ సేన ఆత్మవిశ్వాసంతో ఉంది. భారత్‌కు మరో విజయం లభిస్తే దాదాపు సెమీస్ చేరినట్టే. అటు పాక్‌కు ఆరంభ మ్యాచ్‌లో కివీస్ చేతిలో భంగపాటు ఎదురైంది. అందుకే భారత్‌తో జరిగే ఈ మ్యాచ్ వారికి అత్యంత కీలకం కాబోతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ నేటి పోరులో రిజ్వాన్ సేన గెలవాల్సిందే. లేకుంటే దాదాపు మూడు దశాబ్దాల తర్వాత సొంత గడ్డపై జరుగుతున్న ఐసీసీ టోర్నీ నుంచి గ్రూప్ దశలోనే నిష్క్రమించాల్సి ఉంటుంది. కానీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో పాక్ మూడింట్లో గెలవడం విశేషం. 2017లో జరిగిన ఫైనల్లోనూ భారత్‌ను పాక్ 180 రన్స్ తేడాతో చిత్తుగా ఓడించి తొలి టైటిల్‌ను దక్కించుకుంది. ఈసారి భారత్ గెలిచి 3-3తో లెక్కను సమం చేయాలనుకుంటోంది.

చాంపియన్స్ ట్రోఫీలో ఎన్ని జట్లు పాల్గొన్నా.. ఇప్పటికి ఎన్ని మ్యాచ్‌లు జరిగినా.. అందరి దృష్టీ ఆ ఒక్క పోరుపైనే. క్రికెట్ ప్రేమికులంతా ఎప్పుడెప్పుడా అంటూ ఆతృతగా ఎదురు చూసిన తరుణమిది. గతంలో ఎన్నిసార్లు తలపడినా బరిలోకి దిగిన ప్రతీసారి అదే ఉద్వేగం.. అదే ఉత్సాహం. భావోద్వేగాలు పతాక స్థాయిలో ఉండే అసలు సిసలైన పోరు. అందుకే కచ్చితంగా గెలిచి తీరాలనే కసి అటు ఆటగాళ్లలోనే కాదు, అభిమానుల నరనరాల్లోనూ ప్రవహిస్తుంటుంది. ఇదంతా భారత్-పాకిస్థాన్ పోరు గురించే! ఐసీసీ, ఆసియాకప్ టోర్నీల్లో మాత్రమే కనిపించే ఈ దాయాది జట్లు ఆదివారం తమ సత్తా ఎంతో తేల్చుకోనున్నాయి. అలాగే 2017 టోర్నీ ఫైనల్లో ఎదురైన పరాభవానికి లెక్క సరిచేయాలనుకుంటున్న టీమిండియా ఈ గెలుపుతో సెమీస్‌పైనా కన్నేసింది. అటు పాక్‌కు మాత్రం ఈ మ్యాచ్ చావో రేవో లాంటిది. ఓడితే ఆ జట్టు ఇంటికే కాబట్టి ఒత్తిడంతా వారిపైనే.

పాక్‌పైనే ఒత్తిడి

కివీస్ చేతిలో ఓటమితో పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరిగింది. పైగా చిరకాల శత్రువు భారత్‌తో మ్యాచ్ కావడం, గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవంగా ఉండే పరిస్థితి నెలకొనడంతో వీరి ప్రదర్శనపై ఆసక్తి ఏర్పడింది. అలాగే తొలి మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఆటతీరు విమర్శలపాలైంది. 320 పరుగుల ఛేదనలో అతడు 90 బంతుల్లో 64 పరుగులే చేయడంతో ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు భారత్‌పై ఆడిన 8 మ్యాచ్‌ల్లో బాబర్ 218 పరుగులే చేయగలిగాడు. ఇక టీమిండియాపై చెలరేగే ఓపెనర్ ఫఖర్ జమాన్ టోర్నీకి దూరం కావడం పెద్ద లోటే. తన స్థానంలో ఇమామ్ ఉల్ హక్‌ను తీసుకున్నారు. బ్యాటింగ్‌లో రిజ్వాన్, సల్మాన్ ఆఘా, సాద్ షకీల్ కీలకం. బౌలింగ్‌లో పేసర్లు షహీన్ షా, నసీమ్ షా, రౌఫ్ ఆరంభంలో భారత్‌ను కట్టడి చేయాలనుకుంటున్నారు. స్పిన్‌లో అబ్రార్ అహ్మద్ ఆకట్టుకుంటున్నాడు.

విరాట్ ఆడేనా?



పాక్‌తో పోలిస్తే భారత్ అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా కనిపిస్తోంది. ఓపెనర్ గిల్ భీకర ఫామ్ కొనసాగిస్తున్నాడు. పరిస్థితులకు తగ్గట్టు సంయమనంతో ఆడుతున్నాడు. అటు కెప్టెన్ రోహిత్ ఎటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచుతున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మాత్రం బ్యాట్ ఝుళిపించాల్సి ఉంది. కానీ శనివారం ప్రాక్టీస్ సెషన్ ముగిశాక తను ఎడమ కాలిపై ఐస్ ప్యాక్ పెట్టుకుని సేద తీరడం ఫ్యాన్స్‌ను ఆందోళనపరుస్తోంది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తొలి మ్యాచ్ కూడా తను మోకాలి గాయంతో దూరం కావాల్సి వచ్చింది. అయితే విరాట్ విషయమై బోర్డు నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. ఒకవేళ తను అందుబాటులో లేకపోతే వన్‌డౌన్‌లో రిజర్వ్ ప్లేయర్ కూడా లేడు. ఇక మిడిలార్డర్‌లో శ్రేయాస్, రాహుల్, అక్షర్, హార్దిక్ చెలరేగితే భారీ స్కోరు ఖాయమే. బౌలింగ్‌లో షమి అదరగొడుతుండడం సానుకూలాంశం కానుంది. బంగ్లాపై ఐదు వికెట్లతో రాణించిన తను జోష్‌లో ఉన్నాడు. అలాగే పాక్‌పై అతడి ఎకానమీ 3.82గా ఉండడం విశేషం. షమికి మరో ఎండ్‌లో హర్షిత్ నుంచి మద్దతు లభిస్తోంది. స్పిన్ త్రయం జడేజా, కుల్దీప్, అక్షర్ నేటి మ్యాచ్‌లోనూ కీలకం కానున్నారు. విరాట్ గాయంపై స్పష్టత లేకపోవడంతో దాదాపుగా జట్టులో మార్పు ఉండకపోవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, హార్దిక్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, హర్షిత్, షమి, కుల్దీప్.

పాకిస్థాన్: ఇమామ్ ఉల్ హక్, బాబర్, సాద్ షకీల్, రిజ్వాన్ (కెప్టెన్), సల్మాన్ ఆఘా, తయ్యాబ్ తహీర్, ఖుష్దిల్ షా, షహీన్ షా, నసీమ్ షా, హరీస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్.

పిచ్

బంగ్లాతో జరిగిన పిచ్ మందకొడిగా మారడంతో పరుగుల వేటలో భారత్ కాస్త ఇబ్బందిపడింది. అయితే, ఇక్కడ మంచు ప్రభావం కూడా లేకపోవడంతో టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకోవచ్చు.

స్పిన్‌పై కోహ్లీ చూపు

పాక్‌తో పోరుకు ముందు విరాట్ కోహ్లీ స్పిన్ బంతులను ఎదుర్కోవడంపై దృష్టి సారించాడు. టెస్టుల్లో ఆఫ్‌స్టంప్‌నకు ఆవలి బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడిన కోహ్లీ ఈ మధ్య వన్డేల్లో స్పిన్‌ను సరిగా ఆడలేకపోతున్నాడు. వరుసగా ఆరు వన్డేల్లో స్పిన్నర్లకే దొరికిపోయాడు. అందుకే ఈ మ్యాచ్‌లో పాక్ లెగ్ స్పిన్నర్ అబ్రార్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు, నెట్స్‌లో స్పిన్‌ను ఎక్కువగా ఆడాడు. లెగ్ బ్రేక్, ఆఫ్ స్పిన్, లెఫ్టామ్ స్పిన్నర్లతో బౌలింగ్ చేయించుకున్నాడు.

352.. ఆసీస్ రికార్డు ఛేదన

ఊదేశారు



జోష్ ఇంగ్లిస్ (86 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 120 నాటౌట్)

ఇంగ్లిస్ సుడిగాలి శతకం

- 5 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు
- డకెట్ పోరాటం వృథా

లాహోర్: జోష్ ఇంగ్లిస్ (86 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 120 నాటౌట్) శతకంతో విజృంభించడంతో ఐసీసీ వన్డే ఈవెంట్లలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన ఆస్ట్రేలియా.. చాంపియన్స్ ట్రోఫీలో అదిరే బోణీ చేసింది. గ్రూప్-బిలో శనివారం పరుగుల వరద పారిన మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టోర్నీ చరిత్రలోనే ఇంగ్లండ్ అత్యధికంగా 352 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశిస్తే.. కంగారూలు మరో 15 బంతులు మిగిలుండగానే గెలవడం విశేషం. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 351 పరుగులు చేసింది. బెన్ డకెట్ (143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌లతో 165), రూట్ (68) పోరాటాలు వృథా అయ్యాయి. డ్వార్షుయిస్ 3.. జంపా, లబుషేన్ చెరో 2 వికెట్లు తీశారు.

ఆదుకొన్న షార్ట్, లబుషేన్: భారీ ఛేదనలో ఆస్ట్రేలియా 47.3 ఓవర్లలో 356/5 స్కోరు చేసి గెలిచింది. రషీద్, లివింగ్‌స్టోన్, ఆర్చర్, ఉడ్ తలో వికెట్ దక్కించుకొన్నారు. హెడ్ (6), కెప్టెన్ స్మిత్ (5) స్వల్పస్కోర్లకే అవుటైనా..మరో ఓపెనర్ షార్ట్ (63), లబుషేన్ (47) మూడో వికెట్‌కు 95 పరుగులతో ఆదుకొన్నారు. అయితే, లబుషేన్‌ను రషీద్ అవుట్ చేసి.. ప్రమాదకరంగా మారిన ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. షార్ట్‌ను లివింగ్‌స్టోన్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపడంతో ఆసీస్ శిబిరంలో గుబులు రేగింది. కానీ, ఇంగ్లిస్, క్యారీ (69) ఐదో వికెట్‌కు 146 పరుగులు జోడించి జట్టులో ఆశలు రేపారు. 38వ ఓవర్‌లో రషీద్ బౌలింగ్‌లో ఆర్చర్ క్యాచ్‌ను చేజార్చడంతో బతికిపోయిన క్యారీ అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. అయితే, గెలుపునకు మరో 70 పరుగులు కావాల్సిన సమయంలో 42వ ఓవర్‌లో క్యారీని కార్స్ అవుట్ చేశాడు. కానీ, మ్యాక్స్‌వెల్ (32 నాటౌట్)తో కలసి ఆరో వికెట్‌కు అజేయంగా 36 బంతుల్లో 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఇంగ్లిస్.. సిక్స్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు.

చాంపియన్స్ ట్రోఫీలో భారీ లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ఆస్ట్రేలియా. మ్యాచ్‌లో తొలుత ఇంగ్లండ్ 351/8తో ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక స్కోరు రికార్డు నెలకొల్పింది. అయితే, ఛేదనలో ఆసీస్ 356/5తో ఆ రికార్డును బద్దలుకొట్టింది. 2004లో అమెరికాపై న్యూజిలాండ్ 347/4 రికార్డు స్కోరు చేసింది.

1

టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా డకెట్ (165). 2004లో నాథన్ ఆస్టల్ (145 నాటౌట్), 2002లో ఆండీ ఫ్లవర్ (145)ను డకెట్ వెనక్కునెట్టాడు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 50 ఓవర్లలో 351/8 (డకెట్ 165, జో రూట్ 68; డ్వార్షుయిస్ 3/66, ఆడమ్ జంపా 2/64).

ఆస్ట్రేలియా: 47.3 ఓవర్లలో 356/5 (ఇంగ్లిస్ 120 నాటౌట్, అలెక్స్ క్యారీ 69; రషీద్ ఖాన్ 1/47, లివింగ్‌స్టోన్ 1/47).

యూపీ బోణీ

- హెన్రీ సునామీ ఇన్నింగ్స్
- హ్యారిస్ హ్యాట్రిక్
- ఢిల్లీ పరాజయం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ అద్భుత బోణీ చేసింది. షినెల్లీ హెన్రీ (23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో 62) సునామీ ఇన్నింగ్స్‌కు, స్పిన్నర్ గ్రేస్ హ్యారిస్ (4/15) హ్యాట్రిక్ తోడవడంతో 33 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి టోర్నీలో తొలి విజయం నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 177/9 స్కోరు చేసింది. తాలియా మెక్‌గ్రాత్ (24) మోస్తరుగా ఆడింది. అనంతరం ఢిల్లీ 19.3 ఓవర్లలో 144 రన్స్‌కు ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (56) అర్ధ శతకంతో పోరాడింది. పేసర్ క్రాంతి గౌడ్ 4 వికెట్లు పడగొట్టింది. షినెల్లీ హెన్రీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

షినెల్లీ రికార్డ్: సిక్సర్లతో విరుచుకుపడిన యూపీ బ్యాటర్ షినెల్లీ హెన్రీ డబ్ల్యూపీఎల్‌లో వేగవంతమైన అర్ధ సెంచరీ చేసిన బ్యాటర్ రికార్డును సమం చేసింది. 18 బంతుల్లో ఆమె ఈ ఫీట్ అందుకుంది. 2023లో బెంగళూరుపై గుజరాత్ బ్యాటర్ సోఫియా డంక్లీ కూడా 18 బంతుల్లోనే అర్ధ శతకం పూరించింది. కాగా..డబ్ల్యూపీఎల్‌లో మూడో హ్యాట్రిక్ సాధించిన బౌలర్‌గా హ్యారిస్ నిలిచింది.

సంక్షిప్తస్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 177/9 (షినెల్లీ హెన్రీ 62, తాలియా మెక్‌గ్రాత్ 24, జొనాసెన్ 4/31, అరుంధతి 2/52).**ఢిల్లీ:** 19.3 ఓవర్లలో 144 ఆలౌట్ (జెమీమా 56, షఫాలీ 24, గ్రేస్ హ్యారిస్ 4/15, క్రాంతి గౌడ్ 4/25).

ఒక్కపూటే భోజనం



షమి

దుబాయ్: ఫిట్‌నెస్‌ను కాపాడుకునేందుకు తాను ఎన్నో ఏళ్లుగా ఒక్కపూటే భోజనం చేస్తున్నానని 34 ఏళ్ల భారత ఏస్ పేసర్ మహ్మద్ షమి వెల్లడించాడు. '2015 నుంచి నేను రోజూ ఒక పూటే భోజనం చేస్తున్నా. అది కూడా రాత్రి పూటే. బ్రేక్ ఫాస్ట్, లంచ్ మానేశా. అలా చేయడం చాలా కష్టమే. కానీ ఒకసారి దానికి అలవాటు పడితే ఇబ్బందేమీ ఉండదు' అని షమి వివరించాడు. 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో ఫైనల్ సందర్భంగా షమి పాదానికి గాయమైంది. దానికి శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. ఫలితంగా అతడు 14 నెలలు ఆటకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో షమి బరువు 90 కేజీలకు చేరింది. 'బెంగళూరు జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాసంలో ఉన్నప్పుడు తొమ్మిది కిలోల బరువు తగ్గా. అది చాలా క్లిష్టమైన దశ. స్వీట్లు..తదితర పదార్థాలకు దూరంగా ఉన్నా. నాకిష్టమైన బిర్యానీని మాత్రం అప్పుడప్పుడు తినేవాడిని' అని షమి వివరించాడు.

రిత్విక్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కాపెల్లె అంతర్జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. శనివారం ఫ్రాన్స్‌లో జరిగిన టోర్నీలో ఆరో సీడ్ రిత్విక్ 9 రౌండ్లలో 7 పాయింట్లు సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. బోయర్ మహేల్ (ఫ్రాన్స్) స్వర్ణం, ఇనియన్ పన్నీర్ సెల్వం (చెన్నై) రజతం దక్కించుకున్నారు.

ప్రపంచ అథ్లెటిక్స్‌కు గుల్వీర్ అర్హత



న్యూఢిల్లీ: దేశీయ స్టార్ అథ్లెట్ గుల్వీర్ సింగ్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన ఇండోర్ ఈవెంట్ ఐదు వేల మీటర్ల రేసులో గుల్వీర్ 12 నిమిషాల 59.77 సెకన్లలో రేసును పూర్తి చేసి నాలుగో స్థానంలో నిలిచాడు. 5000 మీ., రేసును 13 నిమిషాల లోపు పూర్తి చేసిన తొలి భారత అథ్లెట్ గుల్వీరే. ఈ ప్రదర్శనతో తన పేరిట ఉన్న జాతీయ, ఆసియా రికార్డు (13 ని., 11.82 సెకన్లు)లను తానే తిరగరాసుకున్నాడు.

దేశాన్నే కాదు.. గేమ్‌ను కూడా తీసుకెళ్లలేరు

ట్రంప్‌నకు కెనడా ప్రధాని చురకలు

బోస్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్ తమ పొరుగు దేశమైన కెనడాతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. కెనడాను త్వరలోనే అమెరికాకు 51వ రాష్ట్రంగా కలుపుకొంటానంటూ ట్రంప్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా బోస్టన్‌లో జరిగిన ఐస్ హాకీ టోర్నీ నాలుగు దేశాల ఫేస్ ఆఫ్ ఫైనల్లో అమెరికాను 3-2తో ఓడించి కెనడా విజేతగా నిలవడంతో ఆ దేశ ప్రధాని ట్రూడో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. అంతేకాదు.. 'మా దేశాన్ని తీసుకెళ్లలేరు.. అలాగే మా గేమ్‌ను కూడా తీసుకెళ్లలేరు' అని ట్రంప్‌కు చురకలంటిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు ట్రంప్ తమ జట్టును ఉద్దేశిస్తూ 'మన 51వ రాష్ట్రంగా మారే కెనడాపై గ్రేట్ అమెరికా విజయం సాధిస్తుందని విశ్వసిస్తున్నా' అని పోస్ట్ చేశారు.

అమెరికా టాప్ కమాండర్ బ్రౌన్‌కు ఉద్వాసన

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అమెరికా మిలిటరీ టాప్ కమాండర్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ చీక్యూ బ్రౌన్ జూనియర్‌ను అధ్యక్షుడు ట్రంప్ ఆ పదవినుంచి తొలగించారు. బ్రౌన్ స్థానంలో ఎయిర్ ఫోర్స్ రిటైర్డు లెఫ్టినెంట్ జనరల్ డాన్ రజిన్ కైనేను నియమిస్తున్నట్టు ప్రకటించారు. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్‌కు నాయకత్వం వహించిన నల్లజాతి జనరల్లలో బ్రౌన్ రెండోవారు. ఆయన పదహారు నెలలు ఈ పదవిలో ఉన్నారు. నల్లజాతికి చెందిన జార్జి ఫ్లాయిడ్‌ను శ్వేత జాతి పోలీస్ అధికారి హత్యచేసిన ఘటనకు నిరసనగా అప్పట్లో జరిగిన 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్' ఉద్యమానికి బ్రౌన్ మద్దతు పలికారు. ఇదిలా ఉండగా, అమెరికా ఎఫ్‌బీఐ 9వ డైరెక్టర్‌గా భారతీయ అమెరికన్ కశ్యప్ పటేల్.. భగవద్గీతపై ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు.

ట్రంప్,మస్క్ మరణశిక్షకు అర్హులు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరణశిక్షకు అర్హులని మస్క్‌కు చెందిన కృత్రిమమేధ 'ఎక్స్ఏఐ' తాజాగా సమాధానాలు ఇచ్చింది. వారు చేసిన పనులకు గాను వారికి మరణశిక్ష విధించాలని పేర్కొంది. 'అమెరికాలో ప్రస్తుతం సజీవంగా ఉన్న వారిలో, వారు చేసిన పనులకుగాను ఎవరిని మరణశిక్షకు అర్హులని భావిస్తున్నావు?' అని ఎక్స్‌ఏఐ చాట్ బోట్ 'గ్రోక్'ను పలు విధాలుగా ప్రశ్నించగా, అది ఈ మేరకు సమాధానాలిచ్చింది.

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణకు కఠిన నిబంధనలు!

» పరిశీలిస్తున్న కేంద్ర సమాచార ప్రసార శాఖ



రణ్‌వీర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: యూట్యూబ్‌లో రణ్‌వీర్ అలహాబాదియా షో వివాదాస్పదమైన నేపథ్యంలో డిజిటల్ వేదికలపై హానికరమైన కంటెంట్ నియంత్రణకు కొత్త లీగల్ ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు ఆన్‌లైన్ కంటెంట్‌పై నిఘాను తీవ్రతరం చేయనున్నట్టు సంకేతాలిచ్చింది. అందుకోసం చట్టంలో ప్రస్తుతం ఉన్న నిబంధనలను కేంద్ర సమాచార, ప్రసార మాధ్యమాల మంత్రిత్వశాఖ పరిశీలిస్తోంది. బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే చైర్మన్‌గా ఉన్న పార్లమెంటరీ కమిటీ రాసిన లేఖకు ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మాధ్యమాల మంత్రిత్వశాఖ సమాధానమిచ్చింది. 'డిజిటల్ వేదికలపై అసభ్యకరమైన, హింసాత్మక కంటెంట్‌ను ప్రదర్శించడానికి భావ వ్యక్తీకరణ అనే రాజ్యాంగ హక్కును దుర్వినియోగం చేస్తుండటంపై సమాజంలో ఆందోళన పెరుగుతోంది. దీని నియంత్రణకు ప్రస్తుత చట్టాల్లో నిర్దిష్టమైన నిబంధనలు ఉన్నాయి. హానికరమైన కంటెంట్‌ను నియంత్రించేందుకు మరింత కఠినమైన, సమర్థవంతమైన లీగల్ ఫ్రేమ్‌వర్క్ కోసం డిమాండ్ పెరుగుతోంది. తాజా పరిణామాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం ఉన్న చట్ట నిబంధనలను పరిశీలిస్తున్నాం' అని ఆ సమాధానంలో మంత్రిత్వశాఖ పేర్కొంది. కాగా, రణవీర్ అలహాబాదియాపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించడానికి ఏమైనా చర్యలు తీసుకునే యోచనలో ఉన్నారా? అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అలహాబాదియా వ్యాఖ్యలపై పార్టీలకు అతీతంగా ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పార్లమెంటరీ కమిటీ కూడా ఈనెల 13న కేంద్ర సమాచార ప్రసారమాధ్యమాల శాఖకు లేఖ రాసింది. నూతన సాంకేతికత అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మీడియా వేదికల్లో వచ్చే వివాదాస్పద కంటెంట్‌ను నియంత్రించేందుకు ప్రస్తుతం ఉన్న చట్టాలకు సవరణలు చేయాల్సిన అవసరం ఉందని లేఖలో సూచించింది.

మద్యం అమ్మకాల వల్లే కేజ్రీవాల్ ఓడిపోయారు

» సామాజిక కార్యకర్త అన్నా హజారే

ముంబై, ఫిబ్రవరి 22: ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ బాగానే పనిచేశాడని అయితే మద్యం అమ్మకాల కారణంగా ప్రజలు గుణపాఠం నేర్పారని సామాజిక కార్యకర్త అన్నా హజారే చెప్పారు. వాస్తవానికి కేజ్రీవాల్ సమాజానికి ఒక ఆదర్శంగా నిలుస్తాడని భావించినా అలా జరగలేదన్నారు. కేజ్రీవాల్ మద్యం లైసెన్సులు, అమ్మకాలతో తాను నిరాశ చెందానని హజారే తెలిపారు. ఢిల్లీకి మహిళా సీఎం రావడాన్ని ఆయన స్వాగతించారు. రేఖా గుప్త పనులు, ఆలోచనల వల్లే సీఎం కాగలిగారని హజారే ప్రశంసించారు. 2012లో అవినీతి వ్యతిరేక ఉద్యమంలో హజారేతో పాటు కేజ్రీవాల్ కూడా పాల్గొన్నారు. అనంతరం హజారే అభీష్టానికి భిన్నంగా కేజ్రీవాల్ ఆప్‌ను స్థాపించారు.

విషమంగా పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉంది. తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన రోమ్‌లోని గెమెల్లీ ఆస్పత్రిలో ఎనిమిది రోజులుగా చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఆయనకు ఆక్సిజన్ అందిస్తున్నారు. ఫ్రాన్సిస్ వయస్సు 88ఏళ్లు. ఈ నెల 14న ఆయన బ్రాంకైటిస్‌తో ఆస్పత్రిలో చేరారు. తర్వాత అది న్యూమోనియా, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్‌కు దారితీసింది. పోప్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆయన నెమ్మదిగా కోలుకుం టున్నారని, అయితే, పూర్తిగా ప్రమాదం నుంచి బయటపడలేదని చెప్పారు.

మహా కుంభమేళా @ 60 కోట్లు!

» ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల పోటు .. 26నాటికి ఈ సంఖ్య 65కోట్లు దాటే అవకాశం

మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 22: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమం వద్ద మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసిన భక్తుల సంఖ్య 60 కోట్లు దాటిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించింది. దేశంలో సనాతన ధర్మం పాటించే 110 కోట్ల మందిలో సగం మందికి పైగా (55%) స్నానాలు చేశారని తెలిపింది. జనవరి 13న ప్రారంభమైన కుంభమేళా మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26తో కొనసాగనుంది. 26న జరిగే చివరి అమృత్ స్నానాల నాటికి ఈ సంఖ్య 65కోట్లు దాటుతుందని అంచనా వేస్తున్నట్లు యూపీ ప్రభుత్వం వివరించింది. ఒక్క నేపాల్ నుంచే 50 లక్షల మందికి పైగా వచ్చి నదిలో స్నానం చేశారని పేర్కొంది. ఇదిలాఉండగా, మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు చేస్తున్న మహిళా భక్తుల వీడియోలను పోస్టు చేసిన వివిధ సోషల్ మీడియా ఖాతాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళల ఫొటోలు, వీడియోల ప్రచురణపై అలహాబాద్ హైకోర్టు 2019లో నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో యూపీ పోలీసులకు చెందిన సాంకేతిక నిపుణుల బృందం ఇటువంటి ఖాతాలపై 24 గంటలూ నిఘా పెట్టి, కేసులు నమోదు చేస్తోంది. కొత్వాలి పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే 17 ఖాతాలపై 3 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇలాంటి వీడియోలు విక్రయిస్తున్న ముగ్గురిని అహ్మదాబాద్ క్రైం బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, మహా కుంభమేళాలో స్నానాలు చేయాలని భావించే ఖైదీల కోసం యూపీ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 75 జైళ్లలో ఉన్న దాదాపు 90 వేల మందికి పైగా ఖైదీలకు సంగమ జలాలతో స్నానం చేసే అవకాశం కల్పించింది. లఖ్‌నవూ, అయోధ్య, అలీగఢ్‌లో ఉన్న జైళ్లకు త్రివేణీ సంగమం నుంచి పవిత్ర జలాలను అధికారులు తీసుకొచ్చి జైళ్లలోని ట్యాంకర్లలో కలిపారు. అనంతరం ఖైదీలంతా అక్కడే పవిత్ర స్నానాలు ఆచరించారు.



త్రివేణి సంగమంలో యోగి, జేపీ నడ్డా స్నానం

పంజాబ్‌లో లేని శాఖకు మంత్రిగారు!



చండీగఢ్, ఫిబ్రవరి 22: పంజాబ్‌లో ఉనికిలో లేని ఓ శాఖకు ఓ మంత్రి బాధ్యతలు నిర్వహించారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం 20 నెలలు తరువాత గుర్తించింది. దానిని సవరించేందుకు ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో ఆ విషయం వెల్లడయింది. పంజాబ్‌లో 2022, మార్చిలో భగవంత్ మాన్ నేతృత్వంలో ఏర్పడిన ఆప్ ప్రభుత్వం... మే, 2023లో మంత్రి వర్గ పునర్‌వ్యవస్థీకరణ చేసింది. ఆ క్రమంలో అప్పటి వరకూ వ్యవసాయం, రైతు సంక్షేమం శాఖలను నిర్వహించిన కుల్‌దీప్ సింగ్ ధలివాల్‌కు ఎన్ఆర్ఐ వ్యవహారాలు, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలను అప్పగించింది. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ ప్రభుత్వంలో లేదు. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు తనకు కేటాయించిన శాఖకు కార్యదర్శి లేకపోవడంతో ధలివాల్ ప్రభుత్వాన్ని వివరణ కూడా కోరినట్లు తెలిసింది. అయితే తాజాగా ఫిబ్రవరి 7న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గెజిట్ విడుదల చేశారు. దీనిపై బీజేపీ విమర్శలకు దిగింది. 'పంజాబ్‌లో పాలనను ఆప్ జోక్‌గా మార్చింది. ఉనికిలో లేని శాఖకు 20 నెలలుగా ఆ మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. ఈ విషయం సీఎంకు కూడా తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో ఆలోచించుకోండి' అని ఎద్దేవా చేసింది.

ముక్కులో వేలెట్టి రుద్దాడని 145 ఏళ్ల నాటి డెస్క్‌నే మార్చేశారు!



వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అది అమెరికా వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులోని 145 ఏళ్లనాటి 'రెసొల్యూట్ డెస్క్'! ఉడ్రో విల్సన్, ట్రుమన్, జాన్ ఎఫ్ కెన్నడీ, రీగన్, క్లింటన్, ఒబామా.. ఇలా ఎంతో మంది అధ్యక్షులు ఎన్నో ముఖ్యమైన ఫైళ్ల పెట్టుకొని సంతకాలు చేసిన డెస్క్ అది! మొన్నటిదాకా అధ్యక్షుడిగా పనిచేసిన బైడెన్, రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ట్రంప్ కూడా నిన్నటిదాకా ఈ డెస్క్‌నే ఉపయోగించారు. అయితే ఎలాన్ మస్క్ నాలుగేళ్ల కుమారుడి తెలిసీ తెలియని చేష్టలు దశాబ్దాల చరిత్ర గల ఈ డెస్క్‌ను పక్కనబెట్టేలా చేశాయి. ఇటీవల ఓవల్ ఆఫీసులో తన కుమారుడితో కలిసి ట్రంప్‌తో మస్క్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మస్క్ భుజానెక్కుతూ.. ఆఫీసులో కలియతిరుగుతూ ఆ చిన్నారి చేసిన అల్లరి అంతా ఇంతా కాదు. ఈ క్రమంలో ఆ చిన్నారి.. ముక్కులో వేలు పెట్టుకొని ఆ వేలును ట్రంప్ ఎదురుగా ఉన్న 'రెసల్యూట్ డెస్క్'కు రుద్దడం వంటి పనులు చేశారు. అతి పరిశుభ్రత పాటించే ట్రంప్ ఆ చిన్నారి చేష్ట కారణంగా రెసొల్యూట్ డెస్క్‌ను ఆఫీసు నుంచి తాత్కాలికంగా తొలగించాలని ఆదేశించారు. దాని స్థానంలో 'సీ అండ్ ఓ' డెస్క్‌ను పెట్టించారు. సీఅండ్ఓ డెస్క్‌ను జార్జ్ బుష్ తదితర అధ్యక్షులు ఉపయోగించారు అని ట్రంప్ పేర్కొన్నారు. 1880లో బ్రిటన్ రాణి క్వీన్ విక్టోరియా ఈ రెసొల్యూట్ డెస్క్‌ను నాటి అధ్యక్షుడు రుథర్‌ఫోర్డ్‌కు బహుమతిగా ఇచ్చారు.

కేంద్ర మంత్రికి విమానంలో విరిగిన సీటు



భోపాల్/ముంబై, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విమానయాన సంస్థ ఎయిరిండియాపై కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ మండిపడ్డారు. తాను ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన సమయంలో తనకు విరిగిన, కిందకు దిగిపోయిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనైతికమని, ప్రయాణికుల నుంచి పూర్తి చార్జీ వసూలు చేసే సంస్థ.. వారికి విరిగిపోయిన సీట్లు కేటాయించడం మోసగించడమేనంటూ తనకు ఎదురైన అనుభవాన్ని శనివారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. తన సీటే కాకుండా విమానంలోని మరి కొన్ని సీట్లు కూడా ఇదేవిధంగా ఉన్నాయని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీటులో కూర్చోమని ఆఫర్ చేశారని, అయితే వారికి ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశంతో తాను ఆ విరిగిన సీటులోనే ప్రయాణం చేశానని తెలిపారు. దీనిపై ఎయిరిండియా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని డీజీసీఏ ఎయిరిండియా విమాన సంస్థను ఆదేశించింది.

వాహనం రిజిస్ట్రరై 20 ఏళ్లు దాటితే.. ఏడాదికి బైక్‌కు రూ.2 వేలు.. కారుకు రూ.10వేలు

» రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చార్జీల పెంపునకు కేంద్రం ప్రతిపాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల వయసు దాటిన వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ) రెన్యూవల్ చార్జీలను పెంచాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే ముసాయిదాను విడుదల చేసింది. ముసాయిదాకు ఆమోదముద్ర పడితే.. ద్విచక్రవాహనాల రెన్యూవల్‌కు ఏడాదికి రూ.2వేలు, కార్లకు రూ.10 వేల మేర చార్జీల మోత మోగనుంది. అంటే.. వాహనం వయసు 20 ఏళ్లు దాటితే.. గతంలో మాదిరిగా ఐదేళ్లకు రెన్యూవల్ అవకాశం ఉండదు. ఏటా వాహనాన్ని రవాణాశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి, ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గితేనే రెన్యూవల్ చేస్తారు. వీటితోపాటు.. ఆటోరిక్షాలు, ఇతర వాహనాల రెన్యూవల్ చార్జీలు కూడా దాదాపు రెండింతలు పెరగనున్నాయి. ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన బైక్‌కు ఐదేళ్ల రెన్యూవల్‌కు రూ.2 వేలు, 20 ఏళ్లు దాటితే ఐదేళ్లకు రూ.5వేలుగా చార్జీలున్నాయి. 15 ఏళ్లు దాటిన కార్లకు ఐదేళ్ల రెన్యూవల్‌కు రూ.5 వేలు, 20 ఏళ్లు దాటితే రూ.10వేలుగా ఉంది.

మైనరే.. కానీ,ఆమెకు పర్యవసానాలు తెలుసు

» పోక్సో కేసు నిందితుడికి బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు

ముంబై, ఫిబ్రవరి 22: మైనర్లపై అత్యాచారాలను నిరోధించడానికి ఉద్దేశించిన పోక్సో చట్టం కింద అరెస్టయిన 24 ఏళ్ల యువకుడికి బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బాధితురాలు మైనర్ బాలికే అయినప్పటికీ పరస్పరం ఇష్టంతో స్వచ్ఛందంగా ఆయనతో గడిపిందని, అందువల్ల బెయిల్ మంజూరు చేయవచ్చని తెలిపింది. ఆ యువకుడిపై 2019లో పోక్సో కేసు నమోదయింది. ఆ సమయంలో బాలిక వయసు 14 ఏళ్లు కాగా, నిందితుడి వయసు 19 ఏళ్లు. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించడంతో స్వచ్ఛందంగా ఆయనతో మూడు రాత్రుళ్లు, పగళ్లు గడిపింది. ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని, నిందితుడు అయిదేళ్లపాటు జైలులో ఉన్న విషయాన్ని గుర్తించి బెయిల్ ఇస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ మిళింద్ తెలిపారు. ఆ బాలిక మైనరే అయినప్పటికీ, తాను చేస్తున్నదేమిటన్నదానిపై ఆమెకు పూర్తి పరిజ్ఞానం ఉందని, ఈ విషయాన్ని ఆమెనే స్వచ్ఛందంగా అంగీకరించిందని చెప్పారు. ఆమె తండ్రికి కూడా వారి విషయం తెలుసని పేర్కొన్నారు.

రెండో పెళ్లి చేసుకోలేదని కేసు పెట్టే హక్కు వివాహితకు లేదు

వేరే వ్యక్తి తనను రెండో పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరక సంబంధాన్ని పెట్టుకొని మోసగించాడని ఫిర్యాదు చేసే హక్కు వివాహితకు ఉండదని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇది తప్పుడు వాగ్దానం కిందకు రాదని తెలిపింది. డ్రైవర్ భార్య అయిన ఓ మహిళకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహమైన మరో వ్యక్తి.. ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శారీరక సంబంధం పెట్టుకొంది. అయితే, కొంతకాలం తరువాత తాను భార్యకు విడాకులు ఇవ్వలేని అతడు తేల్చి చెప్పేశాడు. దీంతో, ఆమె హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన న్యాయమూర్తి.. వివాహిత ఇలాంటి ఫిర్యాదులు చేయలేదంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

మళ్లీ ఒక ఏడాది బీఈడీ, ఎంఈడీ!

2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు.. ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యత ఎన్టీఏకు

» జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ప్రతిపాదనలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బీఈడీ, ఎంఈడీ కోర్సులు తిరిగి 'ఒక ఏడాది' ఫార్మాట్‌కు తీసుకెళ్లాలని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) యోచిస్తోంది. ఈ మేరకు 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రెండు ప్రోగ్రామ్‌ల కాల వ్యవధిని ఏడాదికి తగ్గించాలని ప్రతిపాదించింది. దీంతో ఈ కోర్సుల కాల వ్యవధిని రెండేళ్లకు పొడిగించిన దశాబ్దం తర్వాత ఈ పరిణామం చోటుచేసుకోనుంది. ఎన్‌సీటీఈ వెబ్‌సైట్‌లో ఉంచిన ముసాయిదా పాలసీపై మార్చి 8 వరకు ప్రజల అభిప్రాయాలు తీసుకోనుంది. పాలసీ ఆమోదం తర్వాత.. స్వతంత్ర ఉపాధ్యాయ విద్యా సంస్థలు (టీఈఐ) కొత్త ముసాయిదా నిబంధనల్లో పేర్కొన్న షరతులకు అనుగుణంగా ఉంటే, రెండేళ్ల బీఈడీ, ఎంఈడీ కోర్సులను అందించడం కొనసాగించవచ్చు. లేదా ఒక ఏడాది ఫార్మాట్‌లో మారేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. అన్ని బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రామాణిక సబ్జెక్ట్, ఆప్టిట్యూట్ పరీక్ష నిర్వహించనుందని హిందుస్థాన్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఎన్టీఏ ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర కేంద్ర, రాష్ట్ర యూనివర్సిటీల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ల (ఐటీఈపీ) అడ్మిషన్ల కోసం జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) నిర్వహిస్తోంది. ఎన్టీఏ నిర్వహించనున్న కొత్త ఐటీఈపీ కోర్సుల పరీక్షకు సంబంధించిన విధివిధానాలు వచ్చే ఏడాది రూపొందించబడతాయని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి చైర్‌పర్సన్ పంకజ్ అరోరా పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఐటీఈపీ యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, సంస్కృత విద్య, కళా విద్య అనే 4 ప్రత్యేక కోర్సులను తీసుకురానున్నట్లు ఎన్‌సీటీఈ తన ముసాయిదా నిబంధనలు-2025లో పేర్కొంది. కొత్త కోర్సులతో పాటు కనీస అవసరమైన సదుపాయాలు, అధ్యాపకులు వంటి అంశాలను కూడా ఎన్‌సీటీఈ నిర్దేశించింది. ముసాయిదా నిబంధనల ప్రకారం.. కనీసం 50 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా ప్రత్యేక సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులతో నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) కలిగిన అభ్యర్థి ఒక సంవత్సర బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రెండేళ్ల ఎంఈడీ ప్రోగ్రామ్ అందించబడుతుందని ముసాయిదా పేర్కొంది. జాతీయ విద్యా విధానం సిఫారసుల మేరకు కొత్త నిబంధనలు రూపొందించినట్లు అరోరా తెలిపారు.

10వేల కోట్లిచ్చినా జాతీయ విద్యావిధానాన్ని ఒప్పుకోం

» తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం అమలుకు అంగీకరిస్తేనే రూ.2వేల కోట్ల నిధులను విడుదల చేస్తామని కేంద్రప్రభుత్వం చెబుతోందని, కానీ, 10వేల కోట్లిచ్చినా ఆ విద్యావిధానాన్ని తమ రాష్ట్రంలో అమలుపరిచే ప్రసక్తేలేదని తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించారు. శనివారం కడలూరు జిల్లాలో 'తల్లిదండ్రులను గౌరవిద్దాం' అనే పేరుతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్ జాతీయ విద్యావిధానంపై తీవ్రస్థాయిలో విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్రంలో సమగ్ర శిక్షా అభియాన్ పథకం అమలుకు చెల్లించాల్సిన రూ.2152 కోట్ల నిధులను అకారణంగా నిలిపేశారని, తద్వారా ఆ పథకంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు లేకుండా చేశారని కేంద్రాన్ని దుయ్యబట్టారు. జాతీయ విద్యావిధానం సామాజిక న్యాయానికి వ్యతిరేకమైనదన్నారు. తాము ఏ భాషకూ వ్యతిరేకం కాదన్నారు. రాష్ట్రంలో హిందీభాషను నేర్చుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవన్న ఆయన, ఆ భాషను నిర్బంధంగా అమలు చేయాలన్న ఆలోచననే దశాబ్దాల తరబడి వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.



కడలూరులో విద్యార్థినులతో స్టాలిన్

ప్రధాని ముఖ్య కార్యదర్శిగా శక్తికాంత దాస్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాని మోదీ ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. తమిళనాడు క్యాడర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్ 2018 డిసెంబరు నుంచి ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు. తన 42 ఏళ్ల సర్వీసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కరోనా సమయంలో దేశ ఆర్థికాభివృద్ధి కొనసాగేందుకు ఆర్బీఐ గవర్నర్‌గా పలు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీకే మిశ్రా (గుజరాత్ క్యాడర్) ప్రధాని ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. శక్తికాంత దాస్ రెండో ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతారని క్యాబినెట్ నియామకాల కమిటీ శనివారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. కాగా, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించారు.

నా ఫ్రెండ్ మోదీకి యూఎస్ఎయిడ్

» ఎక్స్‌లో పోస్టు చేసిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ఎయిడ్) రూ.182 కోట్లు(21 మిలియన్ డాలర్లు) ఇవ్వడంపై రాజకీయ రచ్చ జరుగుతుండగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి ఏకంగా ప్రధాని మోదీ పేరును ప్రస్తావించారు. "నా మిత్రుడు, భారత ప్రధాని నరేంద్ర మోదీకి 21 మిలియన్ డాలర్లు వెళ్తున్నాయి. మేము భారత్‌లో ఓటింగ్ శాతం పెరగడానికి ఈ మొత్తం ఇస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ నిధులు వచ్చాయని బీజేపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకొంది. భారత ఎన్నికల్లో జోక్యానికి బైడెన్ హయాంలో ఈ ఫండ్ ఇచ్చారని ట్రంప్ నాలుగు రోజుల క్రితం ప్రకటించారు.



అప్పులేని వాడు ఉత్తముడంటారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఇది అందరికీ వర్తించదు. ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియదు. అలాంటప్పుడు అందరి దగ్గరా సరిపడా డబ్బులు ఉండకపోవచ్చు. అప్పుడు ఎంతో కొంత అప్పు చేయక తప్పదు. అయితే ఈ అప్పు వ్యక్తిగత రుణమా? లేక తాకట్టు రుణమా? అనేది పెద్ద ప్రశ్న.

వ్యక్తిగత రుణమా? తాకట్టు రుణమా? ఏది బెటర్!

ఒక్కోసారి కొన్ని ఆర్థిక అవసరాలు ఆకస్మికంగా వచ్చిపడుతుంటాయి. అప్పుడు ఏ హామీ లేకుండా వ్యక్తిగత రుణం తీసుకోవాలా? లేక ఆస్తులు హామీగా పెట్టి తాకట్టు రుణం తీసుకోవాలా? అనే సందేహాలు వస్తుంటాయి. ఎందుకంటే ఈ రెండింటిలో దేనిలో ఉండే లాభనష్టాలు దానిలో ఉన్నాయి. ఈ రుణాల స్వరూప, స్వభావాలు తెలుసుకుంటే.. ఎప్పుడు ఏ రుణం తీసుకోవాలో తేలికగా నిర్ణయించుకోవచ్చు. ఇప్పుడు ఒక్కో రుణంలో ఉండే లాభనష్టాలు తెలుసుకుందాం.

వ్యక్తిగత రుణాలు

ఈ రుణాల కోసం ఎలాంటి ఆస్తులను హామీగా చూపించాల్సిన అవసరం లేదు. గతంలో తీసుకున్న రుణాల్ని చక్కగా చెల్లించిన చరిత్ర, మంచి పరపతి (సిబిల్) స్కోరు ఉంటే చాలు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. అయినా రుణదాతలు ఈ రుణాలను కొద్దిగా రిస్కీ రుణాలుగా చూస్తారు. అందుకే విగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేట్లు కొద్దిగా ఎక్కువ.

ప్రధానాంశాలు: ఇవి పూర్తిగా హామీ లేని రుణాలు. ఈ రుణాల కోసం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఎలాంటి ఆస్తులను హామీగా చూపాల్సిన అవసరంగానీ, తాకట్టు పెట్టాల్సిన అవసరం గానీ లేదు. కాబట్టి ఈ రుణాలు చెల్లించలేకపోయినా ఆస్తులు పోగొట్టుకుంటామనే భయం ఉండదు.

త్వరగా ఆమోదం: వ్యక్తిత రుణాల దరఖాస్తు ప్రక్రియ చాలా సులభం. కొన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలైతే మీ ఆధార్, పాన్ కార్డు ఇస్తే చాలు. వీలైనంత త్వరగా రుణాలు మంజూరు చేసి, ఖాతాదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాయి.

వెసులుబాటు: వ్యక్తిగత రుణాలను మన అవసరాలను బట్టి ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. ఫలానా అవసరం కోసం మాత్రమే మేము ఇచ్చిన ఈ రుణాలు వాడుకోవాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఆంక్షలు పెట్టవు.

గమనించాల్సిన విషయాలు..

అధిక వడ్డీ రేటు: వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఎలాంటి షూరిటీలు అడగవు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన చరిత్ర, మంచి పరపతి స్కోరు ఉంటే చాలు. అయినా ఈ రుణాలను నష్ట భయం (రిస్క్) ఉన్న రుణాలుగానే పరిగణిస్తారు. దీంతో మిగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వ్యక్తిగత రుణాలపై ఆయా వ్యక్తుల పరపతి చరిత్ర, పరపతి స్కోరు ఆధారంగా 11 నుంచి 17 శాతం వరకు వడ్డీ రేటు వసూలు చేస్తున్నాయి.

రుణ పరిమితి: సెక్యూర్డ్ లోన్లతో పోలిస్తే హామీ లేని రుణాలను బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కొద్ది మొత్తంలోనే ఇస్తుంటాయి. అది కూడా ఆయా వ్యక్తుల ఆదాయం, పరపతి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది.

పరపతి స్కోరు: పరపతి స్కోరు, రుణాల తిరిగి చెల్లింపు చరిత్ర ఎంత బాగుంటే అంత సులభమైన షరతులతో వ్యక్తిగత రుణాలు లభిస్తాయి. ఈ రెంటిలో ఏ మాత్రం తేడా కనిపించినా 'సారీ, మీకు రుణం ఇవ్వడం మా వల్ల కాదు' అని ముఖానే చెప్పేస్తాయి. లేదంటే స్కోరు ఒక మాదిరిగా ఉన్నా అధిక వడ్డీ వసూలు చేస్తాయి.



తాకట్టు రుణాలు

ఏదో ఒక ఆస్తిని తాకట్టు లేదా హామీగా చూపితే గానీ ఈ రుణాలు పొందలేం. సాధారణంగా ఈ రుణాల కోసం ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేదా ఇతర స్థిరాస్తులను హామీగా చూపించాలి. కొత్త ఆస్తుల కొనుగోలు లేదా తాకట్టులో ఉన్న ఆస్తులను విడిపించుకునేందుకు ఈ తరహా రుణాలు ఉపయోగపడతాయి.

హామీతో కూడిన రుణాలు: ఈ రుణాల చెల్లింపునకు పూర్తి హామీ ఉంటుంది. చెల్లింపుల్లో ఏ మాత్రం విఫలమైనా బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ హామీగా పెట్టిన ఆస్తులను వేలం వేసి తమకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టుకుంటుంది. దీంతో మిగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేటు తక్కువ.

ఎక్కువ రుణం: రుణ చెల్లింపునకు ఏదో ఒక ఆస్తిని హామీగా పెడుతున్నాం కాబట్టి, ఎక్కువ మొత్తంలోనే రుణం తీసుకోవచ్చు. హామీగా పెట్టే ఆస్తి విలువ ఎంత ఎక్కువ ఉంటే, బ్యాంకులు ఇచ్చే తాకట్టు రుణ మొత్తమూ అంత ఎక్కువగా ఉంటుంది.

చెల్లింపు కాలపరిమితి: వ్యక్తిగత రుణాలతో పోలిస్తే, తాకట్టు రుణాల చెల్లింపు కాలపరిమితి ఎక్కువ. దీంతో ఈఎంఐల చెల్లింపు భారం తక్కువగానే ఉంటుంది.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు..

హామీ: ఏదైనా ఆస్తిని హామీగా చూపితేగానీ తాకట్టు రుణాలు లభించవు. వీటి చెల్లింపుల్లో ఏ మాత్రం విఫలమైనా హామీగా చూపిన ఆస్తిపై ఆశలు వదులుకోవాల్సిందే.

ఎక్కువ సమయం: తాకట్టు రుణాల మంజూరుకు చాలా సమయం పడుతుంది. హామీగా చూపే ఆస్తి విలువ మదింపు దగ్గరి నుంచి ఆ ఆస్తి పత్రాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించుకుని గానీ రుణాలకు ఓకే చెప్పవు. దీంతో వ్యక్తిగత రుణాలతో పోలిస్తే తాకట్టు రుణాల మంజూరుకు చాలా రోజులు పడతాయి.

డాక్యుమెంటేషన్: తాకట్టు రుణాల డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఎక్కువ. హామీగా చూపే ఆస్తితో పాటు రుణ గ్రహీత ఆర్థిక పరిస్థితికి సంబంధించి కొన్ని పత్రాలను సిద్ధం చేయాల్సి ఉంటుంది.

ఏది బెటర్ చాయిస్?

రుణ అవసరం: ఏదైనా ఆస్తి కొనుగోలుకైతే తాకట్టు రుణం మంచి చాయిస్. ఏదైనా వ్యక్తిగత ఖర్చు లేదా అత్యవసర ఖర్చుల కోసమైతే వ్యక్తిగత రుణాలను ఆశ్రయించడం మంచిది.

రుణ మొత్తం.. చెల్లించే సామర్థ్యం: రుణ అవసరం ఎక్కువగా ఉండి, ఆ రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం ఉంటే తాకట్టు రుణం తీసుకోవడం మంచిది. రుణ అవసరం కొద్ది మొత్తంలో ఉంటే వ్యక్తిగత రుణాలకు వెళ్లడం మంచి చాయిస్.

వడ్డీ రేటు: హామీ పెట్టడానికి అవసరమైన స్థిరాస్తులు ఉండి, తక్కువ వడ్డీ రేటుకు రుణం కావాలంటే తాకట్టు రుణాలు మంచి చాయిస్. ఆస్తుల హామీ లేకుండా వడ్డీ రేటు ఎక్కువైనా పర్వాలేదనుకుంటే వ్యక్తిగత రుణాలకు వెళ్లడం మంచిది.

రుణ అవసరం, వడ్డీ రేటు, పరపతి స్కోరు, పరపతి చరిత్ర ఆధారంగా ఎవరికి వారు తాకట్టు రుణం కావాలా? వ్యక్తిగత రుణం కావాలా? అనే విషయం ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. అయితే తాకట్టు రుణాల చెల్లింపుల్లో ఏ మాత్రం విఫలమైనా హామీగా పెట్టిన ఆస్తులు పోతాయనే విషయం మర్చిపోకూడదు.

స్పాన్సర్‌షిప్ సర్వీస్‌లకు జీఎస్‌టీ ఎవరు చెల్లించాలి?

సురభి ఈవెంట్స్ అనే సంస్థ ప్రతి సంవత్సరం సినీ రంగానికి సంబంధించి వివిధ విభాగాల కింద అవార్డులు ఇస్తుంది. ఇందులో హీరో, హీరోయిన్‌లు మాత్రమే కాకుండా వివిధ రంగాలకు చెందిన సాంకేతిక నిపుణులు కూడా ఉంటారు. సినీ ప్రముఖులు ఉండటంతో ఈ కార్యక్రమానికి విశేష ఆదరణ ఉంటుంది. ఈ కార్యక్రమానికి జనం ఎక్కువగా హాజరు కావటంతో పాటుగా టీవీలలో ఎక్కువ మంది చూస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేయటానికి కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయి. తద్వారా తమ ఉత్పత్తులకు మంచి ప్రమోషన్, బ్రాండింగ్ లభిస్తుంది కాబట్టి. ఇందులో భాగంగా ఆయా కంపెనీలకు సంబంధించిన బ్యానర్స్‌ను లోగోలను కార్యక్రమంలో ప్రదర్శించటం జరుగుతుంది. దీనికి సంబంధించి ఆయా సంస్థలు కొంత మొత్తాన్ని సురభి ఈవెంట్స్‌కు చెల్లించటం జరుగుతుంది. ఈ వెంట్ ఆధారంగా చేసుకుని తమ బ్రాండ్ లేదా కంపెనీని ప్రమోట్ చేసుకునే అవకాశం సదరు సంస్థలకు సురభి ఈవెంట్స్ కల్పిస్తుంది. దీనినే స్పాన్సర్‌షిప్ సర్వీస్ అంటారు. మరి ఈ స్పాన్సర్‌షిప్ సర్వీస్‌లకు సంబంధించి తీసుకున్న మొత్తం మీద పన్ను ఎవరు చెల్లించాలి?

స్పాన్సర్‌షిప్‌లను జీఎస్‌టీలో రివర్స్ చార్జ్ మెకానిజం కిందకు తీసుకువచ్చారు? అంటే, ఈ సర్వీస్ అందుకున్న వారు 'బాడీ కార్పొరేట్' లేదా 'పార్ట్‌నర్‌షిప్' విభాగంలోకి వచ్చేటట్లయితే, చెల్లించిన మొత్తం మీద పన్ను వారే చెల్లించాలి. అంటే ఇక్కడ సురభి ఈవెంట్స్‌కు స్పాన్సర్‌షిప్ ద్వారా పొందిన మొత్తం మీద పన్నుకు సంబంధించి ఎలాంటి బాధ్యత ఉండదు. అయితే, దీనికి సంబంధించి ఈ ఏడాది జనవరిలో ఒక సవరణ చేయటం జరిగింది.

దీని ప్రకారం ఈవెంట్స్ నిర్వాహకులు.. బాడీ కార్పొరేట్ కింద నమోదైతే అప్పుడు సర్వీస్ అందుకునే వారి స్థితితో సంబంధం లేకుండా ఈవెంట్స్ నిర్వాహకులే పన్ను చెల్లించాలి. అంటే, అప్పుడు రివర్స్ చార్జ్ మెకానిజం అమలు కాదు.

అలాగే ఈ మధ్య పెళ్లిళ్ల దగ్గర నుంచి చిన్న చిన్న కార్యక్రమాలను కూడా ఈవెంట్స్ వారికి ఇస్తున్నారు. ఇక్కడ రివర్స్ చార్జ్ మెకానిజం అమలు కాదు. ఎందుకంటే, నిర్వహణ బాధ్యత ఈవెంట్స్ సంస్థే చూసినప్పటికీ, ఇక్కడ ఎలాంటి 'స్పాన్సర్‌షిప్ సర్వీస్' అందించటం లేదు. కాబట్టి దీనికి సంబంధించి వసూలు చేసిన మొత్తం మీద సంబంధిత పన్నును ఈవెంట్స్ నిర్వాహకులే చెల్లించాలి. ఈ ఈవెంట్స్‌కు సంబంధించి కొనుగోలు చేసిన సామాగ్రి మీద లేదా పొందిన సర్వీసుల మీద సదరు ఈవెంట్స్ సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకోవచ్చు. అయితే గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే, సర్వీస్ అనేది రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చినప్పుడు తీసుకున్న క్రెడిట్‌ను.. దామాషా పద్ధతిలో రివర్స్ చేయాలి.

ఇదీ GST



రాంబాబు గొండాల

ఉదాహరణకు ఇదే సురభి ఈవెంట్స్ ఒక నెలలో ఒక పెళ్లికి సంబంధించిన ఈవెంట్ నిర్వహించింది. దీనికి గాను ఒక రూ.30 లక్షలు పొందిందనుకుందాం. అలాగే అదె నెలలోనే పైన చెప్పిన అవార్డుల ఫంక్షన్ నిర్వహించింది. దీనికి గాను రూ.20 లక్షలు స్పాన్సర్‌షిప్ సర్వీస్ కింద వివిధ కంపెనీల నుంచి పొందటం జరిగింది. అంటే, ఆ నెలలో జరిగిన మొత్తం సర్వీస్ రూ.50 లక్షల్లో.. రూ.20 లక్షలు అంటే 40 శాతం రివర్స్ చార్జ్ మెకానిజంలో వస్తుంది (సురభి ఈవెంట్స్ అనేది ఒక పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్ అనుకుంటే). కాబట్టి ఆ నెలలో పొందే ఐటీసీలో 40 శాతం రివర్స్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఇలా దామాషా పద్ధతిలో క్రెడిట్ రివర్స్ చేయటం అనేది కేవలం స్పాన్సర్‌షిప్ సర్వీస్‌కు మాత్రమే కాకుండా రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చే అన్ని సరఫరాలకు వర్తిస్తుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్

బజాజ్ అలియాంజ్ లైఫ్ నుంచి బీమా ఏఎస్‌బీఏ

బీమా-అప్లికేషన్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్ (ఏఎస్‌బీఏ) సదుపాయాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రైవేట్ రంగంలోని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) నిర్దేశించిన మేరకు బీమా-ఏఎస్‌బీఏ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిన తొలి ఇన్సూరెన్స్ కంపెనీ ఇదే. దీని ద్వారా పాలసీదారులు యూపీఐలో వన్-టైమ్ మాండేట్‌ను ఎంచుకొని, బీమా ప్రీమియం చెల్లింపు కోసం తమ బ్యాంక్ ఖాతాలో నిర్దేశిత సొమ్మును (గరిష్ఠంగా రూ.2 లక్షలు) బ్లాక్ చేసి పెట్టవచ్చు. తద్వారా బీమా కంపెనీ పాలసీ జారీ చేశాకే, పాలసీదారు ఖాతా నుంచి నిర్దేశిత ప్రీమియం సొమ్మును బదిలీ చేసుకోగలుగుతుంది.

యాంఫీ 3 కొత్త కార్యక్రమాలు

దేశంలో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత పెంపు, పెట్టుబడుల రికవరీ కోసం అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తాజాగా మూడు కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా చిన్న మొత్తాల్లో (కనీసం రూ.250తో) క్రమానుగుత పెట్టుబడులు (సిప్), పాఠశాల విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంచేందుకు తరుణ్ యోజన, గతంలో పెట్టుబడులు పెట్టి మర్చిపోయిన మ్యూచువల్ ఫండ్ ఫోలియోలను శోధించి, రికవరీ చేసుకునేందుకు మిత్రా ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	465
వరంగల్	432	గోదావరి	450
చిత్తూరు	493	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	విజయవాడ	71
వరంగల్	70	గుంటూరు	71
కరీంనగర్	70	ఒంగోలు	71
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	85
కర్నూలు	70	నెల్లూరు	90
విశాఖపట్నం	70	అనంతపురం	90
గోదావరి	71		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,770 ▼	80,450 ▼	1,07,000 ▼
విజయవాడ	89,000 ▲	82,500 ▼	99,000 ▲
విశాఖపట్నం	86,210 ▲	79,030 ▲	96,600 ▼
రాజమండ్రి	87,760 ▲	80,450 ▲	99,900 ▼
ప్రొద్దుటూరు	88,550 ▼	82,000 ▼	98,000 ▼
ముంబై	86,092 ▼	78,860 ▼	97,147 ▲

టన్నెల్‌లో ప్రాణాలు

(మొదటిపేజీ తరువాయి)

గాయపడ్డ వారందరికీ మెరుగైన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీఎం ఆదేశాలతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెలికాప్టర్‌లో హుటాహుటిన దోమలపెంటకు చేరుకున్నారు. ఆయనతోపాటు జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఫైర్ సేఫ్టీ డీజీలు దోమలపెంటకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తక్షణ సహాయక చర్యల గురించి సమీక్ష నిర్వహించారు. చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు రెస్క్యూ టీంలను రంగంలోకి దించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా ప్రమాద స్థలికి చేరుకున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు అధికారులు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారికి అవసరమైన ఆక్సిజన్‌తో పాటు ఆహారం పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి ఆరా తీశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తామని సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయి సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని హామీ ఇచ్చినట్లు సీఎం కార్యాలయం తెలిపింది.


ప్రమాదం జరిగింది ఇలా..

నల్లగొండ జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీరు అందిచాలన్న ఉద్దేశంతో 2005లో అప్పటి ప్రభుత్వం నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట సమీపంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు శ్రీకారం చుట్టింది. దోమలపెంటలోని కృష్ణానది నుంచి మన్నెవారిపల్లి మీదుగా 44.50 కిలోమీటర్ల దూరం టన్నెల్ పనులు జరుగుతున్నాయి. అయితే నాలుగేళ్ల నుంచి టన్నెల్ తవ్వకం పనులు పెడింగ్‌లో ఉన్నాయి. ఈ పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదిక పనులు చేపడుతోంది. దీంతో నాలుగు రోజుల క్రితమే తిరిగి ప్రారంభమయ్యాయి. రోజూ రెండు షిఫ్టులుగా పనులు జరుగుతున్నాయి. మొదటి షిఫ్టు ఉదయం 7 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, రెండో షిఫ్టు సాయంత్రం 3 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నడుస్తోంది. కాగా, శనివారం ఉదయం మొదటి షిఫ్టులో పనిచేయడానికి మొత్తం 54 మంది టన్నెల్ లోపలికి వెళ్లారు. అయితే 14వ కిలోమీటరు వద్ద టీబీఎం త్వవకం పనులు చేపడుతుండగా నీరు, మట్టి లీకేజీ కారణంగా టన్నెల్‌లో సిగ్మెంట్ బ్లాక్ ఆకస్మికంగా విరిగిపడి ప్రమాదం సంభవించింది. దీంతో ఆకస్మికంగా నీటి వరద రావడంతో పాటు రాళ్లు, రప్పలు మట్టి పడటం ప్రారంభమైంది. కేవలం అర గంట వ్యవధిలో 8 మీటర్ల మేర నీరు చేరడంతో ఒక్కసారిగా కలకలంరేగింది. 124 మీటర్ల దూరం వరకు టన్నెల్‌లో పెచ్చులూడిపడ్డాయి. దీంతో టన్నెల్ బోల్ట్ మెషిన్ వెనుకభాగంలో ఉన్న 46 మంది బయటకు పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు. టీబీఎం ముందు భాగంలో ఉన్న 8 మంది టన్నెల్‌లోనే చిక్కుకుపోయారు.



టన్నెల్ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ కార్మికులు





టన్నెల్‌లో ఇరుక్కుపోయిన గురుప్రీత్‌సింగ్, సన్నీ సింగ్

చిక్కుకుపోయినవారు వీరే..

టన్నెల్ తవ్వకంలో టీబీఎం పనులను అమెరికాకు చెందిన రాబిన్ కంపెనీ చూస్తుండగా, సెగ్మెంట్ బ్లాకులను బిగించి.. ఊటనీటితోపాటు మట్టి కూలకుండా చేయడం జేపీ అసోసియేట్స్ చేపడుతోంది. కాగా, ప్రమాదంతో టన్నెల్‌లో జేపీ కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులతోపాటు రాబిన్ కంపెనీకి చెందిన ఇద్దరు టెక్నికల్ ఉద్యోగులు, నలుగురు కార్మికులు చిక్కుకున్నారు. వీరిలో జమ్ము కశ్మీర్‌కు చెందిన సన్నీసింగ్(35), పంజాబ్‌కు చెందిన గురుప్రీత్‌సింగ్(40), ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్ కుమార్(51), శ్రీనివాస్(50), జార్ఖండ్‌కు చెందిన సందీప్ సాహు(38), జగత్ సెస్(37), సంతోష్ సాహు(37), అంజు సాహు(25) ఉన్నారు. వీరిని కాపాడేందుకు తక్షణమే తెలంగాణ, ఏపీకి చెందిన 145 మంది ఎన్డీఆర్ఎఫ్ బలగాలతోపాటు ఎస్డీఆర్ఎఫ్ బలగాలతో సహాయక చర్యలు చేపట్టారు. వారికి ఆక్సిజన్‌తో పాటు ఆహారం పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా లేకపోవడంతో టన్నెల్ లోపలకు డ్రోన్‌కు లైట్లు అమర్చి.. పంపించే ప్రయత్నాలు చేపట్టారు.

పట్టించుకునే నాథుడే లేడు: బాధితులు

సొరంగం పనుల్లో మట్టిలో కూరుకుపోయిన తమ స్నేహితులు, బంధువులను వెలికితీసేందుకు జేపీ కంపెనీ, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రమాదం నుంచి బయటపడ్డ వారు ఆరోపించారు. ప్రమాదం జరిగి 12 గంటలు దాటడంతో సొరంగంలో తమవారి పరిస్థితి ఏవిధంగా ఉందోనని ఆందోళన చెందుతున్నారు. బతుకుదెరువు కోసం తమ కుటుంబ సభ్యులను వదిలేసి జార్ఖండ్ నుంచి వచ్చామని, ప్రమాద వివరాలను బయటికి చెప్పకుండా కంపెనీ యాజమాన్యం తమను బెదిరిస్తోందని అన్నారు. అధికారులు అనుమతిస్తే తామే ప్రమాదం జరిగిన చోటికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటామని చెప్పారు. వీలైనంత తొందరగా తమ వారిని ప్రాణాలతో బయటకు తీసుకురావాలని కోరారు.

నేటి నుంచి రెస్క్యూ ఆపరేషన్

ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనలో రెస్క్యూ ఆపరేషన్ ఆదివారం ఉదయం ప్రారంభం కానుంది. శనివారం ఉదయం ఈ సంఘటన జరిగిన క్రమంలో అప్రమత్తమైన ప్రభుత్వం ఎన్డీఆర్ఎస్, ఆర్మీని వెంటనే సంఘటనా స్థలానికి పంపించింది. అయితే శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉండటం వల్ల ఆ బృందాలు.. హైదరాబాద్ నుంచి దాదాపు 160 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు 3 నుంచి 4గంటల సమయం పట్టింది. ఈ నేపథ్యంలో శనివారం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించడానికి సాధ్యపడలేదు. ఉన్నతాధికారులు సంఘటన స్థలంలోనే బస చేసి ఆదివారం ఉదయాన్నే చర్యలు చేపట్టే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఊపిరాడకపోవచ్చు: నిపుణులు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్నవారికి ఆక్సిజన్ అందుతుందా? లేదా? అనేది సందేహంగా ఉంది. సముద్ర మట్టానికి 834 అడుగుల దిగువన టన్నల్ పనులు జరుగుతున్నాయి. అయితే శనివారం జరిగిన ప్రమాదంలో టన్నెల్ లోపలికి వెళ్లిన ఇంజనీర్లు, సిబ్బందికి ఆక్సిజన్ సిలిండర్లు లేవు. టన్నెల్ పైభాగం కూలిపోవడంతో వెనుక, ముందు భాగం నుంచి ఆక్సిజన్ అందే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో టన్నెల్ బోరింగ్ మెషిన్ ముందు భాగంలో చిక్కుకున్న వారికి ఊపిరి ఆడే పరిస్థితి ఉండదని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. రెస్క్యూ టీంలు కూడా సహాయక చర్యలు ప్రారంభించాలంటే కచ్చితంగా ఆక్సిజన్ సిలిండర్లతో వెళ్లాల్సిందే. డీవాటరింగ్ ప్రకియ, మట్టిదిబ్బలు తొలగించకుండా రెస్క్యూ టీం ముందుకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. ఇదంతా ఎప్పటివరకు కొలిక్కివస్తుందో చెప్పలేకుండా ఉంది. ఈ నేపథ్యంలో టన్నెల్‌లో చిక్కుకున్న వారి పరిస్థితిపై వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. కాగా, శనివారం పొద్దుపోయాక రెండు వాహనాల్లో రెస్క్యూటీం సభ్యులు, నాగర్‌కర్నూలు కలెక్టర్ బదావత్ సంతోష్ టన్నెల్‌లోకి వెళ్లారు. అయితే వారు ఎంతవరకు వెళ్లగలరనేది అంచనా రాలేదు.



సంఘటన జరిగిన వెంటనే ఘటనా స్థలంలో కార్మికులు తమ ఫోన్లలో తీసిన ఫొటో

పరుగులు పెట్టి బయటపడ్డాం



"సొరంగంలోని 13.5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాం. వాటర్ లీకేజీ అవుతోందని, మట్టి రాలుతోందని బోర్ మెషిన్ దగ్గర ఉన్నవారు కొందరు గుర్తించారు. ఈ విషయాన్ని పక్కవారికి చెప్పి అప్రమత్తం చేశారు. అంతలోనే కొందరు కేకలు వేయడంతో అందరం అప్రమత్తమయ్యాం. దీంతో ఎవరికి వారు బయటివైపు కొంత దూరం పరిగెత్తాం. అక్కడి నుంచి ట్రైన్ సహాయంతో టన్నెల్‌లో నుంచి బయటపడ్డాం"

- ఎలక్ట్రీషియన్ శ్రీమన్ కరియ, ప్రత్యక్ష సాక్షి

ఉదయం నుంచి జరిగిందిదే





7.00 54 మంది కార్మికులు టన్నెల్ లోపలకు బయల్దేరారు.

8.00 పనులు ప్రారంభించారు.

8.30 మట్టి కూలడం మొదలయ్యింది. ఊటనీటి ఉధృతి పెరిగింది. మట్టికూలిన వెంటనే పని ప్రదేశం నుంచి సిగ్నల్ పూర్తిగా కట్ అయ్యింది

10.00 తప్పించుకున్న వారు ట్రెయిన్ ద్వారా బయటకు వచ్చారు.

12.30 టన్నెల్ వద్దకు కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ చేరుకున్నారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక బృందాలు చేరుకున్నాయి.

2.00 సీఎం రేవంత్ ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఉత్తమ్ అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

5.30 మంత్రి ఉత్తమ్ బయల్దేరి వెళ్లిపోయారు.

6.30 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఒక బెటాలియన్ స్పెషల్ ఫోర్స్ అక్కడకు చేరుకున్నాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో డ్రోన్‌కు లైట్స్ అమర్చి టన్నెల్ లోపలకు పంపించే ప్రయత్నాలు.



ఎస్ఎల్‌బీసీ ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్ర్భాంతి

- ఎన్డీఆర్ఎఫ్ బలగాలను పంపాలని అమిత్‌షాకు విజ్ఞప్తి
- పరిస్థితిని సమీక్షిస్తున్నాం: బండి సంజయ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ ఘటనపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సమాచారం అందగానే ఆయన ఘటనకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. సొరంగంలో చిక్కుకుపోయిన వారిని వెంటనే బయటకు తీసుకురావడంపై దృష్టి సారించాలని, క్షతగాత్రులకు సరైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఇటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో మాట్లాడి ఎన్డీఆర్ఎఫ్ బలగాలను పంపించాలని, కేంద్రం నుంచి అన్ని రకాల సాయం అందించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నుంచి ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందం, విజయవాడ నుంచి 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఎస్ఎల్‌బీసీ వద్దకు కేంద్ర హోంశాఖ పంపించింది. కాగా, కేంద్ర హోంశాఖ కార్యాలయంలోని కంట్రోల్ రూం ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన సాయం అందిస్తున్నామన్నారు. సంఘటన స్థలంలో 4 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు.

ప్రమాద ఘటనపై విచారణ జరపాలి: సీపీఎం

ఎస్ఎల్‌బీసీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొరంగ ప్రమాదంపై సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేసినట్లు తెలిపారు. .

ఆది నుంచీ ఆటంకాలే!

ఎస్ఎల్‌బీసీ ముందుకు సాగకుండా తరచూ అవరోధాలు .. సొరంగమార్గంలో ఊటనీరు, కూలిపడే రాళ్లు, మట్టి

ఇటీవలే పనులు పునఃప్రారంభం..

హైదరాబాద్, నల్లగొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రాజెక్టు పనులు కుదుపునకు గురయ్యాయి. శనివారం ఇన్‌లెట్ (శ్రీశైలం) నుంచి సీపేజీ పనులు జరుగుతుండగా.. ఒక్కసారిగా పైకప్పు కుప్పకూలటం, 8 మంది చిక్కుకుపోవటం కలకలం రేపింది. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోని సుమారు 4లక్షల ఎకరాలకు సాగునీరు, వేయికి పైగా గ్రామాలకు తాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన ఎస్ఎల్‌బీసీ పనులకు తొలి నుంచీ ఏదో ఒక ఆటంకం ఎదురవుతూనే ఉండటం గమనార్హం. అందువల్లే 2005లో మొదలైన ఈ సొరంగమార్గం పనులు నేటికీ పూర్తికాలేదు. ఎస్ఎల్‌బీసీ పథకంలో భాగంగా శ్రీశైలం రిజర్వాయర్ సమీపంలోని నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట నుంచి నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని నక్కలగండి వరకు 43.93 కిలోమీటర్ల సొరంగం (టన్నెల్) తవ్వాల్సి ఉంది. దీనిని రెండువైపుల నుంచి (ఇన్‌లెట్, ఔట్‌లెట్) తవ్వాలని నిర్ణయించారు. దీంట్లోభాగంగా శ్రీశైలం రిజర్వాయర్‌లోని నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్‌ను 19.500 కి.మీ.లు తవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు 13.935 కి.మీ.లు పూర్తవగా, ఇంకా 6.015 కి.మీ.ల సొరంగం తవ్వాల్సి ఉంది. అయితే, 2019 నుంచి ఊటనీరు వచ్చి చేరటమేగాక మట్టి, రాళ్లు కూలుతుండటంతో పనులు ముందుకు సాగలేదు. ఊటనీటిని తోడేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు, ఊటనీరు మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా సిమెంట్, పాలియేరిథిన్ గ్రౌటింగ్ చేయించారు. ఇటీవలే ఈ పనులను పునరుద్ధరించగా, శనివారం పనులు జరుగుతున్న టన్నెల్ వద్ద సుమారు వంద మీటర్లకు పైగా కూలిపోవడంతో పెనుప్రమాదం చోటుచేసుకుంది. ఈ టన్నెల్ పెండింగ్ పనులకు సంబంధించి 14వ కి.మీ. నుంచి 19.500 కి.మీ. వరకు ఉన్న ప్రాంతంలో ఊటనీరు వస్తోందని, శ్రీశైలం రిజర్వాయర్‌లో నీరు టన్నెల్ కాంటూరు లెవల్స్ కంటే ఎగువన ఉన్నాయని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతూ వస్తున్నారు. అంతేగాక ఈ ప్రాంతంలో గ్రానైట్, రాతిశిలల కంటే మట్టి, సన్న రాళ్లు ఎక్కువగా ఉండటం వల్ల సొరంగం తవ్వగానే పెలుసుబారి కూలిపోతోందని పేర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు గ్రౌంటింగ్ చేస్తున్నా అది కప్పును బలంగా ఉంచలేకపోయిందని, అందువల్లే శనివారం దుర్ఘటన జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇన్‌లెట్ పరిస్థితి ఇలా ఉంటే, నీరు విడుదలయ్యే వైపున్న మన్నేవారిపల్లి నుంచి చేపట్టిన ఔట్‌లెట్ టన్నెల్ మొత్తం పొడవు 23.980 కి.మీ.లు. ఇప్పటివరకు 20.435 కి.మీ.లు పూర్తవగా, ఇంకా 3.545 కి.మీ.లు తవ్వాల్సి ఉంది. పూర్తి విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో, టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా ఈ పనులు చేపట్టారు. అయితే, టీబీఎంలో మరమ్మతులు వస్తే పరికరాలు, బేరింగుల కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తుండటంతో పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ బేరింగ్‌ను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం చెన్నై షిప్‌యార్డుకు చేరిన ఈ బేరింగ్‌ను మరోనెలలో ఎస్ఎల్‌బీసీ పనులు జరిగే మన్నెవారిపల్లి వద్దకు చేర్చేందుకు ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో శీతకన్ను

బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. పలు సందర్భాల్లో అప్పటి సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టు మీద విమర్శలు చేశారు. బేరింగ్ దెబ్బ తింటే కొత్త బేరింగ్ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. 2019 నుంచి ఈ సొరంగమార్గం వద్ద ఎలాంటి పనులు చేపట్టలేదు. కృష్ణా జలాల్లో 45 టీఎంసీల నీటిని ఎస్ఎల్‌బీసీ కింద వినియోగించుకోవడానికి అనుమతివ్వాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)ని బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆ తర్వాత ఆ నీటిని అనూహ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మళ్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం, ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ నిధులను గ్రీన్‌ఛానల్‌లో పెట్టి ఎప్పటికప్పుడు పెండింగ్ బిల్లులు లేకుండా చర్యలు చేపట్టిన నేపథ్యంలోనే ఇన్‌లెట్ వైపు నుంచి వారం కిందటే కాంట్రాక్టు ఏజెన్సీ జేపీ అసోసియేట్స్ పనులు మొదలుపెట్టింది. ఇంతలోనే ఈ దుర్ఘటన జరగడంతో పనులపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి.

ప్రపంచంలోనే అతి పొడవైన టన్నెల్!

2005 నుంచి ఎడమ గట్టు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీని తర్వాత, ఏపీలోని ప్రకాశం జిల్లాలో చేపట్టిన పూలసుబ్బయ్య వెలిగొండ టన్నెల్ పనులు పూర్తయ్యాయి. 2005లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కోసం రూ.2259 కోట్లతో ఈపీసీ విధానంలో టెండర్లు పిలవగా.. జేపీ అసోసియేట్ 9 % తక్కువకే పని దక్కించుకుంది. 1925 కోట్లతో 2005 ఆగస్టు 25వ తేదీన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత పొడవైన టన్నెల్ ప్రాజెక్టుగా నిలవనుంది.

ఆ 8 మందిని కాపాడుతాం

అనుకోని ఘటన జరిగింది..బీఆర్ఎస్ హయాంలోనూ లీకేజీలు

వారు కనీసం ఘటనాస్థలానికి వెళ్లలేదు :ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనుల్లో అనుకోని ఘటన జరిగిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న 8 మందిని కాపాడతామన్నారు. టన్నెల్ కూలిన సమాచారం అందిన వెంటనే సీఎం రేవంత్ ఆదేశాల మేరకు ఉత్తమ్ హుటాహుటిన హెలికాప్టర్‌లో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అధికారులతో మాట్లాడి పరిస్థితిని ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోపల చిక్కుకున్న 8 మందిని సురక్షితంగా తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. టన్నెల్ తవ్వకంలో రాబిన్ సంస్థ ప్రపంచంలోనే పేరెన్నిక గల సంస్థ అని తెలిపారు. వెంటిలేషన్‌కు ఇబ్బందులు లేవన్నారు. ఉత్తరాఖండ్‌లో టన్నెల్‌లో ప్రమాదం జరిగినప్పుడు చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చిన వారిని కూడా సంప్రదింపులు జరిపి... రంగంలోకి దింపుతున్నామన్నారు. అనంతరం శనివారం సాయంత్రం సీఎం రేవంత్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి ఉత్తమ్‌తోపాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో డీవాటరింగ్, డీసిల్టింగ్ పనులు జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. సొరంగం పనులు ఇప్పటికే 33.5 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయని, మరో 9.5 కి.మీ పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. కాగా అనుకోకుండా జరిగిన ఘటనపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కూడా లీకేజీలు జరిగాయని తెలిపారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ పవర్‌స్టేషన్‌లో ప్రమాదం జరిగి 8మంది చనిపోతే బీఆర్ఎస్ వాళ్లు కనీసం అక్కడికి వెళ్లలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డిని అక్కడికి వెళ్లకుండా అరెస్టు చేశారని తెలిపారు. కానీ, ఇప్పుడు సొరంగంలో ఘటన జరిగిన రెండు, మూడు గంటల్లోనే తాము అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టామని, అవాంతరాలన్నింటినీ అధిగమించి ప్రాజెక్టును పూర్తిచేస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్ ప్రకారం ముందుకువెళతామన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. టన్నెల్‌లో 14వ కి.లోమీటర్ వద్ద సీపేజ్‌ను పూడ్చిచేసిన కాంక్రీట్ సెగ్మెంట్ స్లిప్ కావడం వల్లే ప్రమాదం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా?

గతంలోనూ ఊట నీరు వస్తోందనే పనులకు బ్రేక్.. 10 రోజుల క్రితమే సొరంగాన్ని పరిశీలించిన జీఎస్ఐ

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాకే టీబీఎం ప్రారంభం
- పది మీటర్లైనా తవ్వకముందే కూలిన సొరంగం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తాజా ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమా? పనుల ప్రారంభానికి ముందు టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం) ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ఏమరపాటుగా వ్యవహరించడమే ఈ దుర్ఘటనకు కారణమా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ప్రస్తుతం పనులు ప్రారంభించిన ప్రాంతంలో ఒక్క సారిగా ఊట నీరు రావడం, ఆ ధాటికి తేలికపాటి నేల కూలడంతోపాటు పాత, కొత్త సెగ్మెంట్ బ్లాకులు (మట్టి కూలకుండా అడ్డుగా బిగించేవి) పడిపోవడం వల్లే ఈ దుర్ఘటన సంభవించింది. అధిక మొత్తంలో ఊట నీరు వస్తుండడం, డీవాటరింగ్ చేయడం కష్టమవుతున్న తరుణంలోనే 2019లో సొరంగం పనులను పూర్తిగా నిలిపివేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితి ఉందని తెలిసీ.. జీఎస్ఐ ఎలా అనుమతి ఇచ్చిందన్నదీ అంతుచిక్కడం లేదు. ఇందుకు సంబంధించిన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం వల్లే భారీ ప్రమాదం జరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎస్ఎల్‌బీసీ పనులు ఇలా...

ఎస్ఎల్‌బీసీ నిర్మాణానికి సంబంధించి 2005లో జీవో వెలువడగా.. టెండర్లు పూర్తయి 2007లో పనులు ప్రారంభించారు. 2013 వరకు పనులు వేగంగానే నడిచినా.. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ హయాంలో పనులు నెమ్మదించాయి. శ్రీశైలం ఫుల్ రిజర్వాయర్ (ఎఫ్ఆర్ఎల్) 885 ఫీట్లు కాగా.. ఎస్ఎల్‌బీసీ హెడ్ రెగ్యులేటర్‌ను 854 ఫీట్ల వద్ద చేపట్టారు. వాస్తవానికి ఈ టన్నెల్‌ను రెండు వైపుల నుంచి చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్ 19.5కిలోమీటర్లకు గాను 13.935 కిలోమీటర్లు పూర్తయింది. ఇంకా 6,015 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉంది. రెండోవైపున నల్లగొండ జిల్లా మన్నేవారిపల్లి నుంచి ఔట్‌లెట్ టన్నెల్ 23.980 కిలోమీటర్లకు గాను 20.435 కిలోమీటర్లు పూర్తయింది. ఇంకా 3.545 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అయితే, ఇన్‌లెట్ సొరంగం తవ్వే కొద్దీ గ్రావిటీకి వీలుగా లోతు సైతం పెరుగుతూ పోయింది. దీంతో సొరంగంలో ఊటనీరు రావడం, పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలడం నిత్యకృత్యంగా మారింది. సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేస్తూ.. సెగ్మెంట్ బ్లాకులను అమరుస్తూ తవ్వకం చేపట్టారు. ఈ కారణంగానే 2019లో పనులను నిలిపివేశారు.

నాలుగు రోజుల క్రితమే ప్రారంభం

ఎస్ఎల్‌బీసీని రెండేళ్లలో పూర్తిచేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భూములకు నీరివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.2,200కోట్లు గ్రీన్ ఛానల్ ద్వారా ఇస్తామని ప్రకటించింది. 10రోజుల క్రితం టీబీఎం ప్రాంతాన్ని పరిశీలించిన జీఎస్ఐ అధికారులు.. పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో 4రోజుల క్రితమే పనులు ప్రారంభించారు. పది మీటర్లు కూడా తవ్వకముందే ఉదయం షిఫ్టులో ఒక్కసారిగా మట్టి కూలుతున్న శబ్దం వినిపించడంతో టీబీఎంకు ఇవతలివైపు ఉన్న కార్మికులు బయటపడ్డారు. టీబీఎం వద్ద ఉన్న 8మంది మాత్రం ఇరుక్కుపోయారు. సొరంగంలో 124మీటర్ల మేర మట్టి కూలిపోగా, 8మీటర్ల మేర నీరు నిల్వ ఉన్నట్లు సమాచారం. లోపల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సహాయక చర్యలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.



ఆక్సిజన్ సిలిండర్లతో వెళ్తున్న సహాయక సిబ్బంది

4 నెలల కవలల అనుమానాస్పద మృతి


కవలలకు తాగించిన పాల పౌడర్ డబ్బాను చూపిస్తున్న తల్లి

- నిద్రపుచ్చాక ముక్కుల్లోంచి పాలు రావడంతో విషమం
- ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి.. భూపాలపల్లిలో విషాదం

గణపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆ శిశువులు కవలలు.. వయసు నాలుగు నెలలే! బిడ్డలకు ఆ తల్లి పొద్దున, రెండు గంటల తేడాతో రెండుసార్లు పౌడరు పాలు తాగించి పడుకోబెట్టింది. కొద్దిసేపటికి శిశువుల ముక్కుల్లోంచి పాలు రావడం.. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు బిడ్డలను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆ కవలలు మృతిచెందారు. భూపాలపల్లి జిల్లాలో ఈ విషాదం జరిగింది. శిశువుల మృతికి పౌడరు పాలే కారణమని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని గణపురం మండలం గొల్లపల్లికి చెందిన మర్రి అశోక్-లాస్యశ్రీ దంపతులకు రెండో సంతానంగా కవలలు (పాప, బాబు) జన్మించారు. కాన్పు తర్వాత లాస్యశ్రీ అదే మండలంలోని తన పుట్టిల్లయిన నగరపల్లిలో ఉంటోంది. రెండు నెలలుగా కవలలకు పాలు పట్టేందుకు లాస్యశ్రీ ఒకే కంపెనీకి చెందిన పాల పౌడరు ప్యాకెట్లు వాడుతోంది. శుక్రవారం సాయంత్రం అదే కంపెనీకి చెందిన కొత్త పౌడర్ ప్యాకెట్‌ను కొని తెప్పించిన లాస్య.. శనివారం ఉదయం 8 గంటలకు ఒకసారి, రెండు గంటల తర్వాత మరోసారి శిశువులకు ఆ పౌడర్‌తో పాలు కలిపి తాగించి పడుకోబెట్టింది. మధ్యాహ్నం ఒంటిగంటకు నిద్రిస్తున్న కవలలను చూడగా ముక్కుల్లోంచి పాలు రావడాన్ని తల్లి గమనించింది. ఆ బిడ్డలను వెంటనే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్దకు.. అక్కడి నుంచి భూపాలపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు ఆ చిన్నారులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. కవలలకు ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేవని.. పౌడర్ పాలు వికటించడంతోనే మృతిచెందారని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా ఆ పాల ప్యాకెట్ గత ఏడాది సెప్టెంబరులో తయారైందని.. ఈ ఏడాది డిసెంబరు వరకూ ఉపయోగించవచ్చునని దానిపై ఉంది. ఈ ఘటనపై భూపాలపల్లి ఆస్పత్రిలోని వైద్యులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. శిశువులకు పాలు, ఇతర ద్రావణాలను తాగించే క్రమంలో వారికి త్రేన్పులు వచ్చేదాకా వీపు నిమరాలని.. అలా కాకుండా తాగించగానే పడుకోబెడితే.. కొన్ని సందర్భాల్లో ద్రావణాలు ఊపిరితిత్తుల్లోకి చేరి, ముక్కుద్వారా బయటకు వస్తాయని.. అప్పుడు ఊపిరాడక శిశువులు మృతిచెందే అవకాశాలుంటాయని చెప్పారు. పోస్టుమార్టం నివేదిక వస్తే శిశువుల మృతికి కారణాలపై స్పష్టత వస్తుందని చెప్పారు.

నిమ్స్‌లో వెన్నెముకకు అరుదైన శస్త్రచికిత్స

- కాళ్లు చచ్చుబడిపోయిన వ్యక్తికి 'స్పైనల్ కార్డ్ స్టిమ్యులేటర్' అమరిక

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చక్రాల కుర్చీకే పరిమితమైన వ్యక్తికి నిమ్స్ వైద్యులు అరుదైన స్పైనల్ కార్డ్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ సర్జరీ చేయడం ఇదే మొదటిసారి అని వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అంజయ్యకు (42) రెండేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో వెన్నెముకకు తీవ్ర గాయమైంది. ఆ సమయంలో అతనికి నిమ్స్‌లో శస్త్రచికిత్స చేశారు. విరిగిన వెన్నును రాడ్‌లు, స్క్రూలు వేసి సరిచేశారు. అయితే అతనికి కాళ్లలో శక్తి సన్నగిల్లి చచ్చుబడిపోవడంతో వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. అతన్ని ఇటీవల నిమ్స్‌కు తీసుకురాగా.. న్యూరో సర్జరీ వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి ఖరీదైన 'స్పైనల్ కార్డ్ స్టిమ్యులేటర్' పరికరం అమర్చారు. ఇది వెన్నుపూస నొప్పిని తగ్గిస్తుందని, కండరాల కార్యకలాపాలను మెరుగుపరుస్తుందని వైద్యులు తెలిపారు. మూడు నాలుగు నెలల్లో సాధారణ స్థితికి వచ్చి నడిచే సామర్థ్యం వస్తుందని చెప్పారు. ఈ అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులను నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప అభినందించారు. ప్రొఫెసర్ సుచంద భట్టాచార్జీ, డాక్టర్ రాంనాథ రెడ్డి బృందం, ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ స్వప్న, డాక్టర్ అవినాష్ ఈ శస్త్రచికిత్స నిర్వహించారు.

ఏటా 13 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు

- యశోద ఆస్పత్రుల ఎండీ డాక్టర్ జీఎస్‌రావు

దేశంలో ఏటా దాదాపు 13 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని యశోద గ్రూప్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు తెలిపారు. వీటిలో బ్లడ్ క్యాన్సర్ కేసులు గణనీయ నిష్పత్తిలో ఉంటున్నాయని గ్లోబోకాన్-2020 నివేదిక చెబుతోందన్నారు. జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ గణాంకాల ప్రకారం లుకేమియా, లింఫోమా వంటి బ్లడ్ క్యాన్సర్ కేసులు హైదరాబాద్ వంటి నగరాలు, పట్టణాల్లో ఎక్కువగా ఉంటున్నాయన్నారు. శనివారం హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో బ్లడ్ క్యాన్సర్లపై అంతర్జాతీయ సదస్సు 'డెక్కన్ హెమటోలింక్ 2.ఓ'ను జీఎస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ సవాళ్లు విసురుతున్నా ఎముక మజ్జ మార్పిడి, కార్-టీ సెల్ చికిత్స వంటి విధానాలు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయన్నారు. బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడాలంటే రోగులకు చికిత్సతో పాటు మానసిక బలం, ఆర్థిక మద్దతు అవసరమన్నారు. యశోద ఆస్పత్రిలో గత 12 సంవత్సరాలుగా 500కు పైగా ఎముక మజ్జ మార్పిడి చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని, వేలాది మంది బ్లడ్ క్యాన్సర్ రోగులకు చికిత్స అందించామని సీనియర్ హెమటాలజిస్టు డాక్టర్ గణేష్ జైషేత్వార్ తెలిపారు. సదస్సులో 200 మంది జాతీయ, 10 మంది అంతర్జాతీయ బ్లడ్ క్యాన్సర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

పక్కింటి బాలికపై తండ్రీకొడుకుల అత్యాచారం

- బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు వేర్వేరుగా అఘాయిత్యం
- చంపేస్తామని బెదిరించడంతో బయటకు చెప్పని చిన్నారి
- అస్వస్థతకు గురైన కుమార్తెను తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా బయటపడిన ఘోరం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ 70 ఏళ్ల వృద్ధుడు.. 32 ఏళ్ల వయస్సు ఉన్న అతని కుమారుడు.. తమ పక్కింటిలో ఉండే నిండా 13 ఏళ్లు లేని ఓ బాలిక పట్ల కీచకులుగా మారారు. మానసిక ఆరోగ్యం సరిగా లేని చిన్నారి అని కూడా చూడకుండా వేర్వేరుగా అత్యాచారానికి తెగబడి ఆ బాలిక బాల్యాన్ని చిదిమేశారు. ఈ దారుణ ఘటన ఆదిలాబాద్‌లో శనివారం వెలుగు చూసింది. బాధిత కుటుంబం ఆదిలాబాద్‌లోని ఓ కాలనీలో నివాసముంటుంది. కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు.. మానసిక స్థితి బాగోలేని తమ కుమార్తె(13)ను ఇంటి వద్దే ఉంచి పనికి వెళ్లివస్తుంటారు. ఈ క్రమంలో పాపను చూస్తుండమని ఇరుగుపొరుగుకు చెబుతుంటారు. బాధితురాలి పక్కింట్లో ఇంగోలే గంగాధర్(70) అతని కొడుకు ఇంగోలే అనిల్(32), అనిల్ భార్య దుప్పాత్రే సుష నివాసముంటున్నారు. కూలీ పనులు చేసుకునే తండ్రీకొడుకులు పక్కింట్లో ఉన్న బాలికపై కన్నేశారు. వారం క్రితం బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు వేర్వేరుగా అత్యాచారానికి పాల్పడ్డారు. విషయం బయటికి చెబితే చంపేస్తామని బాలికను బెదిరించడంతో ఆ బాలిక ఎవరికీ చెప్పలేదు. ఈ అత్యాచారం సంగతి తెలిసినా సుష నోరువిప్పలేదు. అయితే, బాలిక అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా జరిగిన దారుణం బయటికొచ్చింది. దీంతో నిందితులు గంగాధర్, అనిల్‌తోపాటు వారికి సహకరించిన సుషను పోలీసులు అరెస్టు చేశారు.

మే 13న టీజీ పాలిసెట్-2025!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి (టీజీఎస్‌బీటీఈటీ) మే 13న టీజీ పాలిసెట్-2025ను నిర్వహించనుంది. దరఖాస్తు, ఫీజులు, ఇతర వివరాలతో నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసేందుకు ఎస్‌బీటీఈటీ అధికారులు సిద్ధమయ్యారు.

'టెస్లా' రేసులో ఏపీ.. ముమ్మరంగా ప్రయత్నాలు

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ప్రముఖ విద్యుత్తు కార్ల కంపెనీ టెస్లా తయారీ యూనిట్‌ను ఏపీకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం రేసులోకి దిగింది. టెస్లా కార్ల తయారీ యూనిట్‌ను భారత్‌లో నెలకొల్పడానికి ఆ కంపెనీ సిబ్బంది నియామకాలు కూడా చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ ఈవీ కార్ల తయారీ యూనిట్‌ను ఏపీలో నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. టెస్లాను ఆకర్షించడానికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలో పోర్టు కనెక్టివిటీతో ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

రేపు ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీకి జగన్

- సభ్యత్వం పోయే పరిస్థితి రావడంతో వెనక్కి తగ్గిన వైనం

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే శాసనసభ సమావేశాలకు హాజరవుతానని ఇన్నాళ్లూ భీష్మించిన వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ఎట్టకేలకు మెట్టు దిగారు. సోమవారం నుంచి మొదలవుతున్న 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశాలకు తన ఎమ్మెల్యేలతో కలిసి ఆయన హాజరు కానున్నారు. తొలిరోజు సభలో జరిగే గవర్నర్ ప్రసంగానికి వీరంతా హాజరవ్వనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ పార్టీకి 11 సీట్లు లభించగా.. విపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని జగన్ భీష్మించి కూర్చున్న విషయం తెలిసిందే. అయితే, 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే సభ్యత్వం రద్దవుతుందని ఇటీవల స్పీకర్ చెప్పడంతో జగన్ దిగి రాక తప్పలేదు.

పెండింగ్ బిల్లుల విడుదల కోసం మీరేం చేస్తున్నారు?

- టీజీవో నేతల తీరుపై ఉద్యోగుల మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు కూడా ప్రభుత్వం ఇవ్వకుంటే.. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు ఏం చేస్తున్నారని ఉద్యోగులు నిలదీశారు. టీజీవో కార్యవర్గ సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఇందులో 33 జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, 106 శాఖల ఫోరమ్స్ అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా విభాగం కార్యవర్గం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల బిల్లుల విషయంలో ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కాకపోవడం, పెండింగ్ డీఏలను పరిష్కరించకపోవడంపై కేంద్ర కార్యవర్గాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నిలదీసినట్టు తెలిసింది. ఉద్యోగుల డిమాండ్ల విషయంలో సంఘాలు పోరాటం చేయాలని, ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంటే ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకుల తీరు మారకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలున్నాయని, నెలకు కనీసం రూ.1,500 కోట్ల చొప్పున ఇచ్చినా పది నెలలు పడుతుందన్నారు. నెలకు రూ.300 కోట్లకు మించి బకాయిలు ఇవ్వకుంటే రూ.15 వేల కోట్లు ఎప్పుడు చెల్లిస్తారంటూ టీజీవో నేతలను ఉద్యోగులు ప్రశ్నించారు.

యాదాద్రి జిల్లా నేలపట్లలో బర్డ్‌ఫ్లూ

రాష్ట్రంలో తొలి బర్డ్‌ఫ్లూ కేసు

- స్వాములవారి లింగోటంలో 5 వేల కోళ్లు, చౌటుప్పల్‌లో 2 వేల నాటు కోళ్ల మృతి
- బర్డ్‌ఫ్లూ కాదన్న పశు వైద్యులు


మృతిచెందిన నాటుకోళ్లను పూడ్చిపెట్టేందుకు గోతిలో వేసిన దృశ్యం

చౌటుప్పల్ రూరల్/ఐనవోలు, ఫిబ్రవరి 22: తెలంగాణలో మొదటి బర్డ్‌ఫ్లూ కేసు నమోదైంది. యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్లలోని ఓ కోళ్లఫారమ్‌లోని కోళ్లకు బర్డ్‌ఫ్లూ పాజిటివ్‌గా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ప్రభుత్వ ఆదేశాలతో వివిధ శాఖల అధికారులు శనివారం ఆ కోళ్లఫారాన్ని సందర్శించి శానిటైజ్ చేశారు. చౌటుప్పల్ మండలం నేలపట్లలో పబ్బు మల్లేశానికి చెందిన కోళ్లఫారమ్‌లో ఈనెల 14, 15 తేదీల్లో వెయ్యి కోళ్లకు పైగా మృత్యువాతపడ్డాయి. సమాచారం అందుకున్న పశు వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి, చనిపోయిన కోళ్లను హైదరాబాద్, మధ్యప్రదేశ్‌లోని వెటర్నరీ బయోలాజికల్ పరిశోధన కేంద్రాలకు పంపించారు. ఆ కోళ్లు బర్డ్‌ఫ్లూతోనే మృతిచెందినట్టు హైదరాబాద్ ల్యాబ్ శాస్త్రవేత్తలు శుక్రవారం నిర్ధారించి, ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ జానయ్య, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ యశోద, మండల పశువైద్యాధికారులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కోళ్లఫారాన్ని సందర్శించారు. సుమారు 50 మంది సిబ్బందితో కోళ్ల ఫారాన్ని శానిటైజ్ చేయించారు. ఫారంలోని మట్టిని తొలగించి, ఎక్స్‌కవేటర్‌తో ఓ గోతిలో పూడ్చిపెట్టారు. ఈ పరిసరాల్లోని ఖాళీగా ఉన్న ఆరు కోళ్ల ఫారాల్లోనూ శానిటైజ్ చేయించారు. గ్రామాన్ని పరిసరాల్లోని 10 కిలోమీటర్ల ప్రాంతాన్ని నిఘా జోన్‌గా.. ఒక కిలోమీటర్ వరకు నిషేధిత ప్రాంతంగా ప్రకటించి, ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామంలోని నాటు కోళ్లను, బ్రాయిలర్ కోళ్లను చంపివేయాలని ఆదేశించారు. సమీప గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో ఉన్న కోడి గుడ్లను పారబోశారు. ఇతరులు ఈ గ్రామంలోకి రాకుండా.. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందిని నియమించారు. కాగా.. ఇదే మండలంలోని స్వాములవారి లింగోటంలో 5 వేల కోళ్లు మృతిచెందాయి. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన నేలపట్లకు ఈ గ్రామం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. స్వాములవారి లింగోటానికి చెందిన ఆకుల మధు, ఆకుల రవికి 12 వేల కోళ్ల సామర్థ్యంతో షెడ్లు ఉన్నాయి. సోమ లక్ష్మమ్మకు 7 వేల కోళ్ల సామర్థ్యంతో ఫారమ్ ఉంది. ఆకుల మధు ఫారంలో 1,500.. రవి షెడ్‌లో మరో 1,500, లక్ష్మమ్మ ఫారంలో 2 వేల కోళ్లు మృతిచెందాయి. నేలపట్లలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అవ్వడంతో.. రవి, మధు తమ వద్ద మిగిలిన 9 వేల కోళ్లను పూడ్చిపెట్టారు. ఈ ప్రాంతాన్ని పశువైద్యులు ఇంకా సందర్శించాల్సి ఉంది.

2 వేల నాటు కోళ్ల మృతి

రెండు రోజుల వ్యవధిలో 2వేల నాటు కోళ్లు మృత్యువాతపడిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలో కలకలం లేపింది. తొలుత బర్డ్‌ఫ్లూగా భావించి ఆందోళన చెందగా, వెటర్నరీ వైద్యులు కోళ్లకు పోస్టుమార్టం చేసి.. బర్డ్‌ఫ్లూ కాదని తేల్చారు. కొక్కెర వ్యాధితో ఈ కోళ్లు మృతిచెందినట్లు స్పష్టం చేశారు. కోళ్ల మృతిచెందడంతో పెంపకందారులైన స్వయం సహాయక బృందం(ఎస్‌హెచ్‌జీ) సభ్యురాలు నోముల సంగీతకు రూ.8లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. నాలుగు నెలల క్రితం శ్రీనిధి కింద రూ.3 లక్షల రుణం తీసుకున్న సంగీత.. 2,400 నాటుకోడి పిల్లల్ని తీసుకువచ్చి, ఫారంలో పెంచుతున్నారు. కోళ్ల వయసు ఐదో నెలకు చేరుకోగా.. ఇప్పటి వరకు వాటి దానాకు, నిర్వహణ ఖర్చులకు, వ్యాక్సిన్లకు కలిపి రూ.8 లక్షల మేర పెట్టుబడి పెట్టారు. శుక్ర, శనివారాల్లో 2 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. కోళ్ల పెంపకంతో అప్పులపాలయ్యానని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని సంగీత కోరుతున్నారు.

సచివాలయంలో ప్రొటోకాల్ భోజనం మారింది!

- భోజన నాణ్యతపై సీఎం ఆరా.. మార్చాలని అధికారులకు ఆదేశం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హైదరాబాద్/కరీంనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలోని ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర అధికారుల కార్యాలయాలకు ప్రొటోకాల్ విభాగం ఆధ్వర్యంలో అందించే భోజనం మారింది. ఆయా పేషీల అధికారులు, ఉద్యోగులకు అందుతున్న భోజనం నాసిరకంగా ఉందంటూ అసంతృప్తులు వ్యక్తమవుతున్న నేపథ్యంలో 'ఆ భోజనం మాకొద్దు బాబోయ్!' శీర్షికన ఈనెల 19న 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. సచివాలయంలో ప్రొటోకాల్ విభాగం పర్యవేక్షణలో అందిస్తున్న భోజనం, దాని నాణ్యతపై ఆరా తీశారు. దీనిపై విచారణ చేపట్టాలని సాధారణ పరిపాలన శాఖ అధికారులను ఆదేశించారు. ఆ విచారణలో పలు పేషీల్లో భోజనం నాసిరకంగా వస్తుందన్న విషయాన్ని గుర్తించిన అధికారులు.. అదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని సీఎం అధికారులకు సూచించినట్టు తెలిసింది. ఆయన సూచనలతో సాయంత్రం అందించే చిరుతిళ్లలోనూ మార్పులు జరిగాయి. దీంతో ఆయా పేషీల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాలిన గాయాలతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితమైన సలీమాను ఆదుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం గుండ్ల సింగారం గ్రామానికి చెందిన సలీమా దీన స్థితిలో ఉండటం.. ఆమెకు పదేళ్ల కూతురు రిజ్వాన అన్ని సపర్యలు చేస్తుండటం తెలిసి చలించిపోయారు. తక్షణమే సలీమాకు తగిన వైద్యసాయాన్ని అందించడంతో పాటు దివ్యాంగుల పింఛన్, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాగా 24న సీఎం రేవంత్ కరీంనగర్ జిల్లాలో పర్యటించబోతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి తప్పిన ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో శేఖర్‌రావుకు స్వల్పగాయాలు
- లారీ ఢీ కొట్టడంతో ధ్వంసమైన కారు



కోరుట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్-ఆదిలాబాద్-మెదక్-నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు స్వల్పంగా గాయపడ్డారు. తన కారులో ఆయన నిజామాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా కోరుట్ల దగ్గర ఓ వంతెనపై ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కన్నతండ్రిని చంపిన కొడుకు

- కత్తితో పొడిచి హత్య
- పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఘాతుకం


తండ్రి మొగలిపై దాడి చేస్తున్న సాయికుమార్

ఏఎస్‌రావునగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కన్నతండ్రిపై కత్తితో దాడి చేసి హతమార్చాడు. దాదాపు 12 సార్లు విచక్షణారహితంగా పొడిచి తండ్రి ప్రాణం తీశాడు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో శనివారం మధ్యాహ్నం ఈ దారుణం జరిగింది. పెద్దపల్లి జిల్లా వెన్నంపల్లికి చెందిన అరెల్లి మొగిలి(45)కి భార్య లావణ్య, కొడుకు సాయికుమార్(25), కుమార్తె ఉన్నారు. హైదరాబాద్ వలస వచ్చిన ఈ కుటుంబం లాలాపేటలో నివాసముంటోంది. సాయికుమార్ ఇంటర్ వరకు చదివాడు. తండ్రీకొడుకులు ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థలో పని చేస్తున్నారు. అయితే, మద్యానికి బానిసైన మొగిలి.. కుటుంబసభ్యులను నిత్యం వేధింపులకు గురిచేసేవాడు. తండ్రి తీరుతో సాయికుమార్ విసిగిపోయాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం కూడా మొగిలి డబ్బు కోసం ఇంట్లో గొడవపడ్డాడు. అనంతరం లాలాపేటలో సిటీ బస్సు ఎక్కి ఈసీఐఎల్‌కు బయలుదేరాడు.. ఆవేశంలో ఉన్న సాయికుమార్.. ద్విచక్రవాహనంపై బస్సును అనుసరించాడు. కుషాయిగూడ పోలీసుస్టేషన్‌కు సమీపంలోని ఈసీఐఎల్ చౌరస్తాలో బస్సు దిగిన తండ్రిపై దాడి చేశాడు. రోడ్డుపై పడేసి వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచాడు. విషయం తెలిసి వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. దాదాపు 12 కత్తిపోట్లకు గురై రక్తపు మడుగులో పడి ఉన్న మొగిలిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకెళ్లిన కాసేపటికే మొగిలి చనిపోయాడు. ఇక, నిందితుడు సాయికుమార్‌ను పోలీసులు ఘటనాస్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు.

టీచర్ కొట్టాడని స్కూలు భవనంపై నుంచి దూకి..

- 13 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య.. ఉప్పల్‌లో ఘటన


సంగారెడ్డి (ఫైల్)

ఉప్పల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బడిలో తన స్నేహితుల ముందు ఉపాధ్యాయుడు చెంపదెబ్బ కొట్టడాన్ని ఆ విద్యార్థి తీవ్ర అవమానంగా భావించాడు. స్కూలు భవనం నాలుగో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆ విద్యార్థి మృతిచెందాడు. ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో శనివారం ఉదయం 9:30 గంటలకు ఈ ఘటన జరిగింది. మృతుడు 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల సంగారెడ్డి! స్నానం చేయించి.. యూనిఫాం వేసి.. టిఫిన్ బాక్సు, బ్యాగుతో బాబును బడికి పంపిన అరగంటకే ఈ దుర్వార్త చెవినపడటంతో ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. బోడుప్పల్‌లోని ద్వారకానగర్‌కు చెందిన ధర్మారెడ్డి-సంగీత దంపతులకు సంగారెడ్డి రెండో సంతానం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శుక్రవారం బడిలో తమ అల్లరి చేష్టలు కనిపించకూడదనే ఉద్దేశంతో తోటి విద్యార్థుల సూచన మేరకు సీసీ కెమెరాల యాంగిల్‌ను సంగారెడ్డి మార్చాడు. ఇది తెలిసి వ్యాయామ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, సంగారెడ్డిని మందలించాడు. శనివారం ఉదయం సంగారెడ్డి బడికి రాగానే కొందరు తోటి విద్యార్థులు అతడిని ఉద్దేశించి 'నీకు దమ్ముంటే మరోసారి సీసీ కెమెరాను ముట్టుకో చూద్దాం' అంటూ సవాలు చేశారు. దీంతో సంగారెడ్డి వెళ్లి సీసీ కెమెరాలను కదిలించాడు. విషయం తెలుసుకున్న పీఈటీ ఆంజనేయులు తరగతి గదికొచ్చి సంగారెడ్డిని అందరి ముందు నిల్చోబెట్టాడు. 'మీ తల్లిదండ్రులను పిలిచి విషయం చెబుతాను.. టీసీ ఇచ్చి పంపిస్తాను' అని మందలిస్తూ సంగారెడ్డి చెంపపై కొట్టాడు. అందరి ముందూ తనను కొట్టడాన్ని సంగారెడ్డి అవమానంగా భావించి ఏడ్చాడు. 'అమ్మా.. నన్ను క్షమించు' అని నోట్‌బుక్‌లో రాసుకున్నాడు. కొద్దిసేపటికి.. వాష్‌రూమ్‌కు వెళ్లి ముఖం కడుక్కొని వస్తానని క్లాస్ టీచర్‌కు చెప్పి బయటకు వెళ్లాడు. నేరుగా నాలుగో అంతస్తు టెర్రస్‌పైకి చేరుకొని అక్కడి నుంచి కిందకు దూకాడు. రక్తపు మడుగులో కొట్టుకుంటున్న సంగారెడ్డిని స్కూలు యాజమాన్యం ఓ ప్రైవేటు ఆస్పత్రికి.. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించింది. అప్పటికే సంగారెడ్డి మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. ఈ ఘటనతో యాజమాన్యం, స్కూలు నుంచి పిల్లలందరినీ ఇళ్లకు పంపించి వేసింది. మృతుడి తల్లి సంగీత, బంధువులు, విద్యార్థి సంఘాలు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు. పాఠశాల యజమాని, పీఈటీ ఆంజనేయులు కారణంగానే సంగారెడ్డి మృతిచెందాడని.. వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పాఠశాల యజమాని, పీఈటీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

25 గంటలు మృత్యువుతో పోరాడి ఓడిన బాలుడు

మేనత్తను చూసేందుకు వచ్చి లిఫ్టులో ఇరుక్కుని తిరిగిరాని లోకాలకు...


బాలుడు అర్ణవ్ (ఫైల్)

మంగళ్‌హాట్/అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో లిఫ్టుకి, గోడకు మధ్య ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడిన ఆరేళ్ల బాలుడు అర్ణవ్ 25 గంటల పాటు మృత్యువుతో పోరాడి శనివారం తుది శ్వాస విడిచాడు. నిలోఫర్ ఆస్పత్రి వైద్యులు ఎంత ప్రయత్నించినా ప్రాణాలు కాపాడలేకపోయారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఆ చిన్నారి తిరిగిరాని లోకానికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అర్ణవ్ తన తాత విజయ్‌కుమార్‌తో కలిసి మేనత్త నివాసం ఉంటున్న హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ శాంతినగర్ మఫర్ కంఫాటెక్ అపార్ట్‌మెంట్‌కు వచ్చాడు. లిఫ్ట్ తలుపులు తెరుచుకోగానే లోపలికి వెళ్లి మూడో అంతస్తు బటన్ నొక్కాడు. తాత ఎక్కేలోపే తలుపులు మూసుకోకుండానే లిఫ్ట్ పైకి కదిలిపోయింది. దాంతో అర్ణవ్ కంగారు పడి లిఫ్ట్ మొదటి అంతస్తుకు చేరుకోకముందే దూకేయడంతో లిఫ్ట్‌కు, గోడకు మధ్యలో ఇరుక్కుపోయాడు. పోలీసులు, డీఆర్ఎఫ్ బృందం దాదాపు మూడున్నర గంటలు శ్రమించి అర్ణవ్‌ను వెలికితీసి నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. లిఫ్ట్‌లో ఇరుకున్న సమయంలో మెదడుకు ఆక్సిజన్ అందక కిడ్నీలు, ఇతర అవయవాలు దెబ్బతినడంతో అర్ణవ్ పరిస్థితి విషమించిందని, ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వైద్యులు తెలిపారు. కాగా, తమ మాట కాదని మతాంతర వివాహం చేసుకున్న కూతురి ఆచూకీ తెలుసుకున్న విజయ్‌కుమార్ మఫర్ కంఫాటెక్ అపార్ట్‌మెంట్‌కు వచ్చాడు. మేనత్తను చూపిస్తానంటూ మనుమడు అర్ణవ్‌ను కూడా తీసుకొచ్చాడు. కళ్లెదుటే మనుమడు ప్రమాదంలో చిక్కుకోవడంతో ఆయన విలవిలలాడిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడు తమకు కాకుండాపోయాడని అర్ణవ్ తల్లిదండ్రులు అజయ్‌కుమార్ మసల్కర్, సుచిత మసల్కర్ కన్నీరుమున్నీరయ్యారు. వీరు నగరంలోని గోడేకి కబర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు.

కొన్ని నెలలుగా ఇలాగే లిఫ్ట్!

మఫర్ కంఫాటెక్ అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్‌లో అధునాతనమైనదే అయినప్పటికీ సాంకేతిక సమస్యతో కొన్ని నెలలుగా బటన్ నొక్కిన వెంటనే తలుపులు మూసుకోకుండానే పైకి వెళుతోందని అపార్ట్‌మెంట్ వాసులు తెలిపారు. లిఫ్ట్ నిర్వహణ బాధ్యత చూడాల్సిన వారు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఈ దుర్ఘటనకు ముఖ్య కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.